fb/prajasakti, www.prajasakti.com

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 5 | విజయవాడ, శుక్రవారం 5 జనవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

'పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు' పై సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ : పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణకు సంబంధించి కేంద్రం, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు గురువారం నోటీసులు జారీచేసింది. ఈ చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలని కోరుతూ ఓ స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ నోటీసులు ఇచ్చింది. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. అనంతరం విచారణను నాలుగువారాలకు వాయిదావేసింది. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణ చట్టం 2013 కింద అన్ని జిల్లాల్లో నోడల్ ఆఫీసర్లను నియమించాలని, స్థానిక, అంతర్గత కమిటీలను ఏర్పాటుచేయాలని స్వచ్ఛంద సంస్థ తన పిటిషన్‌లో కోరింది. ఈ చట్టం ప్రకారం పని ప్రదేశంలో లైంగిక వేధింపుల కేసులను మిగతా 9లో

తలాక్‌పై తేల్చని రాజ్యసభ

- చర్చ జరగకుండా బిజెపి వ్యూహం
- జిఎస్‌టి బిల్లు ముందుకు
- ప్రతిపక్ష సభ్యుల నిరసనలతో నేటికి వాయిదా

న్యూఢిల్లీ : రాజ్యసభలో ట్రిపుల్ తలాక్ బిల్లుపై గురువారం కూడా చర్చ జరగలేదు. పెద్దల సభలో ఈ బిల్లుపై చర్చ కొనసాగకుండా అధికార బిజెపి వ్యూహం పన్నింది. వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) సవరణ బిల్లుపై మొదట చర్చిద్దామని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతిపక్ష సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. ట్రిపుల్ తలాక్ బిల్లును ప్రభుత్వం తన కాళ్ల కింద కావాలనే తొక్కిపెడుతోందని విమర్శించారు. వాస్తవానికి తలాక్ బిల్లుకు ఇద్దరు ప్రతిపక్ష సభ్యులు సవరణ తీర్మానాలను ప్రవేశపెట్టగా..దానికి రాజ్యసభ ఛైర్మన్ అనుమతించారు కూడా. దీంతో ప్రతిపక్షం నైతికంగా విజయం సాధించినట్లైంది. సభలో ఏకాభిప్రాయం లేనందున జిఎస్‌టి సవరణ బిల్లుపై చర్చ జరిపిన తర్వాత ట్రిపుల్ తలాక్ సంగతి చూద్దామని డిప్యూటీ ఛైర్మన్ ప్రకటించడంతో ప్రతిపక్ష సభ్యులు తీవ్ర స్థాయిలో నిరసన తెలిపారు. దీంతో సభను శుక్రవారానికి వాయిదా వేశారు. ట్రిపుల్ తలాక్ బిల్లును రాజ్యసభలో బుధవారమే ప్రవేశపెట్టారు. ఈ బిల్లును సెలెక్ట్ కమిటీ పరిశీలనకు పంపాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల వాదోపవాదాలతో సభ గురువారానికి వాయిదా పడింది. గురువారం అసలు చర్చకే రానివ్వకుండా బిజెపి వేరే మిగతా 9లో



ఆధార్ భద్రత డొల్ల

రూ 500కే అందరి వివరాలు



న్యూఢిల్లీ : ఆధార్ కార్డు వివరాల భద్రత పై కేంద్ర ప్రభుత్వం చెబుతున్న మాటలు ఉత్తవేనని మరోసారి తేలింది. కేవలం 500 రూపాయలు చెల్లించి, పదినిమిషాలు ఓపిక పడితే చాలు. ఒకటి, రెండు కాదు. దాదాపుగా దేశ ప్రజలందరి వివరాలు అందుబాటులోకి వస్తున్నాయి. అదికూడా ఫోటోగ్రాఫులు, వేలిముద్రలు, కంటి నమూనాలతో సహా! దిగ్భ్రాంతి కలిగించే ఈ వాస్తవం ట్రిబ్యూన్ పరిశోధనలో వెలుగులోకి వచ్చింది. ఆధార్ వివరాల భద్రతపై గతంలోనే అనుమానాలు తలెత్తినప్పటికీ ఈ స్థాయిలో వివరాలు వెల్లడికావడం ఇదే ప్రథమం, దీంతో ట్రిబ్యూన్ కథనం ప్రభుత్వ వర్గాల్లో కలకలం రేపింది. ఆధార్ వివరాలు సురక్షితంగా ఉన్నాయని చెప్పుకోవడానికి యుడిఎఐ అనేక తిప్పలు పడుతోంది. 'సమాచారం సురక్షితమేనని చెబుతూనే దుర్వినియోగం జరిగిఉంటుందన్న అనుమానాన్నీ వ్యక్తం చేసింది.

పరిశోధన జరిగిందిలా ...

విక్రయానికి ఆధార్ వివరాలు లభిస్తున్నాయంటూ వచ్చిన సమాచారంతో ట్రిబ్యునల్ బృందం రంగంలోకి దిగింది. మధ్యవర్తి ద్వారా ఆధార్ వివరాల అమ్ముతున్న ముఠా ఏజెంట్‌ను కలిసింది. ట్రిబ్యూన్ కథనం ప్రకారం 500 రూపాయలు పేటిఎం ద్వారా మిగతా 9లో

రాజధానికి మరో రూ.1484 కోట్ల రుణం

కేంద్రంలో ఇతర శాఖలు అంగీకరిస్తేనే..

ప్రపంచ బ్యాంకుకు త్వరలో ప్రతిపాదనలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అమరావతి గ్రీన్ నగరానికి రుణం ఇప్పించేందుకు ఎట్టకేలకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసింది. అయితే అవసరమైన పత్రాలు అందిస్తే వాటిని ఇతర కేంద్ర ప్రభుత్వ శాఖలకు పంపిస్తామని, వాటి నుంచి కూడా అభ్యంతరాలు లేకపోతేనే ఈ ప్రతిపాదనలను ప్రపంచ బ్యాంకుకు పంపిస్తామని పేర్కొంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి కొంత ఊరట లభించినట్టయింది. రాజధాని నిర్మాణంలో భాగంలో ఈ ప్రాంతాన్ని పచ్చదనంతోపాటు, కాలుష్య నివారణ, స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఇప్పటికే ఎపి అమరావతి గ్రీనింగ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును ఏర్పాటుచేసింది. ఈ సంస్థ ద్వారా పచ్చదనం కార్యక్రమాన్ని అమలు చేసేందుకు, రాజధానిని గ్రీన్ అమరావతిగా రూపొందించేందుకు 1484 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలను కేంద్రాన్ని పంపించింది. ప్రపంచబ్యాంకు ద్వారా ఈ నిధులను రుణంగా ఇప్పించాలని కోరింది. అయితే ప్రతిపాదనల్లో పూర్తి స్థాయి వివరాలు సమర్పించలేదని, కొన్ని అంశాల్లో స్పష్టత లేదంటూ గతంలో జరిగిన అనేక భేటీల్లో నీతీ అయోగ్ ఈ ప్రతిపాదనలపై అనేక అభ్యంతరాలను వ్యక్తం చేసింది. మరిన్ని అదనపు వివరాలు కావాలంటూ రాష్ట్ర అధికారులకు మిగతా 9లో

త్వరలో 2.50 లక్షల గృహ ప్రవేశాలు

- అంగన్వాడీ కేంద్రాల ద్వారా కూరగాయల పెంపకం
- ఉద్దానం కిడ్నీ బాధితుల మందులకు రూ.10 కోట్లు మంజూరు
- మార్చి 31 నాటికి ఒడిఎఫ్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం
- ఇచ్ఛాపురం జన్మభూమి సభలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 2.50 లక్షల గృహప్రవేశాలను త్వరలో చేయిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మున్సిపాల్టీలోని సురంగిరాజా మైదానంలో గురువారం నిర్వహించిన జన్మభూమి-మా ఊరు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతేడాది అక్టోబరు రెండో తేదీన లక్ష గృహ ప్రవేశాలు చేయించామన్నారు. గ్రామాల్లో ఐదు నుంచి పదెకరాల ఎకరాలను తీసుకుని అంగన్వాడీ కేంద్రాల ద్వారా కూరగాయల పెంపకం చేపట్టనున్నామని తెలిపారు. కూరగాయల పెంపకానికి అవసరమైన నిధులను పంచాయతీలు సమకూర్చుతాయన్నారు. ఇందుకు ఉపాధి హామీ కూలీలను ఉపయోగించుకుంటామని తెలిపారు. బహిరంగ మలవిసర్జన రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే ఆరు జిల్లాలు ఒడిఎఫ్ జిల్లాల జాబితాలో చేరాయని, మరో ఏడు జిల్లాల్లో మరుగుదొడ్లను పూర్తి స్థాయిలో చేపట్టాల్సి ఉందని తెలిపారు.



శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో జరిగిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రబాబు

రాష్ట్రంలోని చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో 20 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులున్నారని, ఆ సంస్థ ఆస్తులను వేలం వేసి ప్రతి ఒక్కరికీ డబ్బులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ ఛార్జీలను పెంచబోమని, రాష్ట్రంలో భవిష్యత్తులోనూ విద్యుత్ సమస్య రానీయబోమని తెలిపారు. ఉద్దానం కిడ్నీ బాధితుల మందుల కోసం రూ.పది కోట్లు కేటాయిస్తామన్నారు. మహాప్రస్థానం పేరుతో రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో శ్మశానాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. అనంతరం పలు శాఖలకు సంబంధించి అర్హులైన మిగతా 9లో

పిఎన్‌ఎం అధ్యక్ష, కార్యదర్శులుగా బాషా, అనిల్

47 మందితో రాష్ట్ర నూతన కమిటీ



ఎస్‌జిఎం బాషా
అధ్యక్షుడు



అనిల్
కార్యదర్శి

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా కేంద్రంలో మూడు రోజులపాటు ఉత్సాహభరితంగా సాగిన ప్రజానాట్యమండలి 9వ రాష్ట్ర మహాసభలు జయప్రదంగా ముగిశాయి. చివరిరోజయిన గురువారంనాడు మహాసభ 47 మందితో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకుంది. అధ్యక్షులుగా ఎస్‌జిఎం బాషా, కార్యదర్శిగా అనిల్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా విజయ్‌కుమార్, యాదగిరి, సురేష్ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా క్రాంతికుమార్, మంగరాజా, కోశాధికారిగా సుభాషిణి ఎన్నికయ్యారు. వీరితోపాటు 40 మంది రాష్ట్ర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రజా కళలు, కళాకారులు ఎదుర్కొంటున్న సవాళ్లతోపాటు, జానపద కళాకారులు పడుతున్న ఇబ్బందులు, ప్రభుత్వ వైఖరులు, భావ ప్రకటన స్వేచ్ఛపై జరుగుతున్న దాడి తదితర అంశాలపై మహాసభ సుదీర్ఘంగా చర్చించింది.

ఎటిఎంల నుంచి రూ.200 నోట్లు

బ్యాంకులకు ఆర్‌బిఐ ఆదేశాలు

6



సిపిఎం తూర్పుగోదావరి (రాజమహేంద్రవరం) జిల్లా 22వ మహాసభల సందర్భంగా గురువారం నిర్వహించిన మహాప్రదర్శన జనసందోహంతో పోటెత్తింది. వీధులన్నీ అరుణవర్ణం దాల్చాయి. కోటిపల్లి బస్టాండ్ వద్ద కొమ్ము డాన్సులు, డప్పు దరువులు సందడి చేశాయి. (వార్త 7వ పేజీలో)

నరసరావుపేట కేంద్రంగా కిడ్నీ రాకెట్ ?

నకిలీ ధృవపత్రాలతో ఆపరేషన్లు

ప్రజాశక్తి - నరసరావుపేట రూరల్ (గుంటూరు)

గుంటూరు జిల్లా నర్సరావుపేట కేంద్రంగా కిడ్నీల రాకెట్ వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తోంది. కొన్ని నెలలుగా జరుగుతున్న కిడ్నీల మార్పిడి వ్యాపారంలో సూత్రదారులు రాష్ట్ర బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు, టిడిపి నాయకుడు కపిలవాయి విజయ్‌కుమార్ పాత్రధారిగా ఉన్నారు. బాధితులంతా తండాల్లోని గిరిజనులే. మారుమూల గ్రామాలు, తండాలలోని గిరిజనుల పేదరికం, నిరక్షరాస్యతే పెట్టుబడిగా వారి కిడ్నీలతో వ్యాపారం చేస్తూ కొంత మంది నాయకులు లక్షలు గడిస్తున్నారు. గుంటూరు జిల్లా నరసరావుపేటలోని కొందరు దళారులు, టిడిపి నాయకులు ఇందులో కీలక భూమిక పోషిస్తున్నారు. ఈ దళారులకు రెవెన్యూ అధికారుల సహాయ సహకారాలు ఉన్నట్లు నేటి సంఘటనతో తేటతెల్లమైంది. ఇప్పటికే ముగ్గురి కిడ్నీలను మార్పిడి చేయగా మరో పేరుతో కిడ్నీ మార్పిడి విషయంలో పోలీసులు నకిలీ ధ్రువపత్రాల దళారుల ముఠా గుట్టు రట్టు చేశారు. జిల్లాలోని మిగతా 9లో

మహిళల ప్రవేశంపై నిషేధం లేదు

రాజకుటుంబాల మహిళలు తరచుగా సందర్శించేవారు

శబరిమల దేవాలయంలోకి మహిళల ప్రవేశంపై కేరళ దేవాదాయశాఖ మంత్రి



తిరువనంతపురం: శబరిమల దేవాలయం లోకి మహిళలు ప్రవేశించటంపై నిషేధం లేదని, గతంలో మహిళలు, ప్రత్యేకంగా రాజకుటుంబా లకు చెందిన మహిళలు తరచుగా శబరి మల దేవాలయాన్ని సందర్శించేవారని కేరళ దేవాదాయశాఖ మంత్రి కడకంపల్లి సురేంద్రన్ చెప్పారు. శబరిమల దేవాలయం లోకి పది నుండి యాభై సంవత్సరాల వయసున్న మహిళల ప్రవేశాన్ని నిషేధించటం వివక్ష, రాజ్యాంగ ఉల్లంఘన కిందికి వస్తుందా అన్న అంశంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతున్న సందర్భంలో దేవాదాయశాఖ మంత్రి ఈ ప్రకటన చేశారు. 1940లలో తనను ఒడిలో కూర్చోబెట్టుకుని తనతల్లి శబరిమల దేవాలయంలో పూజాకార్యక్రమాలు నిర్వహించిందని తనకు చెప్పేవారని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు సలహాదారుగా పనిచేసిన టి కె ఎ నాయర్ చెప్పారు. శబరిమలకు వచ్చే యాత్రికులకు సౌకర్యాలను సమకూర్చటం కోసం ఏర్పాటు చేసిన సలహా కమిటీకి నాయర్‌ను గతవారం ఛైర్మన్‌గా నియమించారు.

ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసులో ఎల్వీ సుబ్రహ్మణ్యంపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్

ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసులో సీనియర్ ఐఎఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యంపై సీబీఐ పెట్టిన కేసును హైకోర్టు కొట్టి వేసింది. ఏపీ క్రీడలు, యువజన సర్వీసుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ హోదాలో ఆయన పని చేస్తున్నారు. మౌలిక సదుపాయల కల్పన సంస్థ ఎండీ ఉండగా ఎమ్మార్‌కు భూముల కేటాయింపుల్లో ఆయనపై పాత్రపై సీబీఐ దాఖలు చేసిన కేసులో ఆధారాలు లేవని హైకోర్టు న్యాయమూర్తి శివశంకర్‌రావు గురువారం తీర్పు చెప్పారు. భూ కేటాయింపుల్లో ఎండీగా ఆయన పాత్ర లేదని, ప్రభుత్వమే భూకేటాయింపులు జరిపిందని 170 పేజీల తీర్పులో హైకోర్టు పేర్కొంది. చాముండేశ్వరినాథ్‌కు విల్లా కేటాయింపునకు ఎల్వీ సిఫార్సు చేశారన్న అభియోగానికి కూడా ఆధారాలు లేవని పేర్కొంది. ఐఎఎస్ అధికారుల ప్రాసిక్యూషన్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని, రాష్ట్రం ఎలా అనుమతి ఇస్తుందని న్యాయమూర్తి ప్రశ్నించారు.

ఆహ్లాదం

రాష్ట్ర పర్యాటకశాఖ కృష్ణానదిలో ఏర్పాటు చేయనున్న హౌస్‌బోట్



కేరళ తరహాలో కృష్ణా జలాల్లో హౌస్ బోట్లు

ఎస్సీల ఉపాధికి అవకాశం • పర్యాటక శాఖ కార్యదర్శి మీనా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేరళ పర్యాటక రంగం మాదిరిగా కృష్ణా నదీ జలాల్లో ఇక హౌస్ బోట్ తేలియాడనుంది. రాష్ట్ర పర్యాటక శాఖ ఆ దిశగా కసరత్తు చేపట్టింది. రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా ఇందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. దళిత వర్గాల స్వయం ఉపాధికి ఉపకరించేలా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది. సచివాలయంలో గురువారం ఎపి టూరిజం అథారిటీ సమీక్షను మీనా నిర్వహించారు. విజయవాడ ప్రకాశం బ్యారేజ్ సమీపాన నదీ జలాల్లో తొలి దశలో 15 హౌస్‌బోట్లను ఏర్పాటు చేయించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఇంట్లో మాదిరిగా అన్ని వసుతులతో కూడిన హౌస్‌బోట్ ఒక్కొక్కటీ సుమారు రూ.కోటి ఉంటుందని అంచనా. ఈ వ్యయంలో 15 శాతం ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివద్ధి సంస్థ (ఎపిటిటిసి) సబ్సిడీగా అందిస్తుంది. ఎస్‌సి కార్పొరేషన్ మరి కొంత సబ్సిడీని తమ లబ్ధిదారులకు సమకూర్చేందుకు సూత్రప్రాయంగా అంగీకరించింది. మిగిలిన మొత్తాన్ని బ్యాంకు రుణంగా ఇప్పించాలని పర్యాటక శాఖ ప్రతిపాదిస్తోంది. ఎవరైనా ఇతరులూ ఇలాంటి హౌస్‌బోట్లు ఏర్పాటు చేయదలిస్తే వారికీ 15 శాతం ఎపిటిడిసి సబ్సిడీ వర్తిస్తుంది. మిగిలిన 85 శాతాన్ని వారు భరించాలి. లేకుంటే బ్యాంకు రుణంగా వారే సమకూర్చుకోవాల్సి ఉంటుంది. మొత్తం ప్రాజెక్టు నిర్వహణ ఆన్‌లైన్ టికెటింగ్, మార్కెటింగ్ బాధ్యతను పర్యాటక శాఖ బాధ్యత తీసుకుంటుందని మీనా తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో అనుభవానికి అత్యధిక ప్రాధాన్యమిస్తామన్నారు. ఎపిటిడిసి వేసిన అంచనాల ప్రకారం ఒక్కో హౌస్‌బోట్‌కు దాని సామర్థ్యం, దాంట్లో సౌకర్యాలను బట్టి రూ.60 లక్షల నుండి రూ.1.20 కోట్ల వరకు వ్యయం అవుతుంది. లబ్ధిదారులు ఏ బోట్‌నైనా కొనుగోలు చేసుకోవచ్చు. అయితే సబ్సిడీ మాత్రం రూ. కోటి ప్రాజెక్టు వ్యయంలో 15 శాతానికే పరిమితమని మీనా వివరించారు.



ఈశాన్యం నుంచి చలిగాలులు

ఆగ్నేయ బంగాళాఖాతంలో ద్రోణి

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంలోకి ఈశాన్యం, తూర్పు దిశ నుంచి చలిగాలులు వీస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం చెబుతోంది. ఆకాశం నిర్మలంగా ఉండటంతో రాత్రి పూట చలి తీవ్రత పెరుగుతోంది, కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి, ఉదయం పూట పొగమంచు కురుస్తోందని తెలిపింది. ప్రస్తుతం భూ మధ్య రేఖకు ఆనుకుని ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ఏర్పడిందని, ఈ నెల 6వ తేదీకి అల్పపీడనంగా మారుతుందని భారత వాతావరణ శాఖ తెలిపింది. నాలుగు రోజులపాటు కోస్తా, సీమల్లో వాతావరణం పొడిగానే ఉంటుందని పేర్కొంది.

విశాఖ రైల్వే జోన్ ఇవ్వాలి

లోక్‌సభలో ఎంపి ఎం.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విశాఖ పట్నం రైల్వే జోన్ ఇవ్వాలని టిడిపి ఎంపి ఎం. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం నాడు లోక్‌సభలో జీరో అవర్‌లో విశాఖ రైల్వే జోన్ అంశాన్ని ఎంపి శ్రీనివాసరావు లేవనెత్తారు. విశాఖ పట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అందుకు తగ్గట్టుగా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లో పేర్కొన్నారని గుర్తు చేశారు. ఏపిలోని మూడు డివిజన్లు విజయవాడ, గుంటూరు, గుంతకల్లు, ఈస్ట్ కోస్ట్ రైల్వేలోని వాల్తేరు డివిజన్‌లను కలిపి విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు హామీ ఇచ్చారని అన్నారు. దాదాపు దశాబ్ధం నుంచి విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ డిమాండ్ ఉందని, ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్‌లో వాల్తేరు డివిజన్ నుంచి అత్యధిక ఆదాయం వస్తుందని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

సమాజ శ్రేయస్సును కాంక్షించే సంస్కృతిని కాపాడుకుందాం

- సాంప్రదాయ కళల వైపు యువత మళ్లాలి
- సినీ దర్శకులు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ



సదస్సులో మాట్లాడుతున్న తమ్మారెడ్డి భరద్వాజ


ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

'మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలు ఆధునిక చిత్రాల వైపు ఆకర్షితులవుతున్నారు. అన్ని రంగాలలో గ్లోబలైజేషన్ ప్రవేశించిన నేపథ్యంలో వ్యవస్థను మార్చగల శక్తి కళా ప్రదర్శనలకు మాత్రమే ఉంది. సమ సమాజ శ్రేయస్సును కాంక్షించే సంస్కృతిని కాపాడుకోవడానికి ప్రజలందరూ కృషి చేయాలి' అని సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ పిలుపునిచ్చారు. విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో 'సంస్కృతి రంగం- నేటి సవాళ్లు' అంశంపై సదస్సును నిర్వహించారు. విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్ర నాయకురాలు డాక్టర్ ప్రగతి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడారు. కాలానుగుణంగా సంస్కృతి రంగం మారుతోందన్నారు. వ్యవస్థలో ప్రజలను ఆలోచింప జేసే శక్తి సినిమా రంగానికి, మీడియా, సోషల్ మీడియాకు ఉందన్నారు. సమాజాన్ని తప్పుదోవ పట్టించే కొన్ని చిత్రాలూ వచ్చాయన్నారు. అయితే మంచి సినిమాలను ఆదరించే వారున్నారని అన్నారు. మారుతున్న తరాలతోపాటు సంస్కృతి మారుతోందని తెలిపారు. సమాజాన్ని తప్పుదోవ పట్టించే సంస్కృతిని వీడి సమ సమాజ స్థాపన కోసం ఆరోగ్యవంతమైన వ్యవస్థ ఏర్పాటునకు సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఉండాలన్నారు. కళలకు, కులమత బేధం ఉండదని, సమాజాన్ని ఆలోచింపజేసి మంచి వైపు నడిపించే కళలు ప్రజాదరణ పొందినప్పుడే దేశం బాగుపడుతుందని అన్నారు. మన సంస్కృతిని విలువలను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. ప్రజానాట్య మండలి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు దేవేంద్ర మాట్లాడుతూ.. సమాజంలో మనిషనే వాడు ప్రతి ఒక్కరూ కమ్యునిస్టుగానే ఉంటారని, తమ గొంతును స్వేచ్ఛగా ప్రకటించే హక్కును కోరుకుంటాడని తెలిపారు. కాని నేడు దేశంలో, రాష్ట్రంలో భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తున్నారని అన్నారు.. ప్రజాస్వామ్య సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శ్రామిక వర్గ భావజాలం సామాన్యుడి పక్షాన నిలుస్తుందన్నారు. పెట్టుబడిదారీ సంస్కృతి యాజమాన్యాలకు అనుకూలంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత సింగమనేని నారాయణ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, మానవత అమర్‌నాథ్‌రెడ్డి, రిటైర్డు డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, నగర కార్యదర్శి నాగేంద్రకుమార్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ.నల్లప్ప పాల్గొన్నారు.

7న జన్మభూమి 5కె రన్

సిఎం చంద్రబాబు

గ్రామసభలు రాజకీయ వేదికలు కారాదు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జన్మభూమి కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 7న పట్టణాలు, మేజర్ పంచాయతీల్లో 5కె రన్‌ను నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువతను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలన్నారు. శరీరానికి ఆహారం ఎంత ముఖ్యమో వ్యాయామమూ అంతే ముఖ్యమన్నారు. జన్మభూమి గ్రామసభలు అభివృద్ధికే తప్ప రాజకీయ వేదికలు కారాదని పేర్కొన్నారు. జన్మభూమిలో భాగంగా తన నివాసం నుంచి టెలీ కాన్ఫరెన్స్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2.46 లక్షల రేషన్ కార్డులు, నాలుగు లక్షల పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. సమస్య పరిష్కారం, ప్రజల్లో సంతృప్తి ముఖ్యమన్నారు. పశువైద్య శిబిరాల నిర్వహణపై ప్రజల్లో 50 శాతంలోపే సంతృప్తి ఉందన్నారు. జన్మభూమికి అధికారులు హాజరు అంశంపై 90 శాతం అవునని, 10 శాతం లేదని, వివిధ అంశాలపై అవగాహన కల్పించే విషయంపై 72 శాతం అవునని, 22 శాతం లేదని, 6 తెలియదని, పింఛన్లు అందరికీ అందుతున్నాయా అనే ప్రశ్నకు 64 శాతం అవునని, 36 శాతం లేదని సమాధానమిచ్చారని తెలిపారు. సర్వేలో సేకరించిన సమాచారాన్ని బట్టి ఫిర్యాదుల పరిష్కారం మరింత వేగవంతం కావాలన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజలను సమాయత్తం చేయాలన్నారు. గ్రామంలో చేపట్టిన మౌలిక సదుపాయాల ఫోటోలను ప్రదర్శించాలని సూచించారు. గత మూడున్నరేళ్లలో ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. మంత్రులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, జవహర్, ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మూడు లక్షలకుపైగా వినతులు

గృహాల కోసమే అధికం : పరకాల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జన్మభూమి కార్యక్రమంలో మూడో రోజు గురువారం సాయంత్రం వరకూ అందిన సమాచారం ప్రకారం 3,00,570 వినతులు స్వీకరించారని, వీటిలో గృహ నిర్మాణానికి సంబంధించే అధికంగా ఉన్నాయని ప్రభుత్వ సలహాదారులు పరకాల ప్రభాకర్ తెలిపారు. తరువాతి స్థానంలో రేషన్ కార్డులు, పింఛన్ల కోసం అధిక సంఖ్యలో ప్రజలు ఉన్నట్లు చెప్పారు. సచివాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అయిదో విడత జన్మభూమి గతం కంటే వినూత్నంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామ స్థాయిలో భవిష్యత్తు ప్రణాళికలపై చర్చిస్తున్నట్లు తెలిపారు. జన్మభూమిలో రాష్ట్ర వ్యాప్తంగా తొలిరోజైన మంగళవారం వివిధ అంశాలకు సంబంధించి ప్రజల నుంచి 67,003 వినతులు అందాయని, 13,943 మందికి రేషన్ కార్డులు, 7,953 మందికి పింఛన్లు 2,567 మందికి ఇళ్ల స్థలాలు, 2,368 మందికి టూల్ కిట్స్ అందించామని వెల్లడించారు. 1,100 వైద్య శిబిరంలో 68,121 మంది నమోదు చేయించుకున్నారని చెప్పారు. రెండో రోజు బుధవారం 1,65,841 వినతులు అందగా, 35,277 రేషన్ కార్డులు, 16,747 మందికి పింఛన్లు, 4,494 మందికి ఇళ్లస్థలాలు, 3,468 మందికి టూల్ కిట్స్ పంపిణీ చేశామన్నారు. 2,915 వైద్య శిబిరాల్లో 1,65,841 మంది నమోదు చేయించుకున్నట్లు తెలిపారు. మూడో రోజు 67,726 వినతులు అందాయని తెలిపారు.

సిఎం షెడ్యూల్

ముఖ్యమంత్రి చంద్రబాబు 5న నర్సీపట్నం, బొబ్బిలి, 6న కోడూరుపాడు, 7న శ్రీశైలం, 8న పోలవరం, కొవ్వూరు, 9న కుప్పం, శ్రీసిటి, 10న ముమ్మిడివరం, 11న ధర్మవరాల్లో జరిగే జన్మభూమి కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

వికలాంగుల సమస్యలు సంక్రాంతి తర్వాత పరిష్కరిస్తాం

బ్రెయిలీ జయంతి వేడుకలో మంత్రి పరిటాల సునీత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అవయవ లోపాన్ని ఒక సవాలుగా తీసుకుని ముందంజ వేయాలని మహిళా శిశు, వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి పరిటాల సునీత వికలాంగులకు సూచించారు. పెండింగ్ సమస్యలను సంక్రాంతి తర్వాత చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగిన లూయీ బ్రెయిలీ 209వ జయంతి వేడుకలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. చూపు లేకపోయినా సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు అద్భుత ప్రతిభను కనబర్చారని కొనియాడారు. సమాజంలో చూపులేనివారికి ఎన్నో సమస్యలుంటాయని, ముఖ్యంగా అంధులైన ఆడపిల్లలకు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతుంటాయరని అన్నారు. ప్రభుత్వం వికలాంగులకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. వికలాంగుల హక్కులకు సంబంధించి ఆర్‌పిడి యాక్ట్, బ్రెయిలీ పుస్తకాలు, డిగ్రీ పూర్తయిన వారికి ల్యాప్‌టాప్ వంటి సమస్యలు ప్రభుత్వం వద్ద రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని విభిన్న ప్రతిభావంతుల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రవీంద్రబాబు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పెండింగ్ సమస్యలపై సంక్రాంతి తర్వాత అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ల్యాప్‌టాప్‌లు అందజేయాలని విద్యార్థులు సభలో నినాదాలు చేయగా మంత్రి స్పందిస్తూ ముఖ్యమంత్రితో చర్చించి తప్పకుండా ఇస్తామని హామీ ఇచ్చారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి బ్రెయిలీలో పుస్తకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను వికలాంగుల కోటా మేరకు అర్హులైనవారికి దక్కేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఐదుగురు విద్యార్థులకు మంత్రి సునీత ల్యాప్‌టాప్‌లు అందజేశారు. వికలాంగులు, వయో వృద్ధుల సహాయ సంస్థ ఛైర్మన్ జి. కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో త్వరలో బ్రెయిలీ ప్రెస్‌ను ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలో దాదాపు 2.03 లక్షల మంది అంధులున్నారని ఈ ఏడాది మార్చి 31లోగా బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం సమయాన్ని పెంచిందని తెలిపారు. ఈ సందర్భంగా ఓఎన్‌జిసి సహకారంతో రూ 20 లక్షలతో ఏర్పాటు చేసిన కృత్రిమ కాళ్లు, చేతులను మంత్రి సునీత పంపిణీ చేశారు.

ఎంపి మైక్ లాక్కుంటారా?

సిఎం, టిడిపి నేతల తీరు బాధాకరం : బొత్స

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జన్మభూమి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టిడిపి నేతలు వ్యవహరించిన తీరు బాధాకరమని వైసిపి నాయకులు బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధి ఎంపి అవినాష్‌రెడ్డి పట్ల అమర్యాదగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎంపి ఎవరిఃనైనా నిందించారా..? ఏమైనా దుర్భా షలాడారా..? ఎందుకు మైక్ లాక్కోవాల్సి వచ్చిందని ప్రశ్నించారు. పైడిపాలెం ప్రాజెక్టు విలువ రూ.700 కోట్లయితే, చంద్రబాబు కేవలం రూ.23 కోట్లు ఖర్చు చేశారని, గండిపేట ప్రాజెక్టుకు టిడిపి ప్రభుత్వం నాలుగేళ్లలో ఖర్చు చేసింది రూ.72 కోట్లేనని, అదే మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ రూ.1100 కోట్లు ఖర్చు చేశారనే ఎంపి వేదికపై గుర్తు చేశారన్నారు. వాస్తవాలు మాట్లాడితే ఎంపి చేతిలో మైకు గుంజుకుంటారా అంటూ బొత్స ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సభలో రాజకీయాలు వద్దంటూ ముఖ్య మంత్రి... గుండాలు, రౌడీలను ఎందుకు రానిచ్చారని నిలదీశారు. బెజవాడలో దుర్గమ్మ గుడిలో తాంత్రిక పూజల పై వెంటనే సమగ్ర విచారణ చేపట్టించాలని డిమాండ్ చేశారు.

చెంబుతో నీళ్లిచ్చామనడం హాస్యాస్పదం

వైసిపిపై ధ్వజమెత్తిన మంత్రి దేవినేని



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రాజెక్టుల టన్నెల్ పనులు త్వరితగతిన పూర్తి చేసి గండికోట నుంచి చిత్రావతికి నీరు అందిందించి, తద్వారా రాయలసీమకు నీటి సరఫరా చేస్తే చెంబుతో నీళ్లిచ్చామని ప్రతిపక్ష నేతలు విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ధ్వజమెత్తారు. విజయవాడ జలవనరుల కార్యాలయంలో ఆయన గురువారం విలేకరుతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణాలను అడ్డుకోవడమే ప్రధాన అజెండాగా పెట్టుకున్నారని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పై మండిపడ్డారు. రాయలసీమకు నీరు అందించడం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేస్తుందన్నారు. రాయలసీమకు నీరు అందించడం ఓర్వలేకే జగన్ అలా విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రతి పక్షం ఎన్ని అవాంతరాలు సృష్టించినా ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతామన్నారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 5 టిఎంసిలు నీరు కనిపిస్తుంటే జగన్ అజ్ఞానంగా మాట్లాడటం దురదృష్టకరమన్నారు. పులివెందుల నియోజక వర్గంలోని రైతాంగానికి నీళ్ల అందిస్తుంటే గేట్లు ఎత్తే లస్కర్లు అని ఎద్దేవా చేస్తూ మాట్లాడటం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. పట్టిసీమ ద్వారా ఇప్పటి వరకు 105 టిఎంసిల గోదావరి నీళ్ల తెచ్చామన్నారు. తెలుగు గంగ, హంద్రీనీవా ప్రాజెక్టులతో పాటు, హెచ్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 పనులు కూడా పూర్తి చేస్తామన్నారు. హంద్రీనీవా ద్వారా అనంతపురం, చిత్తూరుకు నీళ్ల ఇచ్చే పనిని సంక్రాంతి లోపల పూర్తి చేస్తామన్నారు. జన్మభూమి - మాఊరు కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొంటున్నారని చెప్పారు.

గజల్ శ్రీనివాస్ కస్టడీకి పోలీస్ పిటిషన్ తిరస్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లైంగిక వేధింపుల కేసులో ప్రధాన నిందితుడు గజల్ శ్రీనివాస్‌ను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను నాంపల్లి కోర్టు గురువారం తిరస్కరించింది. అరెస్టు కంటే ముందు పోలీసులు ఇచ్చిన నోటీసులకు స్పందించి విచారణకు హాజరయ్యారని, కేసుకు సంబంధించిన సమాచారమంతా ఇచ్చారని శ్రీనివాస్ తరుపు లాయర్ ఉమామహేశ్వరరావు కోర్టుకు తెలిపారు. ప్రత్యేక విచారణ అవసరంలేదన్నారు. సమాజంలో పేరు ప్రఖ్యాతులున్నా తన క్లయింట్‌ను కుట్ర పూరితంగా కేసులో ఇరికించారని వాదించారు. పోలీసుల తరుపున పిపి వాదనలు వినిపిస్తూ గజల్ శ్రీనివాస్ చేతిలో మోసపోయిన మహిళలు ఒక్కొక్కరూ ఈ అరెస్టు తర్వాత స్పందిస్తున్నారన్నారు. శ్రీనివాస్‌ను విచారిస్తే మరిన్ని నిజాలు బైటపడతాయని, నాలుగు రోజులు పోలీసు కస్టడీకి ఇవ్వాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి భోజనవిరామం తర్వాత నిర్ణయాన్ని వెల్లడిస్తూ పోలీసుల కస్టడీ పిటిషన్ తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో గజల్ శ్రీనివాస్‌ను ఈనెల 2న అరెస్టు చేసిన పంజాగుట్ట పోలీసులు కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం ఈ నెల 12వరకు రిమాండ్ విధించింది. బెయిల్ ఇవ్వాలని ఆయన తరపు న్యాయవాది పిటిషన్ వేసి ఉపసంహరించుకున్నారు. కోర్టులో శుక్రవారం మరో పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉంది.

ప్రత్యేకం

దాడులు నిలబడేనా..!

- అక్రమాస్తుల లెక్కింపుపై ఎసిబి వర్సెస్ విజిలెన్స్
- ముందు భారీగా అస్తులు చూపి ఛార్జిషీట్‌లో తగ్గిస్తున్న ఎసిబి



విజయవాడలో గతేడాది డిసెంబర్ 29న నిర్వహించిన దాడుల్లో డిస్ట్రిక్ లెవల్ ట్రైనింగ్ సెంటర్ అధికారి కె శ్రీనివాస్ కుమార్ ఆస్తులను లెక్కిస్తున్న ఏసిబి అధికారులు (ఫైల్)

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అక్రమార్కులపై అవినీతి నిరోధక శాఖ అధికారులు నిర్వహిస్తున్న దాడుల విధానం శాస్త్రీయతపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా ఎసిబి దాడులపై మరో విభాగమైన విజిలెన్స్ నుంచే వేరే అభిప్రాయం ఉండటం విశేషం. దీంతో ఎసిబి అధికారులకు గతంలోనే సూచనలు కూడా వెళ్లాయి. కేవలం ఎడ్వయిజరీ విభాగంగా ఉన్న విజిలెన్స్ కమిషన్ సూచనలు దాదాపుగా బుట్టదాఖలవుతున్నట్లు సమాచారం. అవినీతికి పాల్పడి అక్రమాస్తులు కూడబెట్టుకున్న వారి విషయంలో వారి బంధుల ఆస్తుల మీదా ఎసిబి దాడులు చేస్తోంది. చిరకాలంగా ఎసిబి ఈ విధానాన్నే అనుసరిస్తోంది. దాడుల అనంతరం చేసే ప్రకటనలో కూడా పెద్ద మొత్తంలో బంధువుల వద్ద ఆస్తులను గుర్తించినట్లు ఎసిబి అధికారులు చెబుతుంటారు. కానీ ఈ విధానాన్ని విజిలెన్స్ కమిషన్ అధికారులు విభేదిస్తున్నారు. ఆస్తుల గణనలో బంధువుల ఆస్తులను పరిశీలించడం సరైన విధానమే.. అయినా వారి ఆస్తులను ఆరోపణలకు గురైన అధికారి లేదా ఉద్యోగి ఆస్తిగా చూపించడం మాత్రం సరికాదని వారంటున్నారు. చట్టబద్ధంగా కూడా ఇతరుల పేరున ఆస్తి ఉండడాన్ని తప్పు పట్టలేమని, వారికి కూడా తల్లిదండ్రుల నుంచి ఆస్తి సంక్రమించే అవకాశాలుంటాయన్నది పరిశీలకులు చెబుతున్న మాట. ఇదే వాదాన్ని విజిలెన్స్ అధికారులు కూడా తెరపైకి తీసుకొస్తున్నారు. అలాంటి ఆస్తులను కూడా గణించి అక్రమార్కుల ఆదాయంగా గుర్తిస్తే, కోర్టులో ఆ కేసులు నిలబడవని వారు తేల్చి చెబుతున్నారు. ఇదే అంశాన్ని నేరుగా ఎసిబి అధికారులకు కూడా చెబుతున్నా మని విజిలెన్స్ కమిషన్ అధికారి ఒకరు వెల్లడించారు. ఎసిబి అధికారులు దాడులు చేసిన తరువాత ఆ కేసు వివరాలు విజిలెన్స్ కమిషన్‌కు కూడా వస్తుంటాయి. దాడి సమయంలో వంద కోట్లు, రెండొందల కోట్లు రూపాయల విలువైన అక్రమాస్తులను గుర్తించామన్న సమాచారం కూడా అందులో ఉంటోంది. వాటిని పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు ఆ తరహా విధానం సరికాదని అనేక సందర్భాల్లో ఎసిబికి తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలోనే న్యాయస్థానాల్లో ఛార్జిషీటు దాఖలు చేసే సమయంలో ఆ మొత్తం ఒక్కసారిగా తగ్గిపోయి పదుల కోట్ల రూపాయాల్లోకి తగ్గిపోయిన సందర్భాలూ ఉంటున్నాయంటున్నారు. చివరిలో బంధువుల ఆస్తులను తగ్గించి చూపిస్తున్నారని, అదే విధానం ముందు నుంచి అమలు చేస్తే బాగుంటుందని వారు సూచిస్తున్నారు. బంధువుల ఆస్తులను భారీగా గుర్తించిన సమయంలో అవి వారికి ఎలా, ఎక్కడ నుంచి సంక్రమించాయన్నది తెలుసుకోవాలని విజిలెన్స్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. అవి న్యాయపరంగా సక్రమమేనని భావిస్తే, వాటిని అధికారి అక్రమాస్తులు జాబితా నుంచి తొలగించాలని సూచిస్తున్నారు.

సంక్షిప్తం

గవర్నర్‌తో కొత్త డిజిపి భేటీ

అమరావతి బ్యూరో : ఆంధ్రప్రదేశ్ నూతన డిజిపిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎం మాలకొండయ్య గురువారం హైదరాబాద్‌లో గవర్నర్ ఇఎస్‌ఎల్ నరసింహన్‌ను కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగా డిజిపిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మాలకొండయ్యను గవర్నర్ అభినందించారు. గవర్నర్ కార్యాలయంలో జరిగిన భేటీలో వీరిరువురు పలు అంశాలపై చర్చించారని, రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులను డిజిపి గవర్నర్‌కు వివరించారని సమాచారం.

11 మంది డిఎస్పీలకు పోస్టింగ్‌లు ..!

అమరావతి బ్యూరో : దీర్ఘకాలంగా వెయిటింగ్‌లో ఉన్న 11 మంది డిఎస్పీలకు పోస్టింగ్‌లిస్తూ డిజిపి మాలకొండయ్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజధాని అమరావతి ప్రాంతంలోని విజయవాడకు ఎస్ వెంకట్రావు, జి ఉదయ్‌కుమార్, షేక్ మక్బుల్, షేక్ లాల్ అహ్మద్‌లను కేటాయించారు. విజయవాడ, గుంటూరులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిన ప్రభుత్వం పోలీస్ శాఖకు సంబంధించి కొన్ని కొత్త పోస్టులనూ మంజూరు చేస్తోంది. పి ఉమాపతి వర్మ, కెవిఎన్‌వి ప్రసాద్‌లను ఇంటిలిజెన్స్ విభాగానికి పంపారు. టి మోహనరావును విజయనగరం 5వ ఎపిఎస్పీ బెటాలియన్‌కు, విమలకుమారిని చిత్తూరు జిల్లా శ్రీసిటీకి, గుంటూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్‌కు ఎస్ విజయ్‌శేఖర్‌ను, అనంతపురం జిల్లా సిసిఎస్‌కు ఈ శ్రీనివాసులుతో పాటు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పిఎఫ్)కు టి కృష్ణను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

తాంత్రిక పూజలకు సిఎందే బాధ్యత : వైసిపి నేతలు

అమరావతి బ్యూరో : బెజవాడ కనకదుర్గ దేవస్థానంలో జరిగిన తాంత్రిక పూజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యత వహించాలని వైసిపి నేతలు మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో వీరు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. తాంత్రిక పూజలు జరిగాయని తాము చేసిన విచారణలోనూ స్పష్టమైందని వెల్లడించారు. సిఎం కార్యాలయ డైరక్షన్‌లో తనకు పదవి ఇచ్చిన లోకేష్ కోసమే ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ఈ పూజలు చేయించినట్లు ఆరోపించారు. లోకేష్ కోసం ఎన్ని పూజలు చేసినా ముఖ్యమంత్రి కాలేరని ఎద్దేవా చేశారు. దుర్గగుడి వ్యవహారాలపై పీఠాధిపతులు స్పందించాలన్నారు. ఇలాంటి తాంత్రిక పూజలు రాష్ట్రంలోని మరెన్ని దేవాలయాల్లో జరిగాయోనంటూ అనుమానం వ్యక్తం చేశారు.

బద్వేలులో భారీ అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-బద్వేలు (కడప)

బద్వేలు పాలిటెక్నిక్ కాలేజీ వెనుక వైపున ఉన్న నిరుపేదల కాలనీలో ప్రమాదవశాత్తు భారీ అగ్నిప్రమాదం జరిగింది. భూపోరాట కమిటీ ఆధ్వర్యంలో ఇక్కడ ఏడాది కిత్రం ఐదు వేల గుడిసెలు వేసుకొని పేదలు నివాసం ఉంటున్నారు. గురువారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో ఓ వృద్ధురాలు వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గుడిసెకు మంటలు అంటుకున్నాయి. అదే సమయంలో గాలి కూడా ఎక్కువగా వీయడంలో మంటలు అన్ని గుడిసెలకు వ్యాపించాయి. గుడిసెల్లో ఉన్న సిలిండర్లు కూడా పేలి సుమారు రెండు వేల గుడిసెలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో సుమారు నాలుగు వేల కుటుంబాలు నిరాశ్రయులు అయ్యారు. మూడు ఫైరింజన్‌లతో మంటలు అదుపు చేశారు.



అగ్నిప్రమాదం

బద్వేలులో పాలిటెక్నిక్ కాలేజీ వెనుక వైపున గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న గుడిసెలు

అత్యాచార బాధితురాలికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పరామర్శ, ప్రభుత్వ ఉద్యోగానికి హామీ

ప్రజాశక్తి - కలెక్టరేట్, విశాఖ

అత్యాచారానికి గురై కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న మూగ గిరిజన బాలికను గురువారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కారెం శివాజీ పరామర్శించారు. వైద్య సేవలు ఏ మేరకు అందుతున్నాయో ఆరా తీశారు. ప్రభుత్వం అండగా ఉందని, ఏ మాత్రం ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని, ధైర్యంగా ఉండమని భరోసా ఇచ్చారు. ఇటువంటి దురాగతానికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు. తక్షణ ఆర్థిక సహాయంగా రూ.5 లక్షలను ప్రభుత్వం అందజేస్తున్నట్లు తెలిపారు ప్రభుత్వ ఉద్యోగానికి ప్రతిపాదిస్తామని హామీ ఇచ్చారు. తొలి విడతగా రూ.2.50 లక్షల చెక్కును బాధితురాలికి ఆయన అందజేశారు.

అత్యాచార నిందితున్ని శిక్షించాలని ఆందోళన

గిరిజన మూగ బాలికపై అత్యాచారం చేసిన నిందితున్ని నిర్భయ చట్టం కింద కఠినంగా శిక్షించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి), గిరిజన సంఘం, ఐద్వా ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం ఎదుట గురువారం ఆందోళన జరిగింది. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. బాధితురాలికి రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. కేసును తారుమారు చేసేందుకు ప్రయత్నిస్తున్న హెచ్‌బిఎల్ కంపెనీ యాజమాన్యాన్ని అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర అధ్యక్షులు కోడూరు అప్పలనాయుడు, ఐద్వా నాయకులు సూర్యమణి, బొట్టా ఈశ్వరమ్మ, గిరిజన సంఘం నాయకులు పృథ్వీరాజు, బధిరుల సంఘం నాయకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రుణ ఉపశమన పత్రాలతో బ్యాంకులకు



రైతు ఖాతాల్లో పడని మూడో విడత మాఫీ సొమ్ము
అధికారులు - బ్యాంకర్ల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుడు
రబీ పెట్టుబడులకు రైతు నానా యాతన

ప్రజాశక్తి యంత్రాంగం

మూడో విడత రుణమాఫీ రైతులకు చుక్కలను చూపుతోంది. రుణ మాఫీకి డబ్బు విడుదల చేశానని ప్రభుత్వం ఆడంబరంగా చెపుతున్నా.. రైతు ఖాతాల్లో జమ కావడం లేదు. కాళ్లరిగేలా తిరుగుతున్నా.. అధికారులు, బ్యాంకర్లు కనికరం చూపడం లేదు. రబీ కాలం నడుస్తుండటంతో వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతులు, కౌలు రైతులు ఎదురుచూస్తున్నారు. రుణ ఉపశమన పత్రం, ఆధార్ జిరాక్స్‌ను తీసుకుని బ్యాంకుల వద్దకు వెళ్తుంటే రుణమాఫీ కాలేదని బ్యాంకర్లు చెబుతున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. రుణ ఉపశమన పత్రాలు పట్టుకుని అధికారుల వద్దకు వెళ్తుంటే వారు బ్యాంకర్ల వద్దకు వెళ్ల మంటున్నారని, బ్యాంకర్ల వద్దకు వెళ్తుంటే వారు అధికారుల వద్దకు వెళ్ల మంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలో మూడో విడత రుణ మాఫీ కింద 3,35,456 మందికి రూ.315 కోట్లకుగాను ఇప్పటివరకూ రూ.138 కోట్లే జమ చేశారు. అక్టోబర్ 10 నుంచి మూడో విడత రుణమాఫీ సొమ్ము జమ ప్రక్రియ ప్రారంభంకాగా, అక్టోబర్ 24 నుంచి మాఫీ సొమ్ము జమ నిలిచిపోయింది. రుణ ఉపశమనపత్రాలు బ్యాంకులకు తీసుకెళ్లి నమోదు చేయించుకున్నప్పటికీ మాఫీ సొమ్ము జమకాలేదు. అధికారుల లెక్కల ప్రకారం మూడోవిడత రుణమాఫీకి సంబంధించిన రైతులంతా బ్యాంకుల్లో నమోదు ప్రక్రియ దాదాపుగా పూర్తయిందని చెబుతున్నారు. సొమ్ము మాత్రం జమ కావడం లేదని బ్యాంకర్లు చెబుతున్నారు. మూడోవిడత మాఫీ సొమ్ము జమపై రైతులు, అధికారులు, బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 2,50,570 మంది రైతులకు రూ.175.93 కోట్లు రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకూ 64,583 మంది రైతులకు చెందిన ఖాతాల్లో రూ.53.06 కోట్లే జమ చేసింది. ఇంకా 1,85,987 మంది రైతులకు రూ.122.87 కోట్లు రుణమాఫీ కావాల్సి ఉంది. రైతులు కాళ్లరిగేలా బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ వారి రుణాలు మాఫీ కావడంలేదు.

రుణ ఉపశమన పత్రాలు పట్టుకుని రైతులు ప్రతిరోజూ బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ వారి ఖాతాల్లోకి మాఫీ సొమ్ము చేరడంలేదు. కృష్ణాజిల్లాలో మూడో విడత రుణమాఫీ కింద అక్టోబరు మొదటి వారంలో కృష్ణాజిల్లాకు చెందిన 2.96 లక్షల మంది రైతులకు రూ 234 కోట్లు బట్వాడా చేసినట్లు పేర్కొన్నపటికీ 50 శాతం ఖాతాల్లో ఇంతవరకు జమ పడలేదు. బ్యాంకు అకౌంట్లలో లోపాల వలనే మాఫీ బదలాయింపులో జాప్యం జరుగుతోందని ప్రభుత్వం అంటున్నా రానురాను రుణమాఫీ బట్వాడాలో పెద్దెత్తున అవకతవకలు చోటుచేసుకుంటున్నా యన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రకాశం జిల్లాలో మూడో విడతలో 3,71,484 మంది రైతులకు రూ. 348.17 కోట్లు నగదు జమ కావాల్సి ఉంది. దీనికి వార్షిక వడ్డీ 10 శాతం (రూ.60 కోట్లు) కలుపుకొని మొత్తం రూ.408.17 కోట్లు రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. 89,675 మంది రైతులకు గాను రూ.123.35 కోట్లను మాత్రమే ఖాతాలకు జమ చేశారు. ఇంకా జిల్లాలో 2,81,809 మంది రైతులకు మూడో విడత మాఫీ సొమ్ము కింద రూ.284.82 కోట్లు జమ కావాల్సి ఉంది. శ్రీకాకుళం జిల్లాలో మూడో విడత రుణమాఫీకి అర్హులైన 56,954 మందికి 106.13 కోట్ల మాఫీ జరగాలి. వడ్డీ రూ.21.24 కోట్లతో కలిపి రూ.127.37 కోట్లు ఇవ్వాలి. జిల్లాలో ఇప్పటివరకూ రూ.64 కోట్లు మాత్రమే రైతుల ఖాతాలో నిధులు జమమయ్యాయి. కడప జిల్లాలో మూడో విడతలో భాగంగా 2,54,317 ఖాతాలకుగానూ రూ.205.68 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 1,13,533 ఖాతాలకు కేవలం రూ.101.41 కోట్లు మాత్రమే రుణమాఫీ సొమ్మును చెల్లించారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కడివెళ్ల రైతు హుసేనికి రూ.60 వేలు అప్పు బ్యాంకులో ఉండగా ప్రభుత్వం రుణమాఫీ చేసినట్లు ధృవీకరణ పత్రం ఇచ్చినా ఇప్పటి దాకా ఒక్క రూపాయి కూడా రుణమాఫీ కాలేదు. ఇప్పుడు ఏకంగా రూ.90 వేలు వడ్డీతో కట్టాలని బ్యాంకు అధికారులు ఆయనను వేధిస్తున్నారు.

బ్యాంకుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు..

విజయనగరం జిల్లా గజపతినగరం మండలం పురిటిపెంట రైతు ఆదాడ సింహాద్రి 2013లో వికాస్ గ్రామీణ బ్యాంకులో రూ.50 వేల రుణం తీసుకున్నాడు. రూ.50 వేల ఒకేసారి మాఫీ అవుతుందని చెప్పినప్పటికీ అమలు కాలేదు. తొలి విడత 14,240 వడ్డీతోపాటు బ్యాంకు ఖాతాలో జమైంది. రెండో విడత రుణ అర్హత బాండు వివరాలు, ఆధార్ నంబరు, బ్యాంకు ఖాతాను బ్యాంకులో ఆన్‌లైన్ చేసిన తర్వాత రూ.14 వేల జమైంది. మూడో విడతలో మాఫీ ద్వారా మొత్తం జమ కావాలంటే రుణ అర్హత బాండు, ఆధార్ నంబరును తిరిగి బ్యాంకులో ఆన్‌లైన్ చేయాలన్న నిబంధన తెలియకపోవడంతో ఇంకా మిగిలి ఉన్న రూ.14 వేల జమ కాలేదు. దీంతో ఆయన బ్యాంకు చుట్టూ తిరుగుతున్నాడు.

అవసరానికి అందలేదు



నేను సొసైటీ బ్యాంకులో రూ. 80 వేలు పంటరుణం తీసుకున్నాను. రుణమాఫీ వర్తించింది. మొదటి విడతలో రూ 12 వేలు, రెండో విడతలో రూ. 15 వేలు చొప్పున రుణమాఫీ నిధులు ఖాతాలో జమయ్యాయి. మూడో విడత నిధులు ఇంకా జమ కాలేదు. ప్రస్తుతం వ్యవసాయ పెట్టుబడులకు డబ్బులు ఎంతో అవసరం ఉంది. ఇంకా పడకపోవడంతో ఇబ్బందిగా మారింది'

- పాలం రమణారెడ్డి, బీరునేనిపల్లి, పుల్లలచెరువు మండలం, ప్రకాశం జిల్లా


అసలు రుణం అలాగే ఉంది



నా పేరున రూ.50 వేలు, నా భార్య పేరున రూ.50వేలు రుణం తీసుకున్నాను. రెండు విడతల్లో రూ.18 వేలు బ్యాంకులో జమ అయ్యాయి. ఆ డబ్బులు వడ్డీకే సరిపోయాయని బ్యాంక్ అధికారులు చెప్పారు. మూడో విడత వస్తుందని రుణమాఫీ బాండ్ చేతికి ఇచ్చారు. కాని ఇంకా ఒక్క పైసా కూడా జమ కాలేదు. అసలు రుణం అలాగే ఉంది.

- కోన చంద్రరావు, రైతు, చోడవరం మండలం, గౌరీపట్నం, విశాఖ జిల్లా

ఒక్క రూపాయీ అందలేదు



మొదటి విడత మినహా.. ఒక్క రూపాయి కూడా ఖాతాకు చేరలేదు. వరి, పసుపును 2.50 ఎకరాల్లో సాగు చేశా. అందుకోసం బ్యాంకులో రూ.50 వేలు రుణం తీసుకున్నాను. చివరికి అది వడ్డీ అన్నీ కలుపుకొని మొదటి విడత రుణమాఫీ సమయానికి రూ.80 వేలకు అప్పు చేరింది. దీనితో పాటు మరో రూ.50 వేలు బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి అప్పు తీసుకున్నాను. మొత్తం కలిపి రూ.1.30 లక్షలు రుణం చెల్లించాల్లి ఉంది. మొదటి విడతలో రూ.28 వేలు, రెండో విడద, మూడో విడతా రాలేదు. కూతురు వివాహం కోసం తనఖాలో పెట్టిన బంగారు అప్పు చేసి చెల్లించి విడిపించుకున్నా.

- యు. శేఖర్, రైతు, చాపాడు, కడప.

దళితుల భూ కొనుగోలెక్కడ?

- ప్రహసనంగా పథకం అమలు
- ఒక్క ఎకరా చేతికందని వైనం
- ఖాతాల్లో మురుగుతున్న నిధులు

ప్రజాశక్తి - కడప సిటీ ప్రతినిధి

దళితుల్లో ఆర్థిక స్థితిని మెరుగుపరిచి ఆత్మగౌరవాన్ని నింపేందుకు ఏర్పాటు చేసిన 'భూ కొనుగోలు' పథకం పూర్తిగా నీరుగారిపోతోంది. లక్ష్యాల అమలులో ఒక్క అడుగూ ముందుకు పడడంలేదు. దళితుల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా కడప జిల్లా ఎస్‌సి కార్పొరేషన్‌లో నెలకొంది. ఏడాది గడువు ముగుస్తున్నా ఏ ఒక్క ఎకరా కొనుగోలుకు నోచుకోలేదు. పైగా రిపోర్టులు మాత్రం లక్ష్యాలను అధిగమిస్తున్నట్లు ఉన్నతాధికారులకు చేరుతున్నాయి. ఆశించిన మేర లబ్ది చేకూరక జిల్లా దళిత రైతులకు పథకం ప్రహసనంగా మారింది.

భూ కొనుగోలు పథకాన్ని జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ (ఎస్‌సి కార్పొరేషన్) ద్వారా అమలు చేస్తోంది. భూములు అమ్మడానికి ముందుకు వచ్చే రైతుల నుంచి భూమిని కొనుగోలు చేయాలి. నీటి వసతి, సంవత్సరంలో పండించే పంట సంఖ్యను బట్టి భూమి ధరలను నిర్ణయిస్తారు. మెట్టభూమైతే ఎకరానికి రూ.3 లక్షలు, తరిభూమైతే రూ.ఆరు లక్షలు, రెండు పంటలనిచ్చే తరిభూమైతే రూ.15 లక్షల చొప్పున భూ అమ్మకందారులకు చెల్లిస్తోంది. నిరుపేద దళితులను లబ్ధిదారులుగా ఎంపికచేసి వారికి ఆ భూమిని అప్పగించాల్సి ఉంది.

ఒట్టి మాటలే.. చేతలేవీ?

ప్రభుత్వం 2016-17 ఆర్థిక సంవత్సరానికి గానూ 2,000 ఎకరాలను కొనుగోలు చేసి పేద రైతులకు అందించాలన్ని సంకల్పించినట్లు గతంలో జిల్లా సమీక్షకు విచ్చేసిన ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. అందుకోసం ఎంత మొత్తం ఖర్చయినా వెచ్చించేందకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అప్పటి కలెక్టరు సత్యనారాయణ వెయ్యి ఎకరాలను కొనుగోలు చేయాలని నిర్ధేశించారు. ఇప్పటికే వెయ్యి మందికి పైగా రైతులు భూములను అమ్మేందకు ముందుకు వచ్చినట్లు సమాచారం. అయినప్పటికీ ఇప్పటి వరకు ఒక్క ఎకరా కూడా కొనుగోలు చేయలేదు. కేవలం భూముల పరిశీలన పేరుతో అధికారులు కాలయాపన చేస్తున్నారన్న వాదన రైతుల నుంచి వినిపిస్తోంది. చివరికి ఈ టార్గెట్‌ను పూర్తిగా 66 ఎకరాలకే కుదించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ లక్ష్యాన్ని కూడా అధికారులు అధిగమించడం లేదు. ఈ పథకం ద్వారా లబ్ధిపొందడానికి వందల సంఖ్యలో పేద దళిత రైతులు ధరఖాస్తు చేసుకున్నారు. ఏడాది పూర్తి కావస్తున్నా లబ్ధికోసం ఎదురు చూసిన పేదలకు మాత్రం మొండిచేయే ఎదురవుతోంది.

ధరల నిర్ణయంలో జాప్యం

భూములను ఇచ్చేందుకు రైతులు ముందుకు వస్తున్నా వాటి ధరను నిర్ణయించే దగ్గర తీవ్రస్థాయిలో జాప్యం జరుగుతోంది. ధరలను నిర్ణయించడంలో సుదీర్ఘ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ప్రక్రియలో భాగంగా తహశీల్దారు, జియాలజీ, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు ఆర్‌డిఒ, జాయింట్ కలెక్టరు భూములను పరిశీలించి ధరను నిర్ణయించాల్సి ఉంటుంది.

మురుగుతున్న నిధులు

కడప జిల్లా ఎస్సీ కార్పొరేషన్‌కు 2016-17 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.9 కోట్లు పథకానికి కేటాయించింది. ఇప్పటి వరకు నిధులున్నా వాటిని వినియోగించుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. వీటి నుంచి పథకం అమలు కోసం ఏ ఒక్క రూపాయీ ఖర్చు చేయకపోవడంతో నిధులు అధికారుల ఖాతాల్లోనే మురుగుతున్నాయి.

భూములను పరిశీలిస్తున్నాం

భూములను కొనుగోలు చేసేందుకు పరిశీలన చేస్తున్నాం. వాటికి సంబంధించి వేంపల్లి, సింహాద్రిపురంతో పాటు పలు మండలాల్లో రైతులతో బేరసారాలు చేశాం. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు రైతులు చెబుతున్న ధరలకు పొంతన కుదరడం లేదు. ప్రస్తుం ఆరు ఎకరాల రైతులతో ధర కుదిరింది. మిగిలిన లక్ష్యాన్ని త్వరలోనే పూర్తి చేస్తాం.

- శ్రీలక్ష్మి, ఇడి, ఎస్సీ కార్పొరేషన్, కడప.

విమానాశ్రయంలో రివాల్వర్ అలజడి

టాయ్‌గన్‌గా గుర్తించిన పోలీసులు

ప్రజాశక్తి-గన్నవరం (కృష్ణాజిల్లా)

కృష్ణాజిల్లా గన్నవరం విమానాశ్రయంలో ఓ యువకుడు రివాల్వర్‌తో ప్రయాణించేందుకు ప్రయత్నించడంతో ఆ ప్రాంతంలో అలజడి రేగింది. పోలీసులూ ఆందోళనకు గురయ్యారు. తుపాకీ విక్రయ డీలర్ల పరిశీలనలో అది ఎయిర్ గన్‌గా గుర్తించడంతో రివాల్వర్ కథకు తెరదించారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ సోదరుడు రామకృష్ణ కుమారుడు వెంకటేష్ హైదారాబాదు వెళ్లడానికి బుధవారం సాయంత్రం గన్నవరం విమానాశ్రయానికి వచ్చాడు. ఎయిర్ ఇండియా విమానంలో అతను ప్రయాణించాల్సి ఉంది. అతను తీసుకొచ్చిన బ్యాగును భద్రతా సిబ్బంది తనిఖీ చేయగా రివాల్వర్ ఆకారంలో ఉన్న వస్తువును గుర్తించారు. దాని గురించి వెంకటేష్‌ను ప్రశ్నించగా ఆడుకునేందుకు కొనుగోలు చేసిన ఎయిర్‌గన్‌గా చెప్పాడు. అనుమానించిన పోలీసులు అతడిని విమానాశ్రయంలో కూర్చోబెట్టి రివాల్వర్‌ను తనిఖీ కోసం విజయవాడలో గన్‌లు విక్రయించే డీలర్ వద్దకు పంపించారు. పరిశీలనలో ఎయిర్‌గన్‌గా నిర్ధారించారు. వెంకటేష్‌ను పోలీసులు విమానాశ్రయంలో నిలిపేసిన సంగతి తెలుసుకున్న తండ్రి రామకృష్ణ, బంధువులు హుటాహుటిన విమానాశ్రయానికి చేరుకుని పోలీసులతో చర్చించారు. ఎమ్మెల్యే సోదరుని కుమారుడు కావడంతో రాజకీయంగా పోలీసులపై వత్తిడి వచ్చినట్లు తెలిసింది. దీంతో విమానాశ్రయంలోని పోలీసు అధికారులు వెనక్కి తగ్గి వెంకటేష్‌ను మాటలతో మందలించి పంపేసినట్లు సమాచారం. ఎయిర్‌గన్ విమానంలో తీసుకెళ్లడం నిషిద్ధమని అధికారులు పేర్కొనడం గమనార్హం. దీనిపై గన్నవరం సిఐ శ్రీధర్‌కుమార్‌ను అడగ్గా వెంకటేష్ వద్ద గుర్తించిన రివ్వాలర్ టాయ్‌గన్‌గా పేర్కొన్నారు.

సంపాదకీయం

ఇంకా దుస్థితిలోనే

ఆర్థికంగా సామాజికంగా అట్టగున ఎవరైనా ఉన్నారంటే వారు షెడ్యూల్డు తెగలకు (ఎస్టీలు) చెందిన ప్రజానీకమే. ప్రభుత్వాలూ అంగీకరిస్తున్నాయి. సదరు జనం అభివృద్ధి దగ్గరకొచ్చేసరికి పాలకులకు నిలువెత్తు నిర్లక్ష్యం ఆవహిస్తోంది. స్వాతంత్ర్యం ఇన్నేళ్లయినా గిరిజనుల బతుకులు ఇంకా అట్టగునే కునారిల్లుతున్నాయి. ఆహారం, రక్షిత తాగునీరు, విద్య, వైద్యం, విద్యుత్, రహదారి ఇత్యాది కనీస మౌలిక సదుపాయాలు ఇంకా ఎస్టీల్లో అత్యధిక భాగం దరి చేరకపోవడం పట్ల ఏలికలు సిగ్గు పడాలి. కొండ కోనల్లో విసిరేసినట్లుండే గిరిజన గూడేలకు సదుపాయాలందాలంటే ముందుగా కావాల్సింది రహదారి సౌకర్యం. రోడ్డు కనెక్టివిటీ ఉంటే గిరిజనులకు, నాగరిక సమాజానికి మధ్య అనుసంధానం కలుగుతుంది. అలాంటి ముఖ్యమైన రహదారి సదుపాయం కల్పించడంలో ఏలిన ప్రభువులు ఎంతగా గిరిజన ప్రాంతాలను నిర్లక్ష్యం చేశారో షెడ్యూల్డు ఏరియాలను ఒక్కసారి పరికిస్తే హృదయం ఉన్న ప్రతి ఒక్కరికి గుండెలూ ద్రవిస్తాయి. నేటికీ కాలిబాటలే శరణ్యం. కొన్నిటికైతే ఆ కాలి బాటలు కూడా లేవు. ఒక గ్రామానికి ఒక గ్రామానికి మధ్య దూరం పది పదిహేను కిలోమీటర్లకు పైనే ఉంటుంది. అలాంటి చోట్ల రోగమొచ్చినా నొప్పి వచ్చినా అర్ధరాత్రైనా అపరాత్రైనా కాలి బాటల గుండా డోలీల్లో మోసుకెళ్లాల్సిందే. మధ్యలో గుట్టలు మిట్టలు వాగులు వంకలు డోలీలతో సహా దాటాల్సిందే. వైద్యం కోసం రోగ గ్రస్తులను డోలీల్లో మోసుకెళ్లే దృశ్యాలు లెక్కకు మించినన్ని సార్లు పత్రికల్లో, మీడియా ఛానళ్లల్లో దర్శనమిస్తున్నా ప్రభుత్వాలకు దున్నపోతు మీద వాన పడ్డట్లుగానే ఉంటున్నది. ఏజెన్సీలో రహదారి సౌకర్యం లేనందున సకాలంలో వైద్య సౌకర్యం అందక అర్థాంతరంగా

కన్ను మూస్తున్న ఆదివాసీల లెక్కలను సర్కారు చిత్తశుద్ధితో బయటపెడితే ప్రభుత్వాల వైఫల్యం ఎంత దారుణమో లోకానికి తెలిసొస్తుంది.

విభజన అనంతరం నవ్యాంధ్రలో ఏజెన్సీ గ్రామాలు సుమారు 5,200 కాగా వాటిలో 42 శాతం గ్రామాలకు అసలు రోడ్డు సౌకర్యం లేదు. ప్రజలకు కాలి బాటలే దిక్కు. రహదారి సదుపాయం ఉందంటున్న 58 శాతం గ్రామాల్లో 25 శాతం గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. గిరిజనులు ఆటోలు, టెంపోల వంటి ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. అవి తరచు ప్రమాదాలకు గురికావడంతో గిరిజనులు చనిపోవడమో లేక శాశ్వత అంగవైకల్యం కలగడమో తీవ్ర గాయాలపాలు కావడమో జరుగుతోంది. ఏజెన్సీ గిరిజనుల అభివృద్ధి కోసం నెలకొల్పిన ఏడు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటిడిఎ)లు మొక్కుబడి తంతేననడానికి ఆదివాసీ గ్రామాలే సజీవ సాక్ష్యాలు. ఆదివాసీలకు కంటితుడుపుకైనా ఐటిడిఎలు ఉన్నాయి. అదే మైదాన ప్రాంత గిరిజనులకైతే అవీ లేవు. అభివృద్ధే తమ నినాదమని నిత్యం వల్లించే చంద్రబాబు జమానాలో ఏజెన్సీలో రోడ్ల నిర్మాణాలు అఘోరించాయి. గత సంవత్సరం పదిహేనొందల గిరిజన గ్రామాలకు 2,800 కిలోమీటర్ల రోడ్లు వేయాలని సర్కారు నిర్ణయించగా ఇప్పటికి వేసింది 15 కిలోమీటర్లు మాత్రమే. రంపచోడవరం ఐటిడిఎ పరిధిలో అయితే ఒక కిలోమీటరు రోడ్డే వేశారు. రంపచోడవరం పరిధిలోనే నిరుడు చాపరాయి గ్రామంలో విష జ్వరంతో పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డారు. అందుక్కారణం సకాలంలో వైద్యం అందకపోవడమే. రహదారి సౌకర్యం లేనందున రోగులను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించలేక పోయారు. బాధిత గ్రామానికి 108 అంబులెన్స్, మొబైల్ వైద్య చికిత్స కేంద్రం వెళ్లలేకపోయాయి. ఇలాంటి సంఘటనలను సర్కారు ఎందుకు గుణపాఠాలుగా తీసుకోదో అర్థం కాదు.

ఏపీలో 27.40 లక్షల జనాభా ఉందని 2011 నాటి జన గణన తెలుపుతోంది. ఏజెన్సీ ఆదివాసులు 14.5 లక్షల మంది కాగా మిగిలిన వారు మైదానప్రాంత గిరిజనులు. మొత్తం రాష్ట్ర జనాభాలో గిరిజన జనాభా 5.53 శాతం. జనాభా దామాషా ప్రకారం ప్రణాళికా బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సి ఉండగా ప్రభుత్వాలు ఆ పని చేయలేదు. సబ్‌ప్లాన్ అమలుకు చట్టం వచ్చినా తీరు మారలేదు. పైగా సబ్‌ప్లాన్ నిధులను వేరే వ్యాపకాలకు మళ్లించాయి. ప్రణాళికాసంఘం రద్దయి కేంద్రంలో నీతిఆయోగ్ ఇచ్చాక సబ్‌ప్లాన్ లేదు. చంద్రబాబు సర్కారు ఈ ఏడాది నుంచి ప్రణాళికా బడ్జెట్ కాంపొనెంట్‌ను ఎత్తేసింది. అయినా ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయిస్తామంది. అదే నిజమైతే 2017-18 రాష్ట్ర బడ్జెట్ రూ.1.56 లక్షల కోట్లలో గిరిజనులకు రూ.ఎనిమిదిన్నర వేల కోట్లు ఖర్చు చేయాలి. ఆచరణలో అదేమీ కనిపించట్లేదు. చంద్రబాబు దత్తత తీసుకున్న విశాఖలోని పెదలబుడు గ్రామంలోనే అభివృద్ధి జాడల్లేవు. గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఎన్నిసార్లు 'జన్మభూమి-మావూరు'లను నిర్వహించినా, మరెన్నిసార్లు 'సడక్ యోజనల'ని ఘోషించినా ప్రచార పటాటోపానికే.

ఇది విషయం



అమ్మా...అమ్మోరు తల్లి
ఏమిటమ్మా ఈ ఘోరం...
నిను నిద్ర కూడా పోనీరా
తాంత్రిక మంత్రాంగం!

ఉన్నావో లేవో నువు
నీమీదే పూనకం...
ఓటేసే జనం పైన
లేదేమో నమ్మకం!

- కొల్లూరు వెంకట్

'భీమ-కొరేగావ్'లో అశాంతి ఎందుకు?

గత కొన్ని రోజులుగా తీవ్ర అశాంతికి కేంద్ర బిందువుగా నిలిచిన 'భీమ- కొరేగావ్' మహారాష్ట్ర లోని పూణే సమీపంలో వున్న ఓ చిన్న గ్రామం. కానీ మరాఠా చరిత్రలోని అసాధారణ పోరాటంతో ఈ గ్రామానికి అనుబంధం వుంది. రెండు వందల ఏళ్ల క్రితం సరిగ్గా 1818 జనవరి ఒకటవ తేదీన ఈస్టిండియా కంపెనీకి చెందిన కొన్ని వందల మంది మరాఠా సైనికులు కొరేగావ్‌లో రెండో పీష్వా బాజీరావ్ నేతృత్వంలోని శక్తివంతమైన పీష్వా సైన్యాన్ని ఓడించారు. అప్పటి నుండి దళితుల చరిత్రలో ఈ పోరాటం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. అంబేద్కర్ వాదాన్ని సమర్థించే దళితులు మాత్రం దీనిని సామ్రాజ్యవాదంతో జాతీయవాదం పోరు అన్న సంకుచిత దృష్టితో చూడటం లేదు. ఏళ్లు గడిచే కొద్దీ ఈ పోరాట విజయం...నాటి బ్రాహ్మణీయ పీష్వాలు సాగించిన సామాజిక అన్యాయాలపై మరాఠా వీరులు సాధించిన విజయంగా స్థిరపడిపోయింది. ఇక్కడ ఏర్పాటు చేసిన విజయస్థూపం దగ్గరకు వేలాది మంది అంబేద్కరిస్టులు చేరి నాటి పోరాటంలో అసువులు బాసిన వారికి నివాళులు అర్పిస్తుంటారు. 1818లో పీష్వాల నియంత పాలనకు తెర దించిన నాటి పోరులో ప్రాణాలు కోల్పోయిన వారి పేర్లతో కూడిన ఈ విజయ స్థూపాన్ని ఈస్టిండియా కంపెనీ ఏర్పాటు చేసింది.



ప్రబోధన్ పాల్



గతం.. వర్తమానం...

ఈ విజయం తమకు స్ఫూర్తిదాయకమని దళితులు ముక్తకంఠంతో చెబుతుంటారు. ఇటీవలి కాలంలో ముఖ్యంగా మహారాష్ట్రలో భీమ-కొరేగావ్ రణస్థంభ్ సేవా సంఘ్ (బికెఆర్ఎస్సెస్) దళితులు... ఈ విజయ స్థూపాన్ని తమ రాజకీయ ఆకాంక్షలకు ప్రతిరూపంగా భావిస్తున్నారు. పీష్వాలపై వారి పోరు కేవలం వ్యూహాత్మకమైనది మాత్రమే..సమకాలీన సమాజంలో తమ రాజకీయ, సామాజిక వెనుకబాటుతనాన్ని తెరపైకి తెచ్చేందుకు ఇది వారికి సహకరించిందని చెప్పవచ్చు. ఇటువంటి చారిత్రక అంశం దళిత రాజకీయాలను సరికొత్త స్థాయిలో ఆవిష్కరిస్తుందా? లేదా? అన్నదే ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

'భీమ-కొరేగావ్' పోరు ద్విశత వార్షికోత్సవం జరిగిన జనవరి ఒకటో తేదీన ఏం జరిగింది? ఒక వ్యక్తి మృతికి దారి తీసిన పరిస్థితులేమిటి? డా॥ బిఆర్ అంబేద్కర్ మనుమడు ప్రకాశ్ అంబేద్కర్ మహారాష్ట్రలో ప్రముఖ దళిత నేత అన్న విషయం తెలిసిందే. 'భీమ-కొరేగావ్' లో కొన్ని హిందూత్వ సంస్థలు దళితులపై దాడికి, హింసాకాండకు ప్రణాళికలు సిద్ధం చేశాయని ఆయన చెబుతున్నారు. ఈ హిందూత్వ సంస్థలకు సారథులుగా వున్న ప్రముఖ మరాఠా నేతలు శంభాజీ బిడే, మిళింద్ ఎక్బొటే రాష్ట్రంలో ప్రస్తుత హింసాకాండకు బాధ్యులని ఆయన అంటున్నారు. ఈ సంస్థలు తమ స్వార్థ రాజకీయాల కోసం కుల, మత విభేదాలను రెచ్చగొడుతున్నాయని... ముఖ్యంగా అంబేద్కరిస్టులను, దళితులను తమ రాజకీయ పావులుగా చేసుకుంటున్నాయని ఆయన విమర్శించారు. 'భీమ-కొరేగావ్' గ్రామానికి అతి సమీపంలో వున్న మరో కుగ్రామం వధుబద్రుక్‌లో జరిగిన ఓ ఘటన ఈ హింసాకాండకు కీలకంగా మారింది. మరాఠా పాలకుడు శివాజీ పెద్ద కుమారుడు శంభాజీ 1689లో మొఘలుల చేతుల్లో హతమైన తరువాత ఇక్కడే సమాధి చేశారు. అనంతరం ఔరంగజేబు శంభాజీ మృతదేహాన్ని వెలికి తీసి ముక్కలు చేసి ఒక నదిలోకి విసిరేశాడన్న కథనం ప్రచారంలో వుంది. ఆ శరీర భాగాలను వధుబద్రుక్ గ్రామ వాసి అయిన గోవింద్ మహర్ (గైక్వాడ్) అనే దళితుడు సేకరించి అంతిమ సంస్కారాలు నిర్వహించాడు. మహర్‌లు ఆ గ్రామంలో శంభాజీ స్మారక చిహ్నాన్ని కూడా నిర్మించారు. తరువాత కాలంలో గోవింద్ మహర్ మరణించిన తరువాత ఆయన సమాధిని కూడా అదే గ్రామంలో నెలకొల్పారు.

ప్రణాళికాబద్ధమైన దాడి

కాగా శంభాజీ అంతిమ సంస్కారాలలో గోవింద్ గైక్వాడ్, ఇతర మహర్‌లు పోషించిన పాత్రను గుర్తించేందుకు అగ్ర కుల మరాఠీలు నిరాకరించారు. ఈ చరిత్రను గుర్తు చేసే స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేసేందుకు వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇరువర్గాలూ పోలీసులకు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నాయి. మహారాష్ట్రలో మరాఠా చరిత్రను ముస్లిం వ్యతిరేక-హిందూత్వ దృష్టికోణంలో ఆవిష్కరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. వాస్తవానికి రాష్ట్రంలో రాజకీయ మితవాదశక్తులు ఎదుగుదలకు ఈ ప్రయత్నాలే దోహదం చేశాయని చెప్పవచ్చు. ప్రస్తుతం విద్యావకాశాలు లేక తీవ్ర నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్న మరాఠా యువతను మరాఠీల పూర్వ వైభవాన్ని కీర్తించే హిందూత్వ సంస్థలు ఈ మితవాద రాజకీయాల్లోకి సులభంగా ఆకర్షించగలిగాయి. వధుబద్రుక్‌లో చోటు చేసుకున్న ఘర్షణలకు కొనసాగింపే 'భీమ-కొరేగావ్'లో జరిగిన హింసాత్మక ఘర్షణలు. ఇదంతా ముందస్తు ప్రణాళికతో జరిగిన హింసాకాండ అనే సంకేతాలు వెలువడ్డాయి. ఈ ఏడాది 'భీమ-కొరేగావ్' పోరు ద్విశత వార్షికోత్సవ సంవత్సరం కావటంతో దళితులు పెద్దయెత్తున కార్యక్రమాలు చేపట్టారు. 1818 వరకూ పీష్వాలు పాలించిన శనివార్ వాడ వద్ద ఎల్గార్ పరిషత్ పేరుతో భారీ బహిరంగసభను నిర్వహించేందుకు అనేక దళిత, బహుజన సంఘాలు విస్తృత ఏర్పాట్లు చేశాయి. ఈ బహిరంగ సభ అజెండా అంతా నయా పీష్వాల (ప్రస్తుత పాలకుల)ను తెరపైకి తెస్తున్న హిందూత్వ రాజకీయాలను ఎండగట్టటమే. ఈ బహిరంగ సభకు ప్రకాశ్ అంబేద్కర్‌తో పాటు గుజరాత్ దళిత నేత జిగ్నేష్ మేవానిని కూడా ఆహ్వానించారు. హిందూత్వానికి వ్యతిరేకంగా ముఖ్యంగా గుజరాత్‌లోని ఉనా హింసాకాండ అనంతర పరిణామాల నేపథ్యంలో దళితుల్లో చైతన్యం హిందూత్వశక్తులకు కంటగింపుగా మారింది. దళిత రాజకీయాలపై వారు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలకు ఎల్గార్ పరిషత్ మరింత బలం చేకూర్చింది. నాటి పీష్వాలను హిందూత్వ శక్తులతో పోలుస్తూ దళితులు చేస్తున్న కొత్త రాజకీయ వాదన మితవాద శక్తులకు మింగుడు పడనందునే, ఇప్పుడు మనం చూస్తున్న పరిణామాలకు దారితీసిందన్న విషయం స్పష్టమవుతోంది.

(రచయిత ఢిల్లీ యూనివర్శిటీ రంజాస్ కళాశాలలో చరిత్ర బోధకుడు)

జనవాక్యం

సమగ్ర మూల్యాంకనం



రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో ప్రవేశ పెట్టిన నిరంతర సమగ్ర మూల్యాంకనంలో బహుళైచ్ఛిక ప్రశ్నల విధానం ఒకటి. ఈ విధానంలో వున్న ప్రశ్నల సరళి, పరీక్ష విధానం విద్యార్థులకు ఉపయోగపడేదే. అయితే ఈ విధానం ఆరవ తరగతి నుండి అవలంబిస్తే బాగుంటుంది. ఇదిలా ఉంటే ప్రయివేట్ విద్యాసంస్థల్లో నిర్వహించే పరీక్షా విధానం ఈ రీతిలో ఉండదు. ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ ఈ విషయంలో పూర్తిగా లోపించింది. ప్రయివేటు విద్యాసంస్థల తీరుతో నాణ్యమైన ప్రశ్నాపత్రం నాసి రకంగా మారింది. దీంతో విద్యార్థులు పరీక్షలను అసహ్యించుకొనే ప్రమాద ముంది. విద్యార్థుల్లో అటువంటి భావం కలగక ముందే అధికారులు కళ్లు తెరవాలి. సమగ్ర మూల్యాంకనం ప్రయోజనాత్మకంగా సాగేలా చర్యలు తీసుకోవాలి.

సిఎస్ కుమార్, శ్రీనివాసపురం, తిరుపతి.

వ్యాసాలు, ఉత్తరాలు పంపించాల్సిన చిరునామా
editpageps@gmail.com

సమాధానం

నా గురి కమ్యూనిస్టు పార్టీల ఫ్యూడల్, పెట్టుబడిదారీ ధోరణుల వైపు!

'ప్రజాశక్తి' దిన పత్రికలో, వి. శ్రీనివాసరావుగారు (2017, డిసెంబరు 31న), 'రంగనాయకమ్మగారూ, మీ గురి ఎటు వైపు?' అని రాసినది చదివాను. నా గురిని అడగడానికి కారణం అయిన పుస్తకం మాట శ్రీనివాసరావుగారు ఎత్తలేదు. కాబట్టి, సందర్భం ఏమిటో పాఠకులకు తెలియడం కోసం, ఆ సమాచారం నేను కొంచెం ఇవ్వాలి. సోవియట్ రష్యాలో జరిగిన 'వర్గ పోరాటాల' గురించి, ఫ్రెంచి మార్క్సిస్టు ఆర్థిక శాస్త్రవేత్త చార్లెస్ బెతల్‌హామ్ రాసిన 4 సంపుటాలు 1974కీ, 1982కీ మధ్య వచ్చాయి. వాటి ఇంగ్లీషు అనువాదాలు ఆ తర్వాత వచ్చాయి. ఈ సంపుటాలు రాయడానికి బెతల్‌హామ్ తీసుకున్న ఆధారాలు: ఆ నాటి రష్యా పార్టీ డాక్యుమెంట్లూ, ఎంక్వయిరీలూ, సెన్సెస్ రిపోర్టులూ కమ్యూనిస్టు పార్టీ మహాసభల రిపోర్టులూ; రష్యాకీ-ఇతర దేశాలకీ చెందిన చరిత్రకారులూ, ఆర్థికవేత్తలూ రష్యా గురించి రాసిన రచనలూ; చాలా వరకూ లెనిన్ రచనలూ!

అక్టోబరు విప్లవం జరిగి వందేళ్ళు అవుతున్న సందర్భంగా, కమ్యూనిస్టు పత్రికల్లో వస్తూ వుండిన వ్యాసాలు చదివినప్పుడు, ఆ విప్లవం ఎందుకు అంతర్థానమైందీ – ఆ వివరణ ఎక్కడా కనిపించలేదు. 2017 నవంబరుతో, అక్టోబరు విప్లవ శత వార్షికోత్సవాలు ముగిసి, వాటి రిపోర్టులు కమ్యూనిస్టు పత్రికల్లో వచ్చాయి. ఆ రిపోర్టుల్లో కూడా, అక్టోబరు విప్లవం ఎందుకు పోయిందో వివరణలు లేవు. ఆ రిపోర్టులు చూశాక, 'మళ్ళీ అదే ప్రశ్న! జవాబేదీ?' అనే పేరుతో, ఆంధ్రజ్యోతిలో డిసెంబరు 30న ఒక వ్యాసం రాశాను. దానికి 'సమాధానం'గా, వి.శ్రీనివాసరావుగారి వ్యాసం వచ్చింది. హైదరాబాదులో 'ప్రజాశక్తి' పత్రిక దొరకదు. పాఠక మిత్రులు పంపిన పేపరు కటింగు ఈమెయిల్‌లో చూశాను.

ఇంక ఇప్పుడు నా జవాబులు

(1) సోవియట్ యూనియన్‌లో సోషలిజం కూలిపోవడానికి కారణాలను, సి.పి.యం. పార్టీ వారు, 1992లో జరిగిన పార్టీ మహా సభలలో, ఒక సైద్ధాంతిక తీర్మానం చేశారనీ దాన్ని నేను గమనించక, 'ఏమీ ఎరగనట్టుగా' ప్రశ్నలు వేశాననీ, రాశారు శ్రీనివాసరావుగారు.



రంగనాయకమ్మ

ఆ తీర్మానం నాకు తెలిసిందే. అది, 8 భాగాలుగా వుంది. అందులో 138 పాయింట్లు వున్నాయి. ఆ తీర్మానంలో, అక్టోబరు విప్లవం తర్వాత రష్యాలో వుండిన వర్గాలు ఏమిటీ, వాటి ప్రయోజనాలు ఏమిటీ, వాటి మధ్య వర్గ పోరాటం ఏ యే రూపాల్లో జరిగిందీ – అనే మాటలు గానీ, వివరణలు గానీ, లేవు. ఆ తీర్మానంలో, సోవియట్ ప్రస్తావనలు ఎలా వున్నాయో చూడండి.

(1) 1956లో కృశ్చేవ్ రివిజనిజానికి తలుపులు తెరిచాడు (2వ భాగంలో 28వ పాయింటు).

(2) 1968లో, మేము బర్ద్వాన్ ప్లీనంలో కృశ్చేవ్ రివిజనిజాన్ని ఖండించాము (1:6).

(3) 1987 నించీ, సోవియట్ కమ్యూనిస్టు పార్టీ ప్రతిపాదించిన సిద్ధాంతాల్ని చాలా వాటిని మేము అంగీకరించలేదు (1:7).

ఈ తీర్మానంలో గానీ, సోవియట్ యూనియన్ గురించి సి.పి.యం. ప్రచురించిన రచనల్లో గానీ, సోవియట్ యూనియన్ పతనానికి కృశ్చేవూ, గోర్బచేవులు కారణం అనే రకపు సూత్రీకరణలే గానీ, వర్గ విశ్లేషణ ఎక్కడైనా కనపడుతుందా?

2) సోవియట్ యూనియన్‌లో వర్గాలు పోయాయని సి.పి.యం. ఏ నాడూ చెప్పలేదనీ ఆ మాట చెప్పింది కృశ్చేవే ననీ, దానిని కమ్యూనిస్టులందరికీ అంటగట్టి నేను మాట్లాడాననీ, శ్రీనివాసరావుగారి విమర్శ.

నా వ్యాసాల్లో గానీ, బెతల్‌హామ్ సంపుటాలకు నేను రాసిన పరిచయంలో గానీ, సోవియట్ యూనియన్‌లో వర్గాలు పోయాయని సి.పి.యం. వారో, ఇంకో పార్టీ వారో, అన్నారని నా వాదన ఎక్కడా లేదు. నేను, వర్గాల విషయంలో స్టాలిన్, ట్రాట్స్కీల మాటలే చూపించాను. దోపిడీ వర్గం పోయి, కార్మిక వర్గం వుంది – అని స్టాలిన్ మొదట్లోనే అన్నాడు. 1936 నవంబరు 25 నాటి ఒక నివేదికలో స్టాలిన్ వర్గాలు లేవని అనడాన్ని ప్రస్తావించి విమర్శించానే గానీ, సి.పి.యం.ని ప్రస్తావించలేదు. కానీ, సి.పి.యం.కి కూడా అదే అవగాహన వున్నదనడానికి ఆధారాలు, శ్రీనివాసరావుగారు ప్రస్తావించిన తీర్మానంలోనే వున్నాయి. తీర్మానపు 2వ భాగంలో, 3వ పాయింటులో, '1917లో సోషలిస్టు సమాజం ఏర్పడి వర్గ దోపిడీని రద్దు చేసింది' అని చెప్పుకున్నారు. 'వర్గ దోపిడీ రద్దు' అంటే, వర్గాలు పోయాయి, లేవూ – అని సి.పి.యం. చెప్పినట్టు కాదా?

3) సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీలో జనరల్ సెక్రటరీగా స్టాలిన్ 1922 నించీ 1953లో మరణించే వరకూ వున్నాడు. అదే చెప్పి నేను, దాన్ని మన కమ్యూనిస్టులు ప్రశ్నించక పోవడాన్నే తప్పు పట్టాను. రష్యా గురించీ, స్టాలిన్ గురించీ, నేను అన్న దానికి శ్రీనివాస రావుగారు జవాబు చెప్పలేదు. భారతదేశంలో అలా జరగ లేదని సి.పి.యం. తన నిబంధనావళిని మార్చుకుందనీ, 9 సంవత్సరాలకు మించి పదవిలో కొనసాగరాదని నిబంధన విధించుకుందనీ, నేను అడగని విషయాలు ప్రస్తావించారు.

ఆ నాడు గానీ, ఈ నాడు గానీ, సి.పి.యం. వారు, స్టాలినే అన్నేళ్ళ పాటు (31 సంవత్సరాలు) జనరల్ సెక్రటరీగా వుండడం ఏమిటీ, వేరే నాయకులు లేరా, కుర్చీని వదలని రాజుని ఇతర సభ్యులు ఎలా భరించారు – అని ప్రశ్నించనేలేదు కాబట్టి సి.పి.యం. గురించే ఇప్పుడు అడుగుతాను.

జ్యోతిబసుగారు 1977 నించీ 2000 వరకూ, అంటే, 23 ఏళ్ళు వరసగా ముఖ్యమంత్రి పదవిలో వుండడం ఏమిటి? పార్టీలో రెండో మార్క్సిస్టు వుండరా? సుందరయ్యగారు, జనరల్ సెక్రటరీగా 14 ఏళ్ళూ (1964–1978) నంబూద్రిపాద్ 14 ఏళ్ళూ (1978–1992) హరికిషన్ సింగు 13 ఏళ్ళూ (1992–2005), ప్రకాష్ కారత్ 10 ఏళ్ళూ – ఇలా ఎందుకుండాలీ? వేరే నాయకులు లేరా? ఇతరులకు ఆ అవకాశాలు వుండకూడదా?

మీరు నిబంధన మార్చుకున్నది ఎప్పుడు? పార్టీ మొదలైన తర్వాత 48 ఏళ్ళకి (1964–2012)! రష్యాలో, స్టాలిన్, మరణం వరకూ జనరల్ సెక్రటరీగా వున్నాడనేదే ప్రశ్న. ఈ ప్రశ్న మీ పార్టీకి వచ్చి వుంటే, మీరు మీ పద్ధతి మార్చుకోడానికి 48 ఏళ్ళు ఆగవలిసి వచ్చిందా? మీరు 'కఠినమైన నిబంధన' పెట్టుకున్నట్టు చెప్పారు. ఒక పదవీ బాధ్యతని మరొక వ్యక్తికి ఇవ్వడం కఠినమైన విషయమా?

4) 'విమర్శా, ఆత్మ విమర్శా' అనే పదాల్ని చిలక పలుకుల్లా వల్లిస్తారే గానీ, అదేమీ వుండదని, నేను అన్నదాన్ని మీరు విమర్శించారు. నేను కమ్యూనిస్టు పార్టీల నివేదికలను చదవకుండా ఈ నిర్ధారణకు వచ్చి వుంటానన్నారు.

రష్యా, చైనా పార్టీలలో విమర్శలూ, ఆత్మ విమర్శలూ, ఎలా వుంటాయో, బెతల్‌హామ్ రచనల ద్వారా తెలుసు కాబట్టే గతంలోనే, 'చైనా పార్టీలో మార్మిక పద్ధతులు' అని రాశాను. సి.పి.యం. పార్టీ విశాఖపట్నంలోనూ, కలకత్తాలోనూ, 2015లో జరిగిన సమావేశాలలో తయారైన నివేదికలను నేను చదివి వుండనన్నారు.

విశాఖపట్నంలోని నివేదికలో 61 పాయింట్లు వున్నాయి. ఆ నివేదికలో గానీ, కలకత్తాలోని 217 పాయింట్లు వున్న నివేదికలో గానీ, మీ సమీక్ష అంతా, బూర్జువా రాజ్యాంగ యంత్రపు ఎన్నికల రాజకీయాలలో మీ లోటుపాట్ల గురించి చెప్పుకున్నదే. వాటిల్లో ఒక్క కఠినమైన పదమైనా లేదు, అన్నీ నాజూకు మాటలే, ఈ విధంగా: 'రొటీన్ పద్ధతులూ' (రొటీనిజం) 'మూస ధోరణీ' (స్టీరియోటైప్డ్ ఫంక్షనింగ్) 'జనాలతో సంబంధాలు పోయాయి' (లాస్) 'మనం ఫెయిలయ్యాం' (వియ్ హావ్ ఫెయిల్డ్) పీబీ, సీసీల అశక్తత ('ఇనెబిలిటీ') – ఈ మాటలన్నీ దేన్ని గురించి? బూర్జువా చట్టాలతో నిండిన రాజ్యాంగంలో ఎక్కువ సీట్లు సాధించలేక పోయామే! అయ్యో! – అనే కదా? ఇందులో, మార్క్సిస్టు భావాలు ఎక్కడైనా వున్నాయా?

(5) 'వ్యక్తి పూజ' గురించి నేను చేసిన విమర్శను, శ్రీనివాసరావుగారు ప్రస్తావించి, 'స్టాలిన్, మావో కాలాలలో జరిగిన వ్యక్తి పూజలతో సి.పి.యం. స్పష్టంగా విడగొట్టు కుంది' అని చెప్పుకున్నారు. కానీ, వ్యక్తి పూజల్ని విడగొట్టుకునే ఆ ధోరణి, వారి పార్టీకి లేదని, 1992 నాటి తీర్మానంలో స్టాలిన్ మీద వారు చేసిన ప్రశంసలే చెబుతాయి.

ఆ తీర్మానంలో 2వ భాగంలో 30వ పాయింటులో ఇలా వుంది: 'పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యానికీ, సోషలిస్టు చట్టబద్ధతకూ, సంబంధించిన కొన్ని స్పష్టమైన, ఆమోద యోగ్యం కాని ఉల్లంఘనలను (గ్రాస్ వాయిలేషన్స్‌ని) తీవ్రంగా విమర్శిస్తూనే, 1990 మే – నాటి సి.సి. తీర్మానం ఇలా ప్రకటించింది: 'వ్యక్తి పూజని సరిదిద్దే పేరుతో, సోషలిజం చరిత్రని వ్యతిరేకించే (నెగేటింగ్) ధోరణిని, సి.పి.యం. తిరస్కరించింది. లెనినిజాన్ని పరిరక్షించడంలో ట్రాట్స్కీయిజాన్నీ, ఇంకా ఇతర భావజాల పెడధోరణుల్నీ వ్యతిరేకించడంలోనూ యు.ఎస్.ఎస్.ఆర్.లో సోషలిజం నిర్మాణంలోనూ ఫాసిజంపై విజయంలోనూ యుద్ధంతో ధ్వంసం అయిన సోవియట్ యూనియన్ పునర్నిర్మాణంలోనూ, సామ్రాజ్యవాద దురాక్రమణ చర్యలను నిరోధించే బలాన్ని సోవియట్ యూనియన్ పొందేలా చేయడంలోనూ, జోసెఫ్ స్టాలిన్ చేసిన కృషి నిర్వివాదాంశమైనది (అన్‌కంటెస్టబుల్ కాంట్రిబ్యూషన్). ఆ కృషి సోషలిజం చరిత్ర నించీ విడదీయరానిది.'

తీర్మానంలో వున్న ఈ పాయింటు అర్థం ఏమిటి? స్టాలిన్ చేసిన కృషితో పోలిస్తే వ్యక్తి పూజ అన్నది అతి స్వల్పమైన విషయం అన్న మాట! దోపిడీ సంస్కృతిలో నిండా మునిగిపోయిన వాళ్ళు వ్యక్తి పూజ చేయించుకుంటారనీ స్టాలిన్, దోపిడీ సంస్కృతిలో, తన కీర్తి విషయంలో మునిగిపోయాడనీ, ఖండించని పార్టీ, తనను తాను ఆ సంస్కృతి నించి స్పష్టంగా విడగొట్టుకున్నానని ఎలా చెప్పుకోగలుగుతుంది? 'వ్యక్తి పూజ పిచ్చి ఏమిటి కమ్యూనిస్టుకి?' అని స్టాలిన్‌ని అననే లేదే!

'మొరటు'గా వ్యవహరించే స్టాలిన్‌ని రాబోయే మహాసభలో జనరల్ సెక్రటరీగా ఎంచుకోవద్దనీ వేరే వ్యక్తిని ఎంచుకోవాలనీ, లెనిన్ చివరి రోజుల్లో రాసిన దానికి స్టాలిన్ ఏం విలువ ఇచ్చాడు? లెనిన్ సూచనని మహాసభకి తెలియనివ్వకుండా తన కుర్చీని నిలుపుకున్నవాడు, లెనిన్ భావాల్ని పరిరక్షించినవాడా? దేశ బహిష్కార శిక్షకి గురై, పర దేశంలో వున్న ట్రాట్స్కీని తన ఏజెంట్లతో చంపించడమా, అతని ట్రాట్స్కీయిస్టు వ్యతిరేక పోరాటం? నిజానికి, స్టాలిన్‌కీ ట్రాట్స్కీకి 'సోషలిజం' అనే భావన పట్ల ఒకే రకమైన తప్పుడు అవగాహనే వుంది. ఉత్పత్తి సాధనాలు ప్రభుత్వ పరం కావడమే సోషలిజం – అనీ రష్యాలో దోపిడీ ఆస్తి పర వర్గాలు లేవు – అనీ ఉత్పత్తి శక్తుల అభివృద్ధే ప్రధానం – అనీ – ఇలాంటి అవగాహనలు అటు ట్రాట్స్కీకీ, ఇటు స్టాలిన్‌కీ, వున్నాయని బెతల్‌హామ్ వాళ్ళిద్దరి రచనల నించే ఆధారాలు చూపాడు. స్టాలిన్‌కి వున్న ప్రత్యేకత ఏమిటంటే, పార్టీలో తనని విమర్శించేవారిని రహస్యంగా, వెంట వెంటనే చంపించే కళ!

చివరి నిమిషం వరకూ ఫాసిస్టు హిట్లర్‌ని నమ్మి అతని ఆరోగ్యానికి టోస్టు పలికి లక్షలాది రష్యన్లు చనిపోయే దాకా యుద్ధ సన్నాహాలు చేయకుండా కూర్చున్న పార్టీ ప్రధాన కార్యదర్శి, ఆ పదవి చాలక ప్రధానమంత్రిగారు కూడా అయ్యారు. యుద్ధంలో దేశాన్ని రక్షించాడనే కీర్తి దొరకవలిసింది, హిట్లర్‌కి టోస్ట్ చెప్పిన వ్యక్తికి కాదు. అంతా సోవియట్ ప్రజలకీ, వారిలో భాగమైన సైనికులకూ చెందుతుంది, ఆ కీర్తి!

కొన్ని విషయాల్లో స్టాలిన్‌ని అనుసరించిన మావో కూడా, 'ఫాసిస్టు వ్యతిరేక యుద్ధ సమయంలో, స్టాలిన్‌లో, అవసరంగా వుండాల్సిన అప్రమత్తత లోపించింది' అన్నది వినలేదా? చదవలేదా?

నన్ను, 5 పాయింట్లుగా విమర్శించిన శ్రీనివాసరావు గారికి, ఇంత వరకూ నేను ఇచ్చిన జవాబులు చాలు. చాలకపోతే, బెతల్‌హామ్ సంపుటాలకు నేను రాసిన పరిచయం చూడవచ్చు.

5 పాయింట్లూ అయ్యాక, శ్రీనివాసరావుగారు 'ఆమెను కొన్ని ప్రశ్నలు అడగదల్చుకున్నాను' అన్నారు. వాటికి నా జవాబులు ఇవి:

◆ కమ్యూనిస్టులపై విషపుదాడి జరుగుతోంటే, దానిని ఖండిస్తూ ఆమె ఎక్కడైనా ఒక్క వ్యాసం రాశారా? – అని ఆయన అడుగుతున్నారు.

నేను ప్రధానంగా పెట్టుకున్న పని కమ్యూనిస్టు సిద్ధాంతానికి మూల గ్రంథం అయిన మార్క్స్ 'కాపిటల్'ని వీలైనన్ని రూపాల్లో ప్రచారం చెయ్యాలని. కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని వ్యతిరేకించే బూర్జువాల్నీ ఖండిస్తాను ఆ సిద్ధాంతాన్ని పట్టించుకోని కమ్యూనిస్టుల్నీ ఖండిస్తాను. కమ్యూనిస్టుల మీద విషపు దాడి అంటారా? ఆ కమ్యూనిస్టులు, బూర్జువా రాజ్యాంగ యంత్రాన్ని వ్యతిరేకించే వాళ్ళయితే, అలాంటి వారికి వ్యతిరేకంగా 'విషపు దాడి' జరిగితే, నేను తప్పకుండా ఖండిస్తాను.

◆ అక్టోబరు విప్లవం విప్లవమే కాదనీ లెనిన్, నియంతృత్వం తెచ్చాడనీ కమ్యూనిస్టు వ్యతిరేకుల ప్రచారంతో మీరు ఏకీభవిస్తారా? – అని ఇంకో ప్రశ్న!

బెతల్‌హామ్ సంపుటాలకి పరిచయం రాయడంలో వుద్దేశం అక్టోబరు విప్లవం విప్లవమేననీ అది ఎందుకు అంతర్థానమైందో కమ్యూనిస్టులం పరిశీలించుకోవాలనీ కీర్తనలతో సరిపెట్టుకో కూడదనీనూ! అయితే, అక్టోబరు విప్లవాన్ని నాశనం చేసి, నియంతృత్వాన్ని తెచ్చింది మాత్రం కమ్యూనిస్టు పార్టీ బూర్జువా వర్గమేననీ ఆ వర్గానికి సమర్థులైన రాజకీయ ప్రతినిధులు స్టాలినూ, అతని చుట్టూ సమీకృతులైన పార్టీ నాయకులేననీ, ఈ అవగాహనతో నేను ఏకీభవిస్తాను.

◆ 'ఇది తప్పు దారి అంటే అసలు దారేమిటో చెప్పకుండా దాటేయడం శాస్త్రీయత అనిపించుకోదు'– అట!

అసలు దారేమిటో, పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్ర విమర్శలోనే మార్క్స్ ఎంగెల్సులు చెప్పేశారు. శ్రామిక వర్గం బూర్జువా వర్గాన్ని కూలదోసి, అప్పటిదాకా శ్రమ చేయని వర్గాన్ని శ్రమల్లోకి దించాలనీ మేధా శ్రమలకూ–శారీరక శ్రమలకూ మధ్య వైరుధ్యాల్ని సమానత్వ శ్రమ విభజన ద్వారా తొలగించే ప్రయత్నాలు ప్రారంభించాలనీ – ఇలా అనేక విషయాలు మార్క్స్ ఎంగెల్సుల రచనల్లో తెలుస్తాయి. వాటిని అనుసరించడమే మనం చెయ్యాల్సిన పని. అంతేగానీ, వాళ్ళ విగ్రహాలని పార్టీ ఆఫీసుల మీద అతికించుకుని, యాడాదికోసారో, 100 ఏళ్ళకు ఒక సారో, జయంతులూ వర్ధంతులూ, చేసుకుంటూ, మార్క్సిస్టుగా నడుస్తున్నాం – అని ఆత్మ వంచన చేసుకోవడం కాదు.

◆ కమ్యూనిస్టు పార్టీలను హేళన చేయడం, నాయకత్వాన్ని కించ పరచడం..... ఇదొక ఆరోపణ నా మీద! చాలా పాత ఆరోపణ! నాకిది కొత్త కాదు.

'స్వీట్ హోమ్' నవలలో భర్తని, భార్య, 'నువ్వు' అంటూ మాట్లాడిన తీరు చూసి, రంగనాయకమ్మ పురుషుల్ని హేళన చేస్తుంది అన్నారు. 'రామాయణ విషవృక్షం'లో రాముణ్ణి హేళన చేశానన్నారు. 'వ్యక్తి పూజ విప్లవానికి అవసరమా?' – అని మావోని విమర్శించినందుకు మావోని హేళన చేశానన్నారు. కమ్యూనిజాన్ని వ్యతిరేకించి, బూర్జువా రాజ్యాంగ రచనలో నిమగ్నమైనందుకు అంబేద్కర్‌ని 'దారి తప్పిన మేధావి' అన్నందుకు అంబేద్కర్‌ని హేళన చేశానన్నారు.

ఇప్పుడు అక్టోబరు విప్లవాన్ని కీర్తనలతో ముంచెత్తుతూ, అదెందుకు పోయిందో ఆలోచించకుండా శత వార్షికోత్సవాలు జరుపుకోవడం తద్దినాలను పోలి వుందంటే ఇది ప్రశ్న కాదా? విమర్శ కాదా? ప్రశ్నే, హేళనా? కించ పరచడమూనా? హేళన అవసరమైతే అది చేసి తీరాలి. అది విమర్శ అవుతుంది. కమ్యూనిస్టులుగా చెప్పుకుంటూ, బూర్జువా చేష్టలు చేస్తూ వుంటే, చూస్తూ వూరుకోగలమా? కమ్యూనిస్టులు అనేవాళ్ళు కమ్యూనిస్టులుగా కాకుండా, ఫ్యూడల్ బూర్జువాలుగా వ్యవహరించినప్పుడు అది హాస్యాస్పద విషయంగా మారుతుంది.

చెప్పే మాటల్లో, చేసే పనుల్లో వున్న వైరుధ్యాలే హేళనకు గురి అవుతాయి.

◆ శ్రీనివాసరావుగారు నాకు ఒక హిత బోధ చేశారు. ఆ బోధ నేర్చుకోదగ్గది అయితే తప్పకుండా నేర్చుకుందును. ఆ బోధని మార్క్సు నించి ఏ నాడో నేర్చుకున్నాను. సోషలిజమే మార్గమని చెప్పాల్సినదానిని నేను తెగనాడుతున్నాననీ సోషలిజంపై విశ్వాసం కల్పించాలనీ అదెలా వుంటుందో చెప్పాలనీ శ్రీనివాసరావుగారి బోధ!

నేను సోషలిజమే మార్గమని తెలుసుకున్న రోజు నుంచే అదే మార్గమని చెబుతూనే వచ్చాను కానీ, దానిని తెగనాడలేదు. అలా అయితే, కథలూ, నవలలూ రాసుకోడం మానేసి అన్నేసి సంవత్సరాలు 'మార్క్స్ కాపిటల్' పరిచయానికీ దానికి సంబంధించిన ఇతర పుస్తకాలకూ టైము ఎందుకు పెట్టాను? 'మార్క్సిజమే తెలియకపోతే, పుట్టినవాళ్ళం పుట్టినట్టే వుంటాం?' అని ఎలా రాయగలిగాను? సి.పి.యం. కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యుడైన శ్రీనివాసరావుగారు, వారి పార్టీ పుస్తకాల షాపులకు ఎప్పుడూ వెళ్ళినట్టు లేదు. వెళ్తే నా పుస్తకాలు చూసేవారే. ఒకటి మాత్రం నిజం. 'సోషలిజమే మార్గం' అని చెప్పాను గానీ, ఆ సోషలిజానికి మీ పార్టీయే మార్గం – అని మాత్రం చెప్పలేదు.


◆ చిట్ట చివరిగా, శ్రీనివాసరావుగారు నాకు ఒక అవకాశం ఇచ్చారు చాలా ఉదారంగా, ఇలా: 'ఇప్పటికైనా రంగనాయకమ్మగారు తన విల్లంబును మతోన్మాద ఫాసిస్టు శక్తులపై గురి పెడతారని ఆశిద్దాం' అని! ఈ అవకాశం ఇచ్చారే గానీ, ఆయన తమ వ్యాసానికి పెట్టిన శీర్షికని చూస్తే, ఆయనకు నా మీద అనుమానమే! అందుకే, 'రంగనాయకమ్మ గారూ, మీ గురి ఎటువైపు?' అని అడిగారు.

నా గురి, పార్టీ పెట్టుబడిదారీ విధానం వైపు. దాన్ని సమర్థించే కమ్యూనిస్టు పార్టీల వైపు.

మతోన్మాద ఫాసిస్టు శక్తులపై గురి పెట్టడం అయితే, అది నేను మార్క్సిజం తెలుసుకున్న మర్నాడే మొదలు పెట్టాను. దానికి మొదటి రుజువు: రామాయణ విషవృక్షం! మీరు చెప్పే ఆరెస్సెస్, బీజేపీలకు ఆరాధ్య గ్రంథం మీదకి గురిపెట్టిన పుస్తకం అది! దీని ఇంగ్లీషు అనువాదం వచ్చినప్పుడు, 2003లో, గుజరాత్‌లో నా దిష్టి బొమ్మని తగలబెట్టినప్పుడు పోరాట శక్తులకు ఊతమివ్వాలని బోధించే మీరు గానీ, గుజరాత్‌లోని మీ పార్టీ వారు గానీ, ఏమయ్యారు? వాజపాయి ప్రభుత్వం టైములో, 'విషవృక్షం పుస్తకం మీద చర్య తీసుకోవాలని', బీజేపీ సభ్యుడైన కృష్ణంరాజు అడిగినదానికి, నివేదికలు తెప్పిస్తాం రాష్ట్ర ప్రభుత్వం నించీ' అని అప్పటి హోం శాఖ సహాయమంత్రి చెన్నమనేని విద్యాసాగర్‌రావు పార్లమెంటులో ప్రకటించినప్పుడు మీ పార్టీ ఎంపీలు ఏమయ్యారు? వాళ్ళ నోరెత్తలేదేం? ఇంతకీ, రామాయణ, మహాభారతాల మీదా, వేదాల మీదా, నా పుస్తకాలు మతోన్మాద శక్తులవైపు గురి పెడతాయా, కమ్యూనిస్టుల వైపు గురి పెడతాయా?

◆

jeevanapageps@gmail.com



వందేళ్ళ ప్రాయంలో విలువల సేద్యం

మారుతున్నకాలంతో పాటు మనుషులు మారుతున్నారా? విలువలు మారిపోతున్నాయా? అంటే రెండోదే వాస్తవం అని చెప్పుకోవాలి. విలువలున్నవారు మాత్రం సమాజంలో రానురానూ కరువైపోతున్నారు. వ్యవస్థలు కూలుతుంటే స్వార్థం వికృత వికటాట్టహాసం చేస్తోంది. కొంతమందే ఏటికి ఎదురీది, జీవితంలో చెక్కుచెదరని ధీరత్వానికి సంకేతంగా నమ్మిన ఆశయాలకు, ఆచరించే ఆదర్శాలకు అంకితమై జీవిస్తుంటారు. వారే నవతరానికి స్ఫూర్తి ప్రదాతలు. వారి జీవితాన్ని పరిశీలిస్తే చాలు అదో ఉత్తేజపూరిత దృశ్యమై కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది. అలాంటివారే వీరపనేని రామదాసు. వందేళ్ళకు చేరువవుతున్న ఆ ఉద్యమనేత, సుదీర్ఘ స్వాప్నికుడు వీరపనేని 'జీవన' విశేషాలు ఎందరికో స్ఫూర్తిమంతం.

వీరపనేని రామదాసు.. ప్రజా ఉద్యమ జీవితాల్లో ఉన్నవారికి పరిచయం చేయాల్సిన పనిలేని పేరది. నాటి స్వాతంత్ర్యోద్యమం నుంచి నేటి సమకాలీన ప్రజా ఉద్యమాల వరకూ అదో ప్రత్యేకమైన చిరునామా. కృష్ణాజిల్లా, కొయ్యగూరపాడులో 1920లో పుట్టిన రామదాసు చాలా చిన్నవయసులోనే స్వాతంత్ర్యోద్యమ భావాలని, సామ్యవాద చైతన్యాన్ని అలవర్చుకున్నారు. ప్రజాకళాకారునిగానూ తానేమిటో నిరూపించుకున్నారు. ప్రజలతోనే మమేకమై, అనేక ఉద్యమాలు సాగించి, 1942–44 మధ్య రెండో ప్రపంచ యుద్ధకాలంలోనూ, 1950లలో వీరతెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలోనూ, ఆంధ్రలో పోలీసుల బీభత్స హత్యాకాండ సన్నివేశంలోనూ ఆయన జైలుశిక్షను అనుభవించారు. పోలీసులు దారుణమైన చిత్రహింసలు పెట్టినా, వాటికి చలించని మనోధైర్యంతో నిలిచారు. జైళ్లనే విద్యాలయాలుగా మార్చే కమ్యూనిస్టు వరవడికి బాట వేశారు.

రైతు కుటుంబం

కొయ్యగూరపాడులో సరస్వతమ్మ, రామయ్య దంపతులకు పుట్టిన రామదాసుది రైతు కుటుంబం. వారికి నలుగురు పిల్లలు, వారిలో ముగ్గురు కుమారులైతే, ఒక కుమార్తె. వారిలో రెండో సంతానమే రామదాసు. ఆ ఊరిలోనే రామదాసు బాల్యమంతా గడిచింది. పగలు వ్యవసాయపనులు చేసుకుంటూ రాత్రి సమయాల్లో చదువుకుంటూ తన ఆవగాహనని, ఆలోచనా పరిధిని పెంచుకున్నారు. తన బాల్యమంతా ఒకవైపు శ్రమైక జీవన సౌందర్యం.. మరోవైపు విజ్ఞాన సముపార్జన సాధనంగా కొనసాగిందని ఆయన చెబుతుంటారు. ఇరవై ఏళ్ల వయసు వచ్చేసరికి మరింత చురుకైన వ్యక్తిత్వం అతని సొంతమైంది. ఊరి సమస్యలు, రైతు సమస్యలు ఒకటేమిటి ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా నేనున్నానంటూ రామదాసు అక్కడకు వచ్చేవారు.

ఉత్తేజకరమైన కళాకారునిగా

రామదాసులో ఉన్న ప్రధానమైన ప్రజాకర్షణ ఏమిటంటే ఆయన పాటలు. ఆయన గళమెత్తి చక్కగా పాడేవారు. నాటకాల్లో కూడా కీలక భూమికలను పోషించేవారు. ముఖ్యంగా 'మాభూమి', 'ముందడుగు' వంటి నాటకాల్లో ఆయన ధరించిన పాత్రలు అందర్నీ ఆకట్టుకునేవి. రెండో ప్రపంచయుద్ధం సాధించిన విలయం, జనహననం వంటి అంశాలపై ఆయన బుర్రకథ కూడా చెప్పేవారు. కంభంపాటి సత్యనారాయణ రాసిన బొబ్బిలి యుద్ధం బుర్రకథ ఎన్నో వేదికలపై మారుమోగింది. పాటలు, నాటకాలు, బుర్రకథలు, ఇతర జానపద కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయాలన్నదే ఆయన సంకల్పం. వాటితో పాటు యువజన సంఘం కార్యక్రమాలు రామదాసుని నిరంతరం ప్రజల్లో నిలిచేలా చేశాయి. దళితులకోసం రాత్రిపూట పాఠశాలల నిర్వహణ, యువజనుల్లో చైతన్యం తీసుకురావడానికి వివిధ కార్యక్రమాలు అలా ఎన్నింటిలోనో రామదాసు భాగస్వామిగా నిలిచారు. స్వాతంత్ర్యోద్యమం జరుగుతున్న ఆరోజుల్లో గాంధీ మీద వచ్చిన పలు విమర్శలు రామదాసు ఆలోచనలను చాలావరకూ ప్రభావితం చేశాయి. పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శాలు రామదాసులో కమ్యూనిస్టు భావాల బీజాలు మొలకెత్తేలా ప్రేరణ నిచ్చాయి.

దేశద్రోహం కేసులో

రెండో ప్రపంచ యుద్ధకాలంలో దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుపోయింది. అప్పటికే స్వరాజ్యసమరం మారుమూల గ్రామాలకూ విస్తరించింది. ఆర్థిక మాంద్యం, ధరల పెరుగుదల, తీవ్రమైన కరువు, నిర్బంధాలు వల్ల దేశంలో అసాధారణ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితుల్లో రామదాసు తానేమార్గాన్ని ఎంచుకోవాలో ఒక అంచనాకు రాలేకపోయారు. కమ్యూనిస్టు సానుభూతి పరునిగా ఉంటూనే బ్రిటీష్ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ సమయంలో జాతీయ కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన ఆదేశాలనే పాటించేవారు. క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా విజయవాడ, బందరు రైల్వే పట్టాలు తొలగించాలని, టెలీఫోను వైర్లు తెంచాలని తమకు తాము నిర్దేశించుకున్న కార్యక్రమాన్ని పూర్తిచేశారు. ఆ సంఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. కొంతమంది కాంగ్రెస్ అనుకూలురు రామదాసుపై 'తీవ్రవాది' అనే ముద్రవేశారు. 1942 నవంబర్1న పోలీసులు వారి ఊరుమీద దాడిచేసి, రామదాసుతో పాటు వందమందిని అరెస్టుచేశారు. కొంతమందిని తర్వాత వదిలేసినా, రామదాసుని మాత్రం దేశద్రోహం నేరం కింద జైల్లోనే నిర్బంధించి, చిత్రహింసలు పెట్టారు. క్షమాపణ చెబితే విడిచి పెట్టేస్తామని ప్రలోభపెట్టారు. కానీ రామదాసు ఏమాత్రం దానికి అంగీకరించలేదు. బంధుమిత్రుల నుంచి ఎదురైన ఒత్తిళ్లకు అసలే తలొగ్గలేదు. అలా మూడేళ్ల జైలు జీవితాన్ని గడిపారు.

సమరయోధుల సహచర్యం

రామదాసు జైలుశిక్ష అనుభవిస్తున్న సమయంలో తోటి ఖైదీలుగా.. జాతీయ కాంగ్రెస్ కార్యకర్తలు, కమ్యూనిస్టులు ఇలా ఎన్నో భావజాలాలకు చెందిన వారంతా ఉండేవారు. ఆయనతో కలిసి జైలుశిక్ష అనుభవించినవారిలో ప్రముఖగాయకుడు ఘంటసాల వెంకటేశ్వర రావు. ఘంటసాల మేనమామ పూజారి పిచ్చయ్య ఇలా ఎంతోమంది ఉన్నారు. కేవలం తెలుగు రాష్ట్రాల వారే కాకుండా కేరళ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచీ రాజకీయ ఖైదీలను రామదాసు ఉన్న జైలుకే తీసుకొచ్చారు. అలా పుస్తకాలలో చదవని జ్ఞానాన్ని వారి అనుభవాల నుంచి పొందారు. కమ్యూనిస్టు సైద్ధాంతిక శిక్షణకు, రాజకీయ పాఠాలు నేర్చుకోవడానికి జైలులోని సహచరుల సాహచర్యమే పునాదిగా మారింది. అక్కడే ఆయన ప్రపంచ కమ్యూనిస్టు చరిత్రని, గతితార్కిక భౌతికవాదాన్ని, కారల్‌మార్క్స్ పెట్టుబడి గురించి తెలుసుకున్నారు. మరోపక్క దేశభక్తుల జీవిత చరిత్రలు కూడా పాఠాలుగా చెప్పేవారు. ఇలా ఆలీపూర్ జైలు రామదాసు జీవితంతో కొత్త వెలుగులను ప్రసరించింది. కాంగ్రెస్ వాదిగా జైల్లోకి వెళ్లి, కమ్యూనిస్టుగా బయటకు రావడం రామదాసు ప్రత్యేకత.

నిషేధంలోనూ వీడని నిబ్బరం

రామదాసు జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వాన్ని తీసుకుని, గన్నవరం కేంద్రంగా కార్య కలాపాలను ముమ్మరం చేశారు. అదే సమయంలో పార్టీ ఆధ్వర్యంలో చారిత్రాత్మక తెలంగాణ సాయుధ పోరాటం మొదలైంది. 1947 చివరిలో తెలంగాణ విముక్తి పోరాటం తారాస్థాయికి చేరింది. గ్రామాల నుంచి రజాకార్లని తరిమికొట్టే వరకూ వెళ్లింది. ఈ ఉద్యమంలో అసమాన త్యాగాలు చేసిన కమ్యూనిస్టులకు ప్రజలు నీరాజనాలు పడుతుండడంతో, పరిస్థితి చేజారుతుందని పసిగట్టిన కేంద్ర ప్రభుత్వం బలగాలను మోహరింపజేసింది. కమ్యూనిస్టులపై నిర్బంధాలను, నిషేధాలను ప్రయోగించింది. కృష్ణాజిల్లా కమ్యూనిస్టు రాజకీయాలకు కీలకం కావడంతో ఇక్కడి జాతీయస్థాయి నాయకులైన పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, చంద్ర రాజేశ్వరరావు వంటి వారి కదలికలపై నిఘా పెరిగింది. పోలీసుల దాడులూ పెరిగాయి. ఆ నిర్బంధ సమయాల్లో రహస్య కొరియర్‌గా రామదాసు నిర్వహించిన పాత్ర ఎంతో కీలకమైనది. ఆ తర్వాత జొన్నపాడు జమీందార్ల దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలో రామదాసు పాల్గొన్నారు. ఈ ఘటనలో ఆతనిని నిర్బంధించిన పోలీసులు రకరకాలుగా చిత్రహింసలు పెట్టారు. ఎన్నో అవమానాలకు గురిచేశారు. అయినా సరే ఎక్కడా తన మనోనిబ్బరాన్ని కోల్పోలేదు. పదహారు నెలల పాటు జైలు జీవితాన్ని అనుభవించారు. ఈ జైలు జీవితం ఆయనకెన్నో గుణపాఠాలు నేర్పింది. కమ్యూనిజం ఎంత కఠినమైనదో? ఆచరణ ఎంత జఠిలమైనదో అనుభవ పూర్వకంగా తెలిసింది. ఆయన త్యాగాలు పార్టీలోని కార్యకర్తలకు ఉత్తేజాన్ని ఇచ్చినా కుటుంబం మాత్రం ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. పోలీసుల డేగకన్ను కుటుంబంపై పడింది. ఎప్పటికప్పుడు వారు రామదాసుపై దౌర్జన్యాలకు పాల్పడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో రామదాసు ప్రజా ఉద్యమాల్లో నిమగ్నమై వృద్ధులైన తల్లిదండ్రులను, భార్యని, పసిపిల్లలను వదిలేయడమే కాకుండా చిన్నప్పటి నుంచీ ఎంతో అభిమానంతో నిర్వహించిన వ్యవసాయానికీ దూరం కావాల్సి వచ్చింది. పూర్తిగా పార్టీకే అంకితమైన నిరుపమాన నాయకునిగా ఎదిగారు. ఆనాటి నుంచీ నేటివరకూ కమ్యూనిజమే ఆయన ఊపిరి.

ప్రగతిశీల కుటుంబం

కుటుంబం వేరు, కమ్యూనిజం వేరు అనుకునే నాయకుడు కాదు రామదాసు. ఆయన కుటుంబమే ఆ విషయాన్ని స్పష్టం చేస్తుంది. నిత్య ఆచరణశీలిగా ఆదర్శనీయునిగా ఉన్న రామదాసు సతీమణి వెంకట సుబ్బమ్మ కూడా భర్త నుంచి అవే ఆదర్శాలను పుణికి పుచ్చుకున్నారు. పిల్లలకు వినూత్నంగా కమ్యూనిస్టు నాయకుల పేర్లే పెట్టారు. వీరికి నలుగురు సంతానం.. వారిలో పెద్ద అమ్మాయి పేరు విశాలాంధ్ర, మొదటి కుమారుని పేరు రామారావు, తర్వాత కుమారుని పేరు డాంగే, చివరిగా మూడో కుమారుని కృశ్చేవ్ అని పేర్లు పెట్టడడం ఆయన భావ నిబద్ధతకు నిదర్శనం.

- జీవన డెస్క్



భార్య సరస్వతమ్మతో..



కుటుంబ సభ్యులతో..



విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



90వ పడిలోనూ నారుమోస్తూ



నాన్న ఆలోచనలన్నీ జనం కోసమే

నాన్న ఆలోచనలన్నీ జనం కోసమే. ఈ దేశంలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో సుమారు వందేళ్ల చరిత్రకు ఆయన ప్రత్యక్ష సాక్షి. ఆయన సాహసం నాటి తరానికే కాదు ఏ తరానికైనా అవసరమే. దోపిడీ, పీడనలను ఎదిరించే ధీరత్వం ఆయన సొంతం. అది బ్రిటీష్ పాలన అయినా, ఇప్పటి పార్టీల పాలన అయినా ఆయన స్పందన ఒకటే.


- వి. డాంగే (కుమారుడు)



నాన్నే నాకు ఆదర్శం

మా నాన్నే మాకు ఆదర్శం. ఆయన తన కుటుంబం కన్నా సమాజానికే ఎక్కువ సేవ చేయడం చూసి మేమంతా ఆనందంతో పొంగిపోతాం. ఆయనకు ప్రజల్లో ఎంతటి అభిమానం ఉందో ఎంత ప్రేమ ఉందో ప్రత్యక్షంగా చూసినదాన్ని నేను. ఉన్నతాదర్శాలకు ఆయనే నిలువెత్తు రూపం.

- వి. విశాలాంధ్ర (కుమార్తె)



ఆశయాలకు వారసులం

నాన్న ఆశయాలకు మేము వారసులం. నాన్న సమాజం గురించి పోరుబాట పడితే, అమ్మ కుటుంబం గురించి కష్టాలబాట పట్టింది. ఆయనది సమాజం, ఈమెది సంసారం. వారి ఆశయాల వారసులుగా నమ్మిన ఆదర్శాలను నెరవేర్చడానికి మా వంతు ప్రయత్నాలు చేస్తున్నాం.

- వి. కృశ్చేవ్ (చిన్నకుమారుడు)

సిద్ధాంతమే ముఖ్యం

ప్రజల కోసం త్యాగాలు చేసే నిబద్ధతగల వారు సిద్ధాంతం పట్ల రాజీపడరు. నేనూ అదే పంథాని ఎంచుకున్నాను. ఎప్పుడూ పోలీసులకు గానీ, సంఘ విద్రోహశక్తులకు గానీ భయపడలేదు. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా, ఎందరు ఎన్నివిధాలుగా ఒత్తిడి తెచ్చినా వాటికి లోబడకూడదు. మన గమ్యం సమసమాజమే. అది చేరేందుకు ఎవరికి వారే పరిశ్రమించాల్సిందే.

- వీరపనేని రామదాసు



రమణుల రంగవల్లి

బహుమతి పొందిన ముగ్గు





ఎస్.వన్షిక
తిరుపతి
చిత్తూరుజిల్లా


21 చుక్కలు
1 వచ్చేవరకు





పి.పుష్పలత
వైరా
ఖమ్మంజిల్లా


22 చుక్కలు
10 వరుసలు
10 వచ్చేవరకు





జి.రత్న కుమారి
విజయవాడ
కృష్ణాజిల్లా

22 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు,
సరిచుక్క





ఎల్. స్వర్ణకుమారి
ఒంగోలు
ప్రకాశంజిల్లా

17 చుక్కలు
9వచ్చేవరకు,
మధ్యచుక్క

మా చిరునామా:
జీవన,'రమణుల రంగవల్లి', జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఇమెయిల్: jeevanapageps@ gmail.com
ఫోన్ నెం.
9490099006



మీ కోసం



టమోటాలను వంటలో ఉపయోగించే ముందు 6 నిముషాల వరకూ వేడినీటిలో ఉంచితే కూర రుచిగా ఉంటుంది.

జీవన సౌరభం

మన జననం ఓ సాధారణమైనది కావచ్చు. కానీ మన మరణం మాత్రం ఒక చరిత్ర సృష్టించేదిగా ఉండాలి.

సెన్సెక్స్ ⬆ 176
33,969

నిఫ్టీ ⬆ 62
10,504

రూపాయి ⬆ 15 పై॥
అమెరికా డాలరుకు రూ.
63.41



అపోలో మైక్రో ఐపిఒ..

అపోలో మైక్రో సిస్టమ్స్ లిమిటెడ్ జనవరి 10న ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు వస్తున్నట్లు ప్రకటించింది. రూ.10 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్ల ధరల శ్రేణిని రూ.270-275గా నిర్ణయించింది. ఈ ఐపిఒ వివరాలను ముంబయిలో ఆ కంపెనీ ఎండి కరుణకర్ రెడ్డి, సిఎఫ్‌ఒ సుదర్శన్, హోల్‌టైం డైరెక్టర్ క్రిష్ణ సాయి కుమార్, అర్యన్ ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇడి శ్రీపాల్ షా వెల్లడించారు.

ఎటిఎంల నుంచి రూ.200 నోట్లు

బ్యాంకులకు ఆర్‌బిఐ ఆదేశాలు

న్యూఢిల్లీ : త్వరలోనే ఆటోమెటిక్ టెల్లర్ మిషన్ (ఎటిఎం)ల నుంచి రూ.200 నోట్లు జారీ కానున్నాయి. ఈ నోట్లను ఎటిఎంల్లో అందుబాటులోకి తేవాలని రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా తాజాగా బ్యాంకులను ఆదేశించింది. తద్వారా ప్రజలను చిల్లర కష్టాల నుంచి దూరం చేయాలని సూచించింది. ఇప్పటి వరకు బ్యాంకులు రూ.100, రూ.500, రూ.2000 మాత్రమే ఎటిఎంల ద్వారా అందిస్తున్నాయి. మోడీ ప్రభుత్వం 2016 నవంబర్‌లో రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేసింది. వీటి స్థానంలో కొత్తగా రూ.2,000, రూ.500 నోట్లను అందుబాటులోకి తెచ్చింది. కాగా ఈ నోట్లకు చిల్లర దొరకక పోవడంతో సామన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. గతేడాది జులై నుంచే రూ.2000 నోటు ముద్రణను కూడా ఆర్‌బిఐ తగ్గించింది. వీటి స్థానంలో చిన్న నోట్లను పెంచాలని భావిస్తోంది. దీన్ని అధిగమించడానికి ఆర్‌బిఐ గతేడాది రూ.200 నోటును అందుబాటులోకి తెచ్చింది. అయితే బ్యాంకుల ద్వారా మాత్రమే ఈ నోట్లను జారీ చేసింది. తాజాగా ఈ చిన్న నోట్లను వీలైనంత తొందరగా ఎటిఎంల్లో అందుబాటులోకి తేవాలని బ్యాంకులను ఆర్‌బిఐ ఆదేశించింది. కాగా ఈ నోటును అందజేయాలంటే అందుకు తగిన విధంగా బ్యాంకులు ఎటిఎంల్లో సాంకేతిక మార్పులు చేయాల్సి ఉంటుంది. ఇందుకుగానూ ఒక్కో ఎటిఎంకు రూ.5000 వరకు వ్యయం కానుంది. దేశవ్యాప్తంగా 2,22,000 ఎటిఎంలు ఉన్నాయి. వీటికి అన్నింటిగానూ బ్యాంకింగ్ పరిశ్రమ దాదాపు రూ.110 కోట్లు వ్యయం చేయాల్సి ఉంటుందని అంచనా.

ఇన్ఫీ సిఇఒ వేతనం రూ.16 కోట్లు



బెంగళూరు : దేశంలోనే రెండో అతిపెద్ద ఐటి కంపెనీ ఇన్ఫోసిస్ సిఇఒగా ఈ మధ్య కాలంలోనే బాధ్యతలు స్వీకరించిన సలీల్ పరేఖ్ జీతం రూ.16.25 కోట్లుగా ఆ సంస్థ నిర్ణయించింది. అదే విధంగా స్థిర వేతనం కింద రూ.6.5కోట్లు, వేరియబుల్ చెల్లింపుల కింద రూ.9.75 కోట్లు చొప్పున అందించనున్నట్లు ఇన్ఫోసిసి స్వతంత్ర బోర్డు సభ్యురాలు కిరణ్ మజుందార్ షా తెలిపారు. మరో రూ.3.25కోట్ల విలువ గల స్టాక్ యూనిట్లను, వార్షిక ఈక్విటీ గ్రాంట్ల కింద రూ.13కోట్లు కూడా పొందనున్నారు. అంతేగాక.. వన్ టైమ్ ఈక్విటీ గ్రాంట్ కింద మరో రూ.9.75 కోట్లు తీసుకుంటారు. ఇక స్టాక్ యూనిట్ల విలువ ప్రతి ఆర్థిక సంవత్సరానికోసారి మారుతుందని షా తెలిపారు. సంస్థ ఆరో సిఇఒగా సలీల్ ఐదేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. మాజీ సిఇఒ సిక్కా 2016–17 ఆర్థిక సంవత్సరానికి గానూ మొత్తంగా రూ.42 కోట్ల మేర పొందారు.



లాభాల్లోకి మార్కెట్లు

ముంబయి : వరుసగా రెండు రోజుల పాటు యథాతథంగా నమోదైన దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం మాత్రం లాభాల బాట పట్టాయి. సెన్సెక్స్ 176 పాయింట్లు పెరిగింది. అంతర్జాతీయ సానుకూల పవనాలకు తోడు లోహ, క్యాపిటల్ గూడ్స్, కన్సూమర్ డురెబుల్స్ షేర్ల కొనుగోళ్లకు మదుపర్లు ఉత్సాహం చూపారు. ఈ నేపథ్యంలోనే బిఎస్ఇ సెన్సెక్స్ 176 పాయింట్లు లాభపడి 33,969కు చేరింది. తొలుత 33,912 వద్ద మొదలైన సూచీ ఇంట్రా ట్రేడింగ్‌లో 33,995–33,802 మధ్య కదలాడింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 61.60 పాయింట్లు ర్యాలీతో 10,504.80 వద్ద ముగిసింది. బిఎస్ఇలో రంగాల వారిగా క్యాపిటల్ గూడ్స్ సూచీ అత్యధికంగా 2.02శాతం ర్యాలీ చేసింది. ఇదే క్రమంలో లోహ 1.96 శాతం, కన్సూమర్ డురెబుల్స్ 1.69శాతం, పిఎస్‌యు 1.37శాతం చొప్పున పెరిగాయి. మరోవైపు రియాల్టీ 0.3శాతం, ఆటో 0.28శాతం, ఐటి 0.13శాతం చొప్పున నష్టపోయాయి.

పిఎస్‌బిలకు మూల'ధన'మే కీలకం

తారా స్థాయికి ఎన్‌పిఎలు
88% ప్రభుత్వ బ్యాంకులవే
రూ.10 లక్షల కోట్లకు చేరిక
కేటాయింపులతో మరింత భారం
రేటింగ్ ఏజెన్సీల వెల్లడి



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంకుల మూలధన కరువు తీరాలంటే ఆ సంస్థలకు నిధులు సమకూర్చడము ఒక్కటే మార్గమని పలు రిపోర్టులు సూచిస్తున్నాయి. ప్రయివేటు బ్యాంకులకు ధీటుగా మూలధన అంతరాన్ని అధిగమించాలంటే రూ.2.1 లక్షల కోట్ల మూలధన ప్రణాళికలు అమలు చేయాలి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి బ్యాంకుల మొండి బాకీలు కూడా తారా స్థాయికి చేరనున్నాయని హెచ్చరించాయి. క్రితం డిసెంబర్ త్రైమాసికం ముగింపు నాటికి బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తులు 10.2 శాతానికి ఎగిసి రూ.10 లక్షల కోట్లకు చేరాయని విశ్లేషించింది. వచ్చే సెప్టెంబర్ త్రైమాసికం ముగింపు నాటికి ఈ మొండి బాకీలు ఏకంగా 11.1 శాతానికి చేరొచ్చని ఆర్‌బిఐ ఇది వరకే హెచ్చరించింది. వచ్చే రెండేళ్లలో పిఎస్‌బిలకు రూ.2.1 లక్షల కోట్ల మూలధనం సమకూర్చనున్నట్లు గత అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో రూ.18,130 కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని నిర్ణయించారు. మరో రూ.1.35 లక్షల కోట్లు బాండ్ల విక్రయాల ద్వారా, మరో రూ.58,000 కోట్లు బ్యాంకుల వాటాల విక్రయం ద్వారా మూలధనం సమకూర్చాలని నిర్ణయించింది.

ప్రయివేటుతో పోల్చితే బలహీనం : మూడీస్

ప్రయివేటు రంగ బ్యాంకులతో పోల్చితే ప్రభుత్వ రంగ బ్యాంకుల మూలధనం బలహీనంగా ఉందని గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ వైస్ ప్రెసిడెంట్, సీనియర్ అనలిస్టు అల్కా అంబరసు ఒక నోట్‌లో పేర్కొన్నారు. సెప్టెంబర్ 2017 నాటికి టైర్1లో పిఎస్‌బిల రుణాల సాధారణ ఈక్విటీ 8.7 శాతంగా ఉండగా, ప్రయివేటు బ్యాంకులు 12.2 శాతం కలిగి ఉన్నాయన్నారు. పిఎస్‌బిలకు మూలధనం కల్పించడం ద్వారానే ఈ అంతరాన్ని తగ్గించవచ్చన్నారు. అయితే ఎంత అంతరాన్ని తగ్గించవచ్చో అమె తెలుపలేదు. మార్చి 2019 నాటికి 21 పిఎస్‌బిలకు రూ.1.5 లక్షల కోట్లు సమకూర్చే అవకాశం ఉందన్నారు. రుణదాతలకు మూలధనం సమకూర్చడం ద్వారా రుణ కేటాయింపులు పెరగడం ద్వారా కొన్ని భయాలు తొలిగిపోనున్నాయన్నారు.

మరో 4% పెరుగొచ్చు : ఇక్రా

ఇక్రా రిపోర్టు ప్రకారం 2018 మార్చి నాటికి బ్యాంకుల మొండి బాకీలు శిఖర స్థాయికి చేరనున్నాయి. 2017–18, 2018–19లో మొండి బాకీల కేటాయింపులు బ్యాంకులకు ప్రతికూలంగా మారనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చి నాటికి మొండి బాకీలు మరో 3–4 శాతం పెరిగి రూ.2.5–3 లక్షల కోట్లకు చేరొచ్చని హెచ్చరించింది. రద్దు చేసినవి, పునరుద్దరించినవి, రికవరీలులు కలుపుకుని స్థూల మొండి బాకీలు రూ.8.8–9 లక్షల కోట్లు లేదా 10–10.2 శాతానికి ఎగిసిపడొచ్చన్నారు. అదే 2016–17లో స్థూల మొండి బాకీలు రూ.7.65 లక్షల కోట్లు లేదా 9.5 శాతంగా నమోదయ్యాయి. వచ్చే మార్చి 2018 నాటికి బ్యాంకు స్థూల మొండి బాకీలు తారా స్థాయికి చేరొచ్చని అంచనా వేసింది. 2018–19లో ఇది బ్యాంకు ఆస్తులపై మరింత బలహీన ప్రభావాన్ని చూపించవచ్చు.

మరో రూ.2.6 లక్షల కోట్ల ఎన్‌పిఎలు..

మొత్తం మొండి బాకీల్లో 88 శాతం ప్రభుత్వ రంగ బ్యాంకులవే. ఈ ఒత్తిడి ఆస్తులను బ్యాంకులు పరిష్కరించుకొనే సామర్థ్యాన్ని పెంచుకోవాలని ఇక్రా రిపోర్టు సూచించింది.. 2017–18లో రుణ కేటాయింపుల భారం రూ.2.4–2.6 లక్షల కోట్లకు చేరొచ్చని ఇక్రా గ్రూపు ఫైనాన్సియల్ సెక్టార్ రేటింగ్స్ హెడ్ కార్తిక్ శ్రీనివాసన్ పేర్కొన్నారు. 2016–17లో ఈ మొండి బాకీలు రూ.2 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. మొండి బాకీలకు అధిక కేటాయింపుల వల్ల బ్యాంకుల నిర్వహణ లాభాలు పడిపోనున్నాయని హెచ్చరించారు. 2017–18లో బ్యాంకుల నష్టాలు అనేక రెట్లు పెరిగి రూ.30,000–రూ.40,000 కోట్లకు చేరొచ్చని అంచనా వేశారు. కాగా 2016–17లో రూ.7000 కోట్ల నష్టాలు చవి చూశాయి.

రూ.80వేల కోట్లకు అనుమతి..!

ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ.80,000 కోట్ల మూలధనం అందించడానికి గురువారం కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ అనుమతి కోరింది. మొండి బాకీలు, రుణాల వృద్ధి పుంజుకోవడానికి, రుణదాతల ఒప్పందాల కోసం ఈ మొత్తం అవసరం అవుతుందని ప్రభుత్వం పేర్కొంది.

వచ్చే రెండేళ్లలో పిఎస్‌బిలకు రూ.2.11 లక్షల కోట్ల మూలధనం అందించనున్నట్లు గతేడాది అక్టోబర్‌లో ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజా కేటాయింపుల కోసం పార్లమెంట్ ఆమోదాన్ని కోరింది.

రూ.100 కోట్లు సేకరించిన ఫిన్‌టెక్

పూణె : ఎర్లీసాలరీ మొబైల్ యాప్‌పై వేతన అడ్వాన్సులు, తక్షణ నగదు రుణాలు అందించే పిన్‌టెక్ స్టార్టప్ తాజాగా రూ.100 కోట్లు సమీకరించినట్లు తెలిపింది. ఎయిట్‌రోడ్స్ వెంచర్స్, ప్రస్తుత ఇన్వెస్టర్లు ఐడిజి వెంచర్స్ ఇండియా, డిహెచ్ఎఫ్ఎల్, సీడ్ ఇన్వెస్టర్ అశోక్ అగర్వాల్ నుంచి ఈ మొత్తాన్ని సమకూర్చుకున్నట్లు పేర్కొంది. ఈ నిధులతో 2018 చివరి నాటికి నెలకు 1,00,000 రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆ సంస్థ సహ వ్యవస్థాపకులు, సిఇఒ అక్షయ్ మెహ్రుత్రా తెలిపారు. ఉద్యోగులు తమ మొబైల్ యాప్ ద్వారా రుణాలు పొందడానికి వీలుందన్నారు.

Fitch Ratings

ఐదేళ్లు 6.7% వృద్ధే.. : ఫిచ్

ముంబయి : వచ్చే ఐదేళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ సగటున 6.7 శాతం వృద్ధి రేటుతో సరిపెట్టుకోనుందని గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ అంచనా వేసింది. విస్తృతావకాశాలు ఉన్నప్పటికీ ఈ వృద్ధిరేటు తక్కువేనని పేర్కొంది. చైనా, ఇండోనేషియాలు 5.5 శాతం వృద్ధిని నమోదు చేయనున్నాయని పేర్కొంది. ప్రపంచంలోనే భారత్ అత్యంత యువ దేశమని తెలిపింది. అత్యధిక మంది యువత పనిలో ఉన్నారని వెల్లడించింది. పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. అయినప్పటికీ తలసరి ఆదాయం తక్కువగా ఉందని, ఉత్పత్తి కూడా బలహీనంగా ఉందని వెల్లడించింది.

బ్యాంకింగ్ అవేర్‌నెస్ (ఐబిపిఎస్-పిఓ'స్, క్లర్క్స్)

What is the tagline of Bank of Baroda?

MODEL QUESTIONS

1. ____________ is vested with the responsibility of conducting monetary policy.
(a) RBI (b) SBI
(c) NABARD (d) SIDBI
(e) Finance Ministry

2. In which year the Reserve Bank of India (RBI) Act, 1934 was amended to provide a statutory basis for the implementation of the flexible inflation targeting framework?
(a) May 2013 (b) May 2014
(c) May 2015 (d) May 2016
(e) May 2012

3. Which scheme/act has enables an expeditious and inexpensive forum to bank customers for resolution of complaints relating to certain services rendered by banks?
(a) Reserve Bank of India Act, 1934
(b) Banking Regulation Act, 1949
(c) Securitization Act 2002
(d) FEMA
(e) Banking Ombudsman Scheme

4. The Banking Ombudsman Scheme is introduced by RBI with effect from-
(a) 1991 (b) 1995
(c) 1990 (d) 2002
(e) 2006

5. IBA adopts a consultative approach to give its views on any issue pertaining to banking sector. What is the meaning of "I" in IBA?
(a) International (b) Institute
(c) Investment (d) Indian
(e) Increase

6. Which Bank has launches 10-second paperless instant loan Scheme?
(a) HDFC (b) SBI
(c) PNB (d) IDBI
(e) ICICI

7. Which among the following organisation to provide Rs 30,000 crore credit to farmers for irrigation?
(a) NABARD (b) RBI
(c) SBI (d) PNB
(e) SIDBI

8. Which of the following bodies regulates the Regional Rural Banks?
(a) Union Government (b) SBI
(c) RBI (d) NABARD
(e) SIDBI

9. Which among the following banks has launched the First Multi-Currency Contactless Card service in India?
(a) HDFC Bank
(b) Axis Bank
(c) State Bank of India
(d) Punjab National Bank
(e) ICICI Bank

10. Name the organisation, which has allows Banks to tie up with insurers?
(a) IRDAI (b) RBI
(c) SBI (d) World Bank
(e) SEBI

11. An FVCI can invest in an Indian company engaged in-
(a) Biotechnology
(b) Dairy industry
(c) Production of bio-fuels
(d) IT related to hardware and software development
(e) All of the above

12. If the shares or convertible debentures are not issued within ________ days from the date of receipt of the inward remittance or date of debit to NRE/FCNR(B)/Escrow account, the amount shall be refunded.
(a) 210 days (b) 150 days
(c) 180 days (d) 120 days
(e) 90 days

13. FCCB is a type of corporate bond issued by an Indian company in an overseas market in a currency different from that of the issuer. FCCB stands for-



(a) Foreign Currency Convertible Board
(b) Foreign Currency Convertible Banking
(c) Foreign Currency Convertible Bond
(d) Foreign Currency Convertible Base
(e) Foreign Currency Convertible Basel

14. What is the meaning of "C" in ECB?
(a) Concourse (b) Cashless
(c) Common (d) Conclusion
(e) Commercial

15. ECB can be raised under Track-II for general corporate purpose (including working capital). The minimum average maturity period will be-
(a) 05 years (b) 10 years
(c) 15 years (d) 20 years
(e) 25 years

★

Answer:
1.a, 2.d, 3.e, 4.b, 5.d, 6.a, 7.a, 8.d, 9.b, 10.a, 11.e, 12.c, 13.c, 14.e, 15.b.



Important Bits

1. The IV Global Conference on the Sustained Eradication of Child Labour was organized by
Answer: Argentina
2. President Ram Nath Kovind has recently launched JOHAR scheme entailing the expenditure of Rs 1,500 crore to help tribal and Dalit families double their incomes in four years. What does 'H' stands for in JOHAR?
Answer: Harnessing
3. Name the person who has recently inaugurated a three-day AP AgTech Summit-2017 in the coastal city Visakhapatnam.
Answer: Vice president M Venkaiah Naidu
4. In which city the Two-day "12th North-East Business Summit" was inaugurated?
Answer: New Delhi
5. What is the capital of Indonesia?
Answer: Jakarta
6. In the recently concluded 48th Edition of International Film Festival of India who was honoured with the prestigious 'Indian film personality of the year' Award?
Answer: Amitabh Bachchan
7. Five Russian competitors from the 2014 Sochi Winter Olympics, including two gold medallists, have been banned for life over anti-doping rule violations by International Olympic Committee (IOC).Where is the 2020 Summer Olympics going to be held?
Answer: Tokyo
8. Jet Airways and ________________ announced a partnership to route more traffic through Europe and on to North America.
Answer: Air France-KLM
9. The Union Finance Minister Arun Jaitley formally launched a new payments bank. Which is the fourth payment bank to be launched?
Answer: Paytm Payments Banks
10. The largest dollar denominated bitcoin exchange ________________ gave the latest price of Bitcoin as $10,052 in Asia bringing its rise for the year to date to more than 900 per cent.
Answer: Coinbase
11. The government represented by Senior level government officials, at the rank of Additional Secretary and Joint Secretary, nominated as 'Prabhari' officers has embarked upon a major policy initiative for the rapid transformation of how many backward districts across the country by 2022.
Answer: 115
12. In which city, The iconic third Trump Tower comprising 140 ultra-luxury apartments has been launched whereby its Indian developers are expecting to garner around Rs 700 crore in sales from the project?
Answer: Kolkata
13. Indian online payments firm BillDesk-owned Hatio Innovations has launched cryptocurrency exchange in India offering trading of Bitcoin and Bitcoin Cash.What is the name of the exchange?
Answer: Coinome
14. What is the tagline of Bank of Baroda?
Answer: India's International Bank
15. Union Defence Minister Nirmala Sitharaman has been elected as President of the IDSA, set up in 1965 by the Ministry of Defence. What does 'A' stand for in IDSA?
Answer: Analysis

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్‌లో 80 జేఆర్ఎఫ్‌లు

న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ (ఐసీహెచ్ఆర్).. 2018–19 సంవత్సరానికి గాను 80 జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు-ఖాళీలు : జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)–80.
వ్యవధి : రెండేళ్లు.
ఫెలోషిప్ : రూ.17,600. దీంతోపాటు ఏడాదికి కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.16,500 ఇస్తారు.
అర్హతలు : హిస్టరీ/హిస్టరీ అనుబంధ సబ్జెక్టుల్లో ఏదైనా యూనివర్సిటీలో పీహెచ్‌డీకి రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు అర్హులు.
ఎంపిక : ప్రవేశపరీక్ష (ఎంట్రెన్స్ టెస్ట్).
ప్రవేశ పరీక్ష విధానం : ఇందులో ఎ, బి, సి అనే మూడు విభాగాలు ఉంటాయి. 'ఎ' విభాగం నుంచి 30 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కోదానికి ఒక్క మార్కు చొప్పున మొత్తం మార్కులు 30. 'బి' విభాగం నుంచి 12 షార్ట్ ఎస్సే ప్రశ్నలు ఇస్తారు. ఇందులో ఏవైనా ఆరు ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. ప్రతి ప్రశ్నకు 5 మార్కుల చొప్పున ఈ విభాగం గరిష్ట మార్కులు 30. 'సి' విభాగం నుంచి ఆరు లాంగ్ ఎస్సే ప్రశ్నలు ఇస్తారు. వీటిలో నుంచి ఏవైనా రెండు ప్రశ్నలు ఎంచుకొని ఒక్కోదానికి 500 పదాలకు తగ్గకుండా సమాధానం రాయాలి. ఒక్కో ప్రశ్నకు 20 మార్కుల చొప్పున ఈ విభాగం గరిష్ట మార్కులు 40. మొత్తం పరీక్షను 100 మార్కులకు నిర్వహిస్తారు.
పరీక్ష కేంద్రాలు : న్యూఢిల్లీ, బెంగళూరు, గువాహటి, పుణె.
దరఖాస్తు ఫీజు : రూ.200, ఎస్సీ/ ఎస్టీ/వికలాంగులకు ఫీజు లేదు.
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. హార్డ్‌కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు, ఫొటోలు తదితర అవసరమైన వాటిని జతచేసి 'మెంబర్ సెక్రటరీ, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారిక్ రీసెర్చ్, నెం.35, ఫిరోజ్‌షా రోడ్, న్యూఢిల్లీ–110001' చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ : జనవరి 14, 2018.
హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ : జనవరి 24, 2018.
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు
వెబ్‌సైట్ : www.ichr.ac.in

ఉద్యోగాలు

ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్‌లో 460 ఖాళీలు

తమిళనాడులోని నైవేలీలో ఉన్న నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్ఎల్‌సీ) ఇండియా లిమిటెడ్.. 460 అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు పేరు : అప్రెంటీస్ (టెక్నీషియన్/ గ్రాడ్యుయేట్).
విభాగాల వారీ ఖాళీలు : టెక్నీషియన్‌లో మెకానికల్ ఇంజనీరింగ్–90, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్–75, సివిల్ ఇంజనీరింగ్–25, ఇన్‌స్ట్రుమెంటేషన్–10, కెమికల్ ఇంజనీరింగ్–10, మైనింగ్ ఇంజనీరింగ్–15, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్–15, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్–10, గ్రాడ్యుయేట్‌లో మెకానికల్ ఇంజనీరింగ్–65, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్–65, సివిల్ ఇంజనీరింగ్–20, ఇన్‌స్ట్రుమెంటేషన్–10, కెమికల్ ఇంజనీరింగ్–10, మైనింగ్ ఇంజనీరింగ్–15, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్–15, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్–10.
స్టైపెండ్ : టెక్నీషియన్ అప్రెంటీస్‌కు రూ.3,542, గ్రాడ్యుయేట్ అప్రెంటీస్‌కు రూ.4,984.
అర్హతలు : సంబంధిత విభాగాలను అనుసరించి కనీసం 55 శాతం (ఎస్సీ/ఎస్టీలకు 50 శాతం) మార్కులు/తత్సమాన గ్రేడ్‌తో ఇంజనీరింగ్ డిప్లొమా/ ఇంజనీరింగ్ డిగ్రీని 2015, ఏప్రిల్ 1 లేదా ఆ తర్వాత ఉత్తీర్ణులై ఉండాలి.
ఎంపిక : మార్కుల మెరిట్ ఆధారంగా.
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు హార్డ్‌కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి, కవరులో ఉంచి 'ది డిప్యూటీ జనరల్ మేనేజర్, లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్, ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్, బ్లాక్ 20, నైవేలీ–607803, తమిళనాడు' చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ : జనవరి 5, 2018.
దరఖాస్తు హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ : జనవరి 10, 2018.
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు
వెబ్‌సైట్ : www.nlcindia.com

ఎఫ్‌సి లేటు ఫీజు రద్దు చేయాలి

ప్రజాశక్తి - కర్నూలు సిటీ

రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆటోలపై ఎఫ్‌సి లేటు ఫీజు రూ.50ని రద్దు చేయాలని ఎపి ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ఆటో డ్రైవర్లతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఎపి ఆటోవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రాధాకృష్ణ, కె.ప్రభాకర్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో కార్మికులకు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాయని తెలిపారు. అధికారంలోకి వచ్చాక ఆటో కార్మికులను వేధింపులకు గురి చేస్తూ ఆటో ఎఫ్‌సిలకు లేటు ఫీజు భారీగా పెంచడంతో రూ.18వేలు చెల్లించాల్సి వస్తోందన్నారు. ప్రమాదాలకు ఆటోడ్రైవర్లే ప్రధాన కారణమని, వారే బాధ్యులని పేర్కొంటున్నారని తెలిపారు.



ఉత్సవాలు

బళ్లారి రాఘవ ఉత్సవాలు గురువారం ముగిశాయి. నెల్లూరు జిల్లాకు చెందిన కళాకారులు ప్రభుత్వ పథకాల్లోని లోపాలను ఎత్తిచూపే నృత్యం ఆకట్టుకుంది

దేశం తిరోగమనం వైపు పయనిస్తోంది

బళ్లారి రాఘవ ఉత్సవాల్లో సినీ దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

నేటి పరిస్థితులు చూస్తే దేశం తిరోగమనం వైపు పయనిస్తోందని సినీ దర్శకులు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఆందోళన వ్యక్తం చేశారు. బళ్లారి రాఘవ ప్రజా సాంస్కృతిక మూడో రోజు ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్.ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భరద్వాజ మాట్లాడుతూ దేశంలో నేటి పరిస్థితులు చూస్తే ఆందోళన కలిగించే విధంగా ఉన్నాయని చెప్పారు. ప్రజలను జాగురూకత చేసి వారిలో చైతన్యం నింపే బాధ్యత ప్రజాకళాకారులపై ఉందని సూచించారు. మరోమారు ప్రజానాట్యమండలి ద్వారా ప్రజాకళాకారులు నడుం బిగించి ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు రూపొందించాలని పిలుపునిచ్చారు. సిఆర్‌డిఎ సంస్థ ప్రతినిధి సత్యబోస్ మాట్లాడుతూ 80వ దశకంలో జన నాట్యమండలి, ప్రజానాట్యమండలి తదితర పేర్లలో ప్రజా కళాకారులు ప్రజలను జాగృతం చేయడంలో చేసిన కృషి అభినందనీయమన్నారు.

ఆకట్టుకున్న ఆఖరి రోజు ప్రదర్శనలు...

బళ్లారి రాఘవ ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఆఖరి రోజు చేపట్టిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. నెల్లూరు జిల్లాకు చెందిన కళాకారులు ప్రభుత్వ పథకాల్లోని లోపాలను ఎత్తిచూసే నృత్యరూపం ఆకట్టుకుంది. వీటితోపాట కర్నూలు జిల్లా కళాకారులు 'ఏది నిజం' అనే వీధి నాటికను, నెల్లూరు జిల్లా కళాకారులు ఏ కులం నీది నాటిక ఆలోచింపజేసే విధంగా సాగింది.

ఎస్‌ఎస్‌ఎ సిబ్బంది సమ్మె నోటీస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాల ఉద్యోగులు, కార్మికులు నిర్వహిస్తున్న ఒక రోజు సమ్మెలో భాగంగా రాష్ట్రంలోని సర్వ శిక్షా అభియాన్‌లోని వివిధ విభాగాల ఉద్యోగులు ఈనెల 23 నుంచి ఒక రోజు సమ్మె నిర్వహిస్తున్నట్లు ఎపి సర్వశిక్షాభియాన్ (ఎస్‌ఎస్‌ఎ) కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్, పార్ట్ టైం ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.బాలకాశి, గౌరవాధ్యక్షులు ఎ.వి నాగేశ్వరరావులు తెలిపారు. సమ్మె నోటీసులు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్, సర్వశిక్షా అభియాన్ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.శ్రీనివాస్‌కు గురవారం అందజేశారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనం అందించాలనే సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్రంలో అమలు చేయలేదని నోటీసులో పేర్కొన్నారు. సర్వశిక్షా అభియాన్‌లో మహిళలకు 180 రోజుల వేతనంతో కూడిన మెటర్నిటీ లీవు అమలు చేయకపోవడం, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రెగ్యులరైజ్ చేయలేదనే అంశాలను నోటీసులో ప్రస్తావించారు. ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి కాంట్రాక్టు నియామకాలను కొనసాగించడం, కనీస వేతనం, కనీస పింఛను, పిఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 23వ తేదీన ఒక రోజు సమ్మెలో సర్వశిక్షా అభియాన్ పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, పిఇటిలు, ఐఇఆర్టీ, కెజిబివి టీచర్లు, స్పెషల్ ఆఫీసర్లు, నాన్ టీచింగ్ స్టాఫ్, సిఆర్‌పిలు, ఎంఆర్‌సి సెంటర్ల డిఇఒ, మెసెంజర్లు, ఎస్‌ఎస్‌ఐ రాష్ట్ర, జిల్లా కార్యాలయాల్లో పని చేస్తున్న డిఎల్‌ఎంటిలు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, సైట్ ఇంజనీర్లు, సాక్షత భారత్, ఎంఐఎస్ కోఆర్డినేటర్‌లు, ఎఎన్‌ఎంలు, అకౌంటెంట్లు, వాచ్‌మెన్లు, అటెండర్లు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

రాజమహేంద్ర వీధులు అరుణారుణం

- సిపిఎం జిల్లా మహాసభల సందర్భంగా ఆకర్షణీయ ర్యాలీ
- రిజర్వేషన్ల పేరుతో గిరిజనుల మధ్య తగాదాలు సృష్టిస్తున్న పాలకులు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుల విమర్శ



గురువారం రాజమహేంద్రవరంలో జరిగిన సిపిఎం జిల్లా మహాసభల్లో అభివాదం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి/ పిఠాపురం విలేకరి

ఎర్రదండు కదిలింది. రాజమహేంద్రి వీధులన్నీ అరుణవర్ణం దాల్చాయి. సిపిఎం తూర్పుగోదావరి (రాజమహేంద్రవరం) జిల్లా 22వ మహాసభల సందర్భంగా గురువారం నిర్వహించిన మహాప్రదర్శన జనసందోహంతో పోటెత్తింది. కోటిపల్లి బస్టాండ్ వద్ద ప్రారంభమైన ప్రదర్శనలో ఏజెన్సీ సహా వివిధ ప్రాంతాలనుంచి తరలివచ్చిన సామాన్య జనం పాల్గొన్నారు. ప్రదర్శనలో కొమ్ము డాన్సులు, డప్పు దరువులు సందడి చేశాయి. ర్యాలీ ముందుభాగాన చింతూరుకు చెందిన రమేష్‌బాబు కొమ్ము డాన్స్ బృందం అలరించింది. లయబద్ధంగా నృత్యం చేస్తూ మన్యం సంస్కృతిని ప్రతిబింబించింది. నగర వాసులు ఆసక్తిగా తిలకించారు. వారికి తోడు పెద్దపెద్ద శబ్దాలతో, డప్పుల దరువులతో కళాకారులు కోలాహలం చేశారు. శ్యామలా సెంటర్, డీలక్స్ సెంటర్ తదితర ప్రాంతాల్లో పలువురు ప్రదర్శనకు ఘనస్వాగతం పలికారు. మెయిన్‌రోడ్డు, కోటగుమ్మం నుంచి పుష్కరఘాట్ మీదుగా ప్రదర్శన సాగి నినాదాలతో హోరెత్తిస్తూ సుబ్రహ్మణ్య మైదానానికి చేరుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, వాటి ప్రభావాలను వివరిస్తూ నినాదాలతో మార్గం మధ్యలో సిపిఎం కార్యకర్తలు హోరెత్తించారు. ర్యాలీ అగ్రభాగాన పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మిడియం బాబూరావు, ఎం.కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి టి.అరుణ్, ఎంపిపిలు మురళి, చరమయ్య, కొమరం పెంటయ్య, నాయకులు టిఎస్ ప్రకాష్, కుంజం సీతారామయ్య నడవగా భారీ ప్రదర్శన వారిని అనుసరించింది.

అనంతరం జరిగిన సభలో.. సిపిఎం రాష్ట్ర నేతలు మాట్లాడుతూ.. రిజర్వేషన్ల పేరుతో గిరిజన తెగల మధ్య తగాదా పెట్టేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఈ విషయంలో ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తొలుత సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ మిడియం బాబూరావు మాట్లాడుతూ.. త్వరలో రేషన్ దుకాణాలు ఎత్తివేసి హెరిటేజ్ వంటి సంస్థలకు అప్పగించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. పోలవరం నిర్వాసితులను ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. టిడిపి, బిజెపి ప్రభుత్వాలు సిపిఎంపై కక్ష పెంచుకున్నాయన్నారు. పార్టీ నాయకులను నిర్బంధించడం, తరచూ అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ.. విదేశీ పర్యటనలు మానుకుని త్రిపుర వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు సలహా ఇచ్చారు. అక్కడ గిరిజనుల్లో 97 శాతం అక్షరాస్యత ఉందని, ఇక్కడ 50 శాతం కూడా లేదని విమర్శించారు. కేరళ వెళ్తే అక్కడ ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవచ్చున్నారు. కమ్యూనిస్టులు పాలన సాగిస్తున్న రాష్ట్రాల్లో ప్రజలు స్వేచ్ఛగా ఉన్నారన్నారు. గిరిజనులను ప్రాజెక్టుల పేరుతో ముంచడమేనా అభివృద్ధి అని ప్రశ్నించారు. మరో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ.. ఉపాధి పనులను మనుషులతో కాకుండా యంత్రాలతో చేయించడం చట్ట విరుద్ధమన్నారు గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని మోడీ ప్రభుత్వం నీరుగార్చిందన్నారు. ఎన్‌టిఆర్ హయాంలో రేషన్‌లో 8 సరుకులు ఇచ్చారని, పశ్చిమ బెంగాల్‌లో అప్పటి ముఖ్యమంత్రి జ్యోతిబసు 14 సరుకులు ఇచ్చారన్నారు. ప్రస్తుతం చంద్రబాబు సర్కారు బియ్యం తప్ప ఏమీ ఇవ్వడం లేదన్నారు. వీటిని కూడా అంబానీ, అదానీలకు కట్టబెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. సభకు సిపిఎం రాజమహేంద్రవరం జిల్లా కార్యదర్శి టి.ఆరుణ్ అధ్యక్షత వహించారు. ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టిఎస్ ప్రకాష్, చిచ్చడి మురళి తదితరులు మాట్లాడారు.

దళితులకు అండగా ఉంటాం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - రుద్రవరం



'మీరు ఎవరికీ భయపడాల్సిన పనిలేదు. మీకండగా మేమున్నాం. మీకు ఏ ఇబ్బంది వచ్చినా మాకు సమాచారం ఇవ్వండి' అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. గురువారం కర్నూలు జిల్లా రుద్రవరం మండలం నక్కలదిన్నె గ్రామంలోని బహిష్కరణకు గురయిన బాధిత దళిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నక్కలదిన్నె సంఘటన గతంలో పశ్చిమ గోదావరిలోని గరగపర్రు సంఘటనను గుర్తుచేస్తోందని తెలిపారు. నక్కలదిన్నె గ్రామంలోని దళితులను సాంఘిక బహిష్కరణకు గురి చేసిన వారికి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు శుక్రవారం లేఖ రాస్తామని తెలిపారు. అలాగే నక్కలదిన్నె బాధితులకు మద్దతుగా సంఘీభావం తెలిపే విధంగా విజయవాడలో శనివారం ప్రజా, దళితసంఘాలతో సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సంఘటన దేశవ్యాప్తంగా తెలిసేలా చేస్తామన్నారు. బాధితులు గట్టిగా నిలబడాలని, అందుకు పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తామని తెలిపారు. వెట్టి పని చేయలేదని గ్రామంలోని రైతులు దళితులను కూలీకి పిలవకపోవడం, నిత్యావసర వస్తువులు ఇవ్వకుండా చేయడం, నీటి సరఫరా నిలిపేయడం దారుణమన్నారు. అధికారులు గ్రామానికి వచ్చి వెళ్లాక కూడా కూరగాయలు అమ్మేవారు కాలనీకి రాకపోవడం, దళితులకు సంబంధించిన పాలను తీసుకోకపోవడం అన్యాయమని తెలిపారు. నియోజకవర్గంలో జరిగిన ఈ విషయంపై రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి అఖిలప్రియతో మాట్లాడతామని చెప్పారు. బాధిత కుటుంబాలను ఆమె పరామర్శించాల్సిందన్నారు.

నారాయణ స్కూల్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

అనంతపురం నగరంలోని నారాయణ ప్రయివేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జ్ఞానస్వరూప్(14) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. నాలుగో పట్టణ ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంపేటలో నివాసం ఉంటున్న రవీంద్ర, వెంకటేశ్వరమ్మల కుమారుడు జ్ఞానస్వరూప్ నారాయణ ప్రయివేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. రోజులాగే పాఠశాలకు వెళ్లి వచ్చేవాడు. మధ్యాహ్నం భోజనం అనంతరం విద్యార్థి పాఠశాలకు వెళ్లాడు. పాఠశాలలో అరగంటసేపు ఉండి ఇంటికి చేరుకున్నాడు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మృతిపై పలు అనుమానాలు ఉన్నట్లు సమాచారం. పాఠశాల అధ్యాపకులు వేధింపులా? లేక ఇతర కారణాలేవైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తల్లితండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

జన్మభూమిలో కొనసాగిన నిరసనలు, నిలదీతలు

- పలు చోట్ల సభలు బహిష్కరణ

ప్రజాశక్తి- యంత్రాంగం

జన్మభూమి గ్రామసభల్లో నిరసనలు, నిలదీతల పర్వం మూడో రోజూ కొనసాగింది. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని జన్మభూమి సభల్లో ప్రజలు గురువారం కూడా ప్రశ్నించారు. గుంటూరు జిల్లాలో యువకుడిని, విజయవాడలో సిపిఎం నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. జన్మభూమి కమిటీని రద్దు చేయాలని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుంటూరు జిల్లా పెదకాకాని అంబేద్కర్ కాలనీకి చెందిన రోశయ్య అనే యువకుడు తహశీల్దార్ కార్యాలయంలోకి వెళ్లి తాళం వేసుకున్నాడు. తమ కాలనీపై వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. 'మా సమస్య పరిష్కారం కాకపోతే నా చావుకు ప్రభుత్వం కారణమవుతుంది' అంటూ తనతోపాటు తీసుకొచ్చిన పెట్రోల్, కిరోసిన్ సీసాలను చూపాడు. వేరే మార్గం నుంచి తహశీల్దార్‌లోకి పోలీసులు వెళ్లి రోశయ్యను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. విజయవాడ సింగ్‌నగర్‌లోని బసవపున్నయ్య స్టేడియంలో జన్మభూమి సభలో ఇళ్ల స్థలాల సమస్యపై ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, నగర మేయర్ కోనేరు శ్రీధర్‌లను సిపిఎం నాయకులు నిలదీశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పోలీసులు సిపిఎం నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పరిహారం చెల్లించకపోవడంపై విశాఖ జిల్లా బుచ్చెయ్యపేట మండలం కొండెంపూడి గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం భూ నిర్వాసితులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి బిల్లులు చెల్లించే వరకూ జన్మభూమి సభను జరగనీయబోమంటూ తూర్పుగోదావరి జిల్లా విఆర్.పురం మండలం రాజుపేట, పెద్దమట్టపల్లిల్లో అడ్డుకున్నారు. విజయనగరం జిల్లా పాచిపెంట మండలం కేసలిలో పెద్దగెడ్డ రిజర్వాయర్ నిర్వాసితులకు పట్టాలిచ్చినా భూములు అప్పగించకపోవడం, కొంతమందికి ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయకపోవడంపై సిపిఎం నాయకుడు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యాన నిర్వాసితులు నిలదీశారు. బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చే ప్రయత్నాలను నిరసిస్తూ శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఏజెన్సీలోని దారపాడు, కర్నూలు జిల్లా కల్లూరు మండలంలో వ్యక్తిగత మరుగుదొడ్లను కూల్చేయడంపై సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలు జన్మభూమిని అడ్డుకున్నారు. జన్మభూమి కమిటీల పేరుతో అర్హులకు అన్యాయం చేస్తున్నారంటూ చిత్తూరు జిల్లా తిరుపతి రూరల్ మండలం తనపల్లి పంచాయతీలో జన్మభూమి కార్యక్రమాన్ని సర్పంచ్, ఎంపిటిసి, వార్డు సభ్యులు బహిష్కరించారు. బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చి గిరిజనులకు అన్యాయం చేయాలని ప్రభుత్వం చూస్తుంటే గిరిజన ఎమ్మెల్యే అయి ఉండి ఎందుకు నోరు మెదపడం లేదని పశ్చిమగోదావరి జిల్లా పోలవరం ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావుపై జీలుగుమిల్లి మండలం దర్భగూడెం సభలో గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చింతలపూడి ఎత్తిపోతల కాలువలో భూములు కోల్పోయిన వారికి ఎకరాకు రూ.30 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎర్రగుంటపల్లిలో సభను రైతులు అడ్డుకున్నారు. మరుగుదొడ్లు నిర్మించినా నీటి సౌకర్యం కల్పించకపోవడంపై ప్రకాశం జిల్లా కొనకనమెట్ల మండలం మాదాలవారి పాలెం గ్రామస్తులు అధికారులను నిలదీశారు.



తూర్పుగోదావరి జిల్లా ఎటపాకలో సమస్యలపై అధికారులను నిలదీస్తున్న గిరిజనులు

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

ప్రజాశక్తి- మొగల్రాజపురం (విజయవాడ)

విద్యార్థులు చదువుతోపాటు మన చుట్టూ జరుగుతున్న అంశాలను తెలుసుకుని అన్ని రంగాల్లోనూ రాణించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి తెలిపారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని గురువారం సూర్యారావుపేటలోని కర్నాటి రామమోహనరావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే మహిళల విద్యను ప్రోత్సహించి మగ వారితో మహిళలు సమానమేనని చాటి చెప్పారని తెలిపారు. మూఢాచారాలను తుద ముట్టించడానికి నిత్యం పోరాటం చేశారన్నారు. దళిత, శూద్ర వర్గాల వారికి చదువు అందించాలని జ్యోతీరావు పూలె, సావిత్రిబాయి పూలె పాఠశాలను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అగ్ర కులాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా మహిళలకు విద్య భోదించడానికి అమె చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. సావిత్రిబాయి పూలెను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐద్వా సెంట్రల్ సిటీ కార్యదర్శి కె.సరోజ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రమాదేవి

పిల్లలకు విషమిచ్చి.. తల్లిదండ్రులు ఆత్మహత్య

ఒకే కుటుంబంలో నలుగురు బలన్మరణం

మృతులు ప్రకాశం జిల్లా కనిగిరివాసులు

ప్రజాశక్తి - ఆరిలోవ (విశాఖ)

ఇరుగు పొరుగు వారితో సంబంధాల్లేవు.. తమలో తామే మదనపడ్డారు. సమస్యలన ధైర్యంగా ఎదుర్కోవాల్సిది పోయి ఆత్మహత్యే శరణ్యమనుకుని ముక్కుపచ్చలారని తమ ఇద్దరు చిన్నారులకు విషమిచ్చారు. ఆపై వారూ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆరిలోవ ముస్తాఫా కాలనీలో జరిగిన ఈ ఘటనతో స్థానికంగా విషాదం నెలకొంది. పోలీసుల కథనం ప్రకారం ప్రకాశం జిల్లా కనిగిరి ప్రాంతానికి చెందిన దేవరెడ్డి రాజేష్ రెడ్డి(35), సౌమ్య భార్యాభర్తలు. వారికి విష్ణు(9) జాహ్నవి(5) ఇద్దరు పిల్లలతో గత ఎనిమిది నెలల నుంచి ఆరిలోవ ముస్తాఫా కాలనీలో ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. తొలి నుంచీ వీరికి ఇరుగు పొరుగు వారితో పెద్దగా సంబంధాలుండేవి కావు. గురువారం సాయంత్రం తాము ఆత్మహత్య చేసుకుంటున్నామని చెన్నయిలోని తమ బంధువులకు మెసేజ్ పెట్టారు. దీంతో చెన్నయిలో ఉంటున్న బంధువులు ఆరిలోవ సిఐకు సమాచారం అందించారు. రాత్రి సుమారు 7 గంటల నుంచి చెప్పిన అడ్రస్ కనుక్కునే పనిలో పడి ఎట్టకేలకు గుర్తించారు. ఇంటి తలుపులు తీసి చూసే సరికి భార్య, భర్తలు ఎదురెదురుగా ఉరేసుకొని కనిపించగా, మంచంపై ఇద్దరు పిల్లలు విగత జీవులుగా పడి ఉన్నారు. అప్పటికే నలుగురు మృతి చెందినట్టు పోలీసులు గుర్తించారు. ఎసిపి రామచంద్రరావు క్లూస్ టీమ్‌తో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతులు రాసిన సూసైడ్ ఉత్తరం కూడా లభించింది. కుటుంబ సమస్యలు కారణంగా ఆత్మహత్యకు పాల్పడుతున్నామనీ, తమ చావుకు ఎవరూ బాధ్యులు కారనీ రాసి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. గత కొన్ని నెలలుగా ఇరుగు పొరుగు వారితో సంబంధం లేకుండా ఉండడంతో వారి ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు. ఆరిలోవ సిఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

తప్పుడు ప్రచారాలకు కార్మికులే బుద్ధి చెబుతారు

ప్రజాశక్తి- బాపట్ల (గుంటూరు)

వ్యక్తిగత ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారాలు చేస్తే కార్మికులే బుద్ధి చెబుతారని వ్యవసాయ విశ్వవిద్యాలయాల ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె.నిరంజన్‌కుమార్, సిహెచ్ బాబు హెచ్చరించారు. గుంటూరు జిల్లా బాపట్ల వ్యవసాయ కళాశాలలో గురువారం సిఐటియు నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలు, హాస్టళ్లు, పరిశోధనా కేంద్రాలు, కళాశాల క్షేత్రాల్లో టైంస్కేల్ ఉద్యోగులకు హెచ్‌ఆర్ఎ వచ్చేలా సహకరించానని, నాన్ టీచింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కరెడ్ల వెంకటేశ్వరరావు బ్రోచర్ ద్వారా ప్రచారం చేసుకుంటున్నారని ఖండించారు.

ప్రత్యేకం

దళితులపై దాడులకు నిరసనలు

- కొరెగావ్ బాధితులకు కెవిపిఎస్ సంఘీభావం
- పెదగొట్టిపాడు నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో/గుంటూరు/తెనాలి/కర్నూలు

గుంటూరు జిల్లా పెదగొట్టిపాడు, కర్నూలు జిల్లా నక్కలదిన్నె, కడప జిల్లా మైదుకూరు, విశాఖ జిల్లా పోతులపాలెంలలో దళితులపై దాడి చేసిన అగ్రకులాల వారిని కఠి నంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహారాష్ట్రలోని కోరెగాం గ్రామంలో జరిగిన సంఘటనకు ప్రతి ఒక్కరూ సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు. తమిళనాడు కొత్త సంవత్సర వేడు కలు జరిపినందుకు దళితులపైన దాడి చేశారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, బలహీన వర్గాలు, పేదలపై, దాడులు, సాంఘిక బహిష్కరణలు పెరిగిపోయాయని తెలిపారు.

ప్రజాసంఘాల నాయకులు అరెస్టులు

పెదగొట్టిపాడు బాధితులను పరామర్శించేం దుకు బయలుదేరిన కెవిపిఎస్, దళిత, ప్రజా సంఘాల నాయకుల్ని పోలీసులు మార్గమధ్యలో అరెస్ట్ చేశారు. గుంటూరులోని జాతీయ రహదారి పై 15 మంది దళిత, ప్రజాసంఘాల నాయకుల ను అరెస్ట్ చేసి, గుంటూరు రూరల్, నల్లపాడు పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయకుండా, బాధితులకు సంఘీభా వం తెలిపేందుకు వెళుతున్న నాయకుల్ని అరెస్ట్ చేయటం దారుమణమని, ప్రజాస్వామ్య హక్కుల కు ఈ చర్య భంగకరమని పేర్కొన్నారు. మధ్యా హ్నం 12 గంటల సమయంలో అరెస్ట్ చేసిన వారిని సాయంత్రం 6.30 గంటల వరకూ స్టేషన్ లోనే ఉంచి తర్వాత విడుదల చేశారు. నాయకుల అరెస్ట్‌ను మాల్యాద్రి తీవ్రంగా ఖండించారు.



తెనాలిలో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులుల

తెనాలిలో కెవిపిఎస్ నిరసన

కెవిపిఎస్ ఆధ్వర్యంలో తెనాలిలోని మున్సిప ల్ కార్యాలయం సమీపంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ డివిజన్ కార్యదర్శి బొనిగల అగస్టీన్ మాట్లాడుతూ.. దళితులపై దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆందో ళన వ్యక్తం చేశారు. పెదగొట్టిపాడులో దళితులపై దాడి జరిగి మూడు రోజులైనా నింది తులను అరెస్టు చేయకపోవడం విచారకర మన్నారు.

ఎస్‌టి జాబితాలో చేర్చాలని మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద మత్స్యకారులు గురువారం ధర్నా నిర్వహించారు. ఎన్నికల హామీని అమలు చేయాలని, మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చేలా జిఒను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ గేటు వద్ద బైటాయించి పెద్దపెట్టున నినాదాలు చేశారు. ధర్నానుద్దేశించి పాండిచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి, యానాం ఎంఎల్ఎ మల్లాడి కృష్ణారావు మాట్లాడారు. మత్స్యకారుల సమస్యలు చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయన్నారు.

ఇంటెల్, ఇతర చిప్‌ల్లో లోపాలను కనుగొన్న గూగుల్

శాంటాక్లారా, కాలిఫోర్నియా : ఇంటెల్, ఇతర చిప్‌మేకర్లు రూపొందించిన కంప్యూటర్ ప్రాసెసర్లను ప్రభావితం చేసే తీవ్రమైన భద్రతా లోపాలను కనుగొన్నట్లు గూగుల్‌లోని సెక్యూరిటీ రీసెర్చర్లు తెలిపారు. ఈ లోపాల వల్ల కంప్యూటర్ సిస్టమ్‌లోని మెమరీ నుండి సున్నితమైన డేటాను, పాస్‌వర్డ్‌లను సేకరించడానికి వీలు కలుగుతుందని గూగుల్ ప్రాజెక్టు జీరో టీమ్ బుధవారం తెలిపింది. బ్రిటీష్ టెక్నాలజీ సైట్ 'ది రిజిస్టర్' ఈ సమస్య గురించి చెప్పిన తర్వాత ఇంటెల్ దీనిపై మాట్లాడాల్సి వచ్చింది. దీంతో ఇంటెల్ స్టాక్స్ క్షీణించాయి. దీనివల్ల ఇంటెల్ నిర్వహించే ఇతర ప్రాసెసర్లు, ఆపరేటింగ్ సిస్టమ్‌లు కూడా ప్రభావితమయ్యాయని గూగుల్ తెలిపింది.

కోర్టుకు హాజరు



కృష్ణ జింకలను వేటాడిన కేసులో చివరి విచారణ కోసం జోధ్‌పూర్ కోర్టుకు హాజరవుతున్న హిందినటుడు సల్మాన్‌ఖాన్

పాక్ శిబిరాలపై భారత్ కాల్పులు

పది మంది పాక్ రేంజర్లు మృతి


రెండు మోర్టారు స్థావరాలు, నాలుగు ఔట్ పోస్టులు ధ్వంసం

న్యూఢిల్లీ: భారత్-పాక్ అంతర్జాతీయ సరిహద్దు వద్ద గురువారం ఉదయం భారీయెత్తున జరిగిన కాల్పుల్లో పది మంది పాక్ రేంజర్లు మృతి చెందారు. పాక్ ఆధీనంలోని సుఖ్‌మల్ ప్రాంతంలో రెండు మోర్టార్ స్థావరాలను భారత జవాన్లు ధ్వంసం చేశారు. బిఎస్‌ఎఫ్ జవాన్లు తమ కాల్పుల్లో పాకిస్తాన్‌కు చెందిన కనీసం నాలుగు బోర్డర్ ఔట్ పోస్టులను ధ్వంసం చేశారని ఐజి రామ్ అవతార్ చెప్పారు. అయితే బిఎస్‌ఎఫ్ కాల్పుల్లో ఎంతమంది పాక్ రేంజర్లు మరణించారన్న విషయాన్ని అధికారికంగా ప్రకటించేందుకు ఆయన నిరాకరించారు. బుధవారం సాయంత్రం 4 గంటల నుండి ప్రారంభమైన ఈ ఎదురు కాల్పులు అర్ధరాత్రివరకూ కొనసాగాయన్నారు. పాక్ రేంజర్ల కాల్పుల్లో మరణించిన హెడ్‌కానిస్టేబుల్ రాధాపద్ హజ్రా బిఎస్‌ఎఫ్‌లో 27 ఏళ్ల సర్వీసు పూర్తి చేశారని, బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌కు చెందిన ఈ జవాను తన పుట్టినరోజునాడే తుది శ్వాస విడవటం విచారకరమని ఆయన అన్నారు. హజ్రాకు 21 ఏళ్ల కుమార్తె, 18 ఏళ్ల కుమారుడు వున్నారని ఆయన చెప్పారు. పాకిస్తాన్ వైపు నుండి ఎటువంటి కవ్వింపూ లేకుండానే చిన్న ఆయుధాలతో ప్రారంభమైన కాల్పులు తరువాత మోర్టార్ కాల్పుల రూపం సంతరించుకున్నాయి. దీనిపై ప్రతిస్పందించిన బిఎస్‌ఎఫ్ దళాలు పాకిస్తాన్ మోర్టార్ స్థావరాలను గుర్తించి వాటిని ధ్వంసం చేశాయని అధికారులు చెప్పారు.

శాంతి, సామరస్యాలతో అభివృద్ధి సాధన

లెఫ్ట్ ఫ్రంట్ ఘన విజయమన్న మాణిక్ సర్కార్

ఇండియా న్యూస్ నెట్‌వర్క్, అగర్తలా :



రాష్ట్రంలో శాంతి, సామరస్యాలను కొనసాగిస్తూ అభివృద్ధి పథంలో పయనిస్తుండటం తన సారధ్యంలోని ఏడవ లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వం సాధించిన ఘన విజయమని త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ఉద్ఘాటించారు. నూతన సంవత్సర ఆరంభ సందర్భంగా ఇటీవల ఆయన ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఎన్ని అడ్డంకులెదురైనా తమ ప్రభుత్వం రాష్ట్రంలో శాంతి, సామరస్యాలను కాపాడుతూ అభివృద్ధి ప్రక్రియను కొనసాగిస్తోందని, తీవ్రవాదాన్ని నియంత్రించటంలో విజయం సాధించిందని చెప్పారు. అయితే ప్రస్తుతం తాము ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను, కవ్వింపులను పరిగణనలోకి తీసుకుంటే దీనిని విజయంగా భావించలేమని, పూర్తి స్థాయి విజయం సాధించేందుకు తాము మరింత శ్రమించాల్సి వుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తనకు అందుబాటులో వున్న పరిమితమైన వనరులతోనే ఉద్యోగులు, అధికారులకు గరిష్ట స్థాయిలో ప్రయోజనాలను అందించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కేంద్రం నుండి విడుదల కావల్సిన నిధుల విషయంలో ప్రస్తుత కేంద్రప్రభుత్వం తీవ్రమైన మార్పులు తీసుకురావటంతో ఆర్థిక వనరులు తగ్గినప్పటికీ తాము చేస్తున్న కృషికి ఉద్యోగులు, అధికారుల నుండి అభినందనలు వస్తున్నాయని చెప్పారు. జాతీయ స్థాయి ఆర్థిక విధానాల్లో మార్పులువచ్చి రాష్ట్రాలకు మరిన్ని నిధులు కేటాయిస్తే తప్ప కేవలం త్రిపుర కు మాత్రమే ఎక్కువ నిధులు అందవని ఆయన స్పష్టం చేశారు.

అస్సాం నుండి బెంగాలీలను పంపడానికి కుట్ర

తృణమూల్ ఎంపి ఆరోపణ

న్యూఢిల్లీ : అస్సాం నుండి బెంగాలీలను బయటకు పంపివేయడానికి కుట్ర జరుగుతోందని తృణమూల్ కాంగ్రెస్ ఎంపి సౌగత్ రాయ్ వ్యాఖ్యానించారు. గురువారం లోక్‌సభలో జీరో అవర్‌లో అస్సాం ప్రభుత్వం విడుదల చేసిన జాతీయ పౌరుల రిజిస్టర్‌ను ప్రస్తావిస్తూ ఆయన, కోట్లాది మంది పేరులను ఈ పౌరుల జాబితా నుండి తొలగించడం వెనుక కుట్ర వుందని అన్నారు. అస్సాంలోని ధుబ్రి లోక్‌సభా స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎఐడియుఎఫ్ ఎంపి బద్రుద్దీన్ అజ్మల్ పేరు కూడా ముసాయిదాలో లేదని అన్నారు. కోటీ 30లక్షల మంది పేర్లు జాబితాలో లేవని, వారు కూడా సాధారణ పౌరులేనని, వారినిఅస్సాంలో నివసించేందుకు అనుమతించాలని కోరారు. అనేక తరాల నుండి బెంగాలీ మాట్లాడే ప్రజలు అస్సాంలో నివసిస్తున్నారని, వారిని అక్కడే జీవించేందకు అనుమతించాలని కోరారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి కూడా ఇదే విషయాన్ని ఇప్పటికే ప్రస్తావించారని తెలిపారు. అస్సాం ముఖ్యమంత్రి మాత్రం వారికి అస్సాంలో ఎలాంటి హక్కులు వుండవని అంటున్నారని, ఇది చాలా తీవ్రమైన విషయమని అన్నారు. పేర్లు తొలగించడానికి నిరసనగా ఈ రోజు సమావేశాలు ప్రారంభం కావడానికి ముందుగా తృణమూల్ ఎంపీలు పార్లమెంట్ ఎదుట ప్రదర్శన నిర్వహించారు. రాయ్ చేసిన ప్రస్తావనపై హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందిస్తూ, సుప్రీం కోర్టు పర్యవేక్షణలో ఎన్‌ఆర్‌సి కార్యకలాపాలు సాగుతున్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. జాబితాలో పేర్లు లేనివారు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవచ్చని అన్నారు.

విజయ్ మాల్యాను నేరస్తుడిగా ప్రకటించిన ఢిల్లీ కోర్టు



న్యూఢిల్లీ: దేశంలో పలు బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు బకాయిపడి ప్రస్తుతం విదేశాల్లో ప్రవాస జీవితం గడుపుతున్న వ్యాపార వేత్త విజయ్ మాల్యాను ఇక్కడి చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు నేరస్తుడిగా ప్రకటిస్తూ గురువారం ఆదేశాలుజారీ చేసింది. కేసు విచారణకు హాజరుకా వల్సిందిగా పలుమార్లు సమన్లు పంపినా మాల్యా కోర్టుకు హాజరు కాకపోవడంతో చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ దీపక్ షెరావత్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. తాము నిర్దేశించిన వ్యవధిలో కోర్టుకు హాజరు కావటంలో విజయ్ మాల్యా విఫలమయ్యారని, ఇందుకు సంబంధించి ఆయన తరపున ఎటువంటి వినతి అందలేదని, దీనితో ఆయన్ను కోర్టు నేరస్తుడిగా ప్రకటిస్తున్నదని న్యాయమూర్తి తన ఆదేశాలలో పేర్కొన్నారు. మాల్యాపై గత ఏడాది ఏప్రిల్ 12న కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసింది. అయితే సాధారణ వారంట్ మాదిరిగా దీనికి నిర్దిష్ట కాల వ్యవధి లేకపోవటంతో దీని అమలుపై అధికారులు సందిగ్ధంలో పడి నట్లు తెలుస్తోంది. తాను భారత్‌కు తిరిగి రావాలనుకున్నప్పటికీ తన పాస్ పోర్ట్‌ను భారత్ అధికారులు స్వాధీనం చేసుకున్నారంటూ మాల్యా ఒక సంద ర్భంలో చేసిన విజ్ఞప్తిని కోర్టు కొట్టిపారేసింది. ఇది కేవలం సాకు మాత్రమే కాక చట్టాన్ని దుర్వినియోగం చేయటమే అవుతుందని కోర్టు వ్యాఖ్యానించింది.

రాహుల్ విదేశీ ప్రయాణం

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అధ్యక్షుడిగా బాధ్యతల్ని స్వీకరించిన అనంతరం తొలిసారి విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నెల 8న ఆయన బహ్రెయిన్‌కు వెళ్లి, అక్కడి ఎన్‌ఆర్‌ఐలను కలవనున్నట్లు పార్టీ సభ్యులు తెలిపారు. అలాగే బహ్రెయిన్ ప్రధాన మంత్రి ఖలీఫా బిన్ సల్మాన్ అల్ ఖలీఫాతో ఆయన సమావేశం కానున్నారు.

మేఘాలయ మంత్రిపై సిబిఐ కేసులు

న్యూఢిల్లీ: 2008-09 సంవత్సరంలో జరిగిన టీచర్స్ రిక్రూట్‌మెంట్ పరీక్షలో మార్కుల పత్రాలు తారుమారు చేసిన ఆరోపణలపై మేఘాలయ పిడబ్ల్యుడి మంత్రి అంపరీన్ లింగ్డో, ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి పిఎస్ థాంగ్‌ఖ్యూపైకేసులు నమోదు చేసినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. మేఘాలయ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసులు నమోదుచేసినట్లు సిబిఐ తన ప్రకటనలో వెల్లడించింది. లింగ్డోతో పాటు అప్పటి విద్యాశాఖ అధికారిగా వున్న థాంగ్‌ఖ్యూపై నేరపూరిత కుట్ర, ఫోర్జరీ, విశ్వాసఘాతుకం వంటి అభియోగాల తోనూ కేసులు నమోదు చేసినట్లు సిబిఐ అధికారి ఒకరు వెల్లడించారు. 1984 బ్యాచ్ ఐఎఎస్ అధికారి అయిన థాంగ్‌ఖ్యూ ఇప్పుడు హోంశాఖ అదనపు ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న మేఘాలయలో మంత్రి, సీనియర్ అధికారులపై సిబిఐ కేసులు నమోదు చేయటం సంచలనం కలిగించింది. వీరితో పాటు ఈ ఎఫ్ఐఆర్‌లో ఎలిమెంటరీ, మాస్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్‌ను, కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులను కూడా సిబిఐ నిందితులుగా పేర్కొంది.

భీమా-కొరెగావ్ హింసను ఖండించిన రాజ్యసభ



న్యూఢిల్లీ : భీమా-కొరెగావ్‌లో జరుగుతున్న హింసాకాండను రాజ్యసభ తీవ్రంగా ఖండించింది. గురువారం జీరో అవర్‌లో కాంగ్రెస్ సభ్యురాలు రజనీ పాటిల్ ఈ అంశాన్ని లేవదీస్తూ, ఈ హింసకు శాంబాజి వంటి మితవాద సంస్థలే కారణమని ఆరోపించారు. టి.కె.రంగరాజన్ (సిపిఎం)తో సహ సమాజ్‌వాదీ పార్టీ, అన్నాడిఎంకె, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు ఆమెతో ఏకీభవించారు. ఈ హింసాకాండకు పాలక పార్టీ, ప్రభుత్వం మద్దతు, అండదండలు వున్నాయని రంగరాజన్ విమర్శించారు. సిపిఐ సభ్యుడు డి.రాజా దళితులపై దాడిని ఖండిస్తూ, చట్టం తన పని తాను చేస్తుందని వ్యాఖ్యానించారు. దళితుల సమస్యను నిజాయితీగా పరిష్కరించాలన్నారు. సరైన చారిత్రక దృక్పథంతో దళితులు చెప్పినదాన్ని అర్ధం చేసుకోవాల్సి వుందన్నారు. కానీ మహారాష్ట్రలో మతోన్మాద, ఫాసిస్ట్ సైద్ధాంతిక శక్తులు దీన్ని వక్రీకరిస్తున్నాయని విమర్శించారు. ఈ హింసకు దారి తీసిన పరిస్థితులను పరిశీలించడానికి కమిషన్ ఏర్పాటు చేయాలని నరేష్ అగర్వాల్(ఎస్‌పి) డిమాండ్ చేశారు. డిఎంకె ఎంపి కనిమొళి మాట్లాడుతూ, దేశభక్తి స్ఫూర్తి అనేది ఏ ఒక్కరికీ చెందినది కాదన్నారు. ఈనాడు దేశంలో అనేక ప్రాంతాల్లో దళితులు, మహిళలు, మైనారిటీలు దాడులకు గురవుతున్నారని అన్నారు. ఈ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం కనుగొనాలని కోరారు. న్యాయపరమైన విచారణ అవసరమని అభిప్రాయపడ్డారు. శివసేన సభ్యుడు సంజయ్ రౌత్ మాట్లాడుతూ, భీమాలోని హింసా సంఘటనలు దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. చరిత్ర గురించి తెలియని వ్యక్తులు ఈనాడు మాట్లాడుతున్నారని అన్నారు. ఎస్ఎడి సభ్యుడు బల్వీందర్ సింగ్ భండార్ మాట్లాడుతూ సభ్యులందరూ కలిసి పరిష్కారం కనుగొనాలని కోరారు. బిజెపి సభ్యుడు అమర్ శంకర్ సాబ్లే కూడా ఈ అభిప్రాయంతో ఏకీభవించారు. కాంగ్రెస్ సభ్యులు చేసిన ట్వీట్లను ఆయన ప్రస్తావించారు. జిగ్నేష్ మేవాని, ఉమర్ ఖలీద్‌లు కవ్వించే వ్యాఖ్యలు చేసి హింసాకాండను రెచ్చగొట్టారన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలకు ప్రతిపక్షాల నుండి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి రాందాస్ అత్‌వాలే మాట్లాడుతూ, దళితుల అణచివేతను రాజకీయం చేయొద్దని కోరారు.

అంబేద్కర్ సమానత్వ సూత్రానికి సంఘ్ వ్యతిరేకం: ఏచూరి

న్యూఢిల్లీ : కేంద్రంలో బిజెపి పాలనలో భారతీయులలో దళితులకు స్థానం లేకుండా చేస్తున్నారని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. మహారాష్ట్రలో జరుగుతున్న అల్లర్లపై కేంద్రం స్పందించకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు.పాలక బిజెపి చెబుతున్న నిర్వచనంలో భారతీయుల నుండి దళితులను మినహాయిస్తున్నారని ఆయన విమర్శించారు. దళితులను భారతదేశంలో భాగంగా చూస్తున్నారా లేదా అని ఆయన ప్రశ్నించారు. భారతీయుల నుండి దళితులను మినహాయిస్తున్నారని, మహారాష్ట్రలో జరుగుతున్న ఘటనలపై వారి మౌనం దీనిని స్పష్టం చేస్తున్నదని ఆయన చెప్పారు. రాజ్యాంగ నిర్మాతల్లో ఒకరైన అంబేద్కర్ సమానత్వం అనే ఆలోచనను సంఘ్ సిద్ధాంతం వ్యతిరేకించిందని తన ట్వీట్లలో ఆయన స్పష్టం చేశారు. రాజ్యాంగ నిర్మాతలలో ఒకరైన అంబేద్కర్ చెప్పిన సమానత్వ సూత్రానికి సంఘ్ సిద్ధాంతం వ్యతిరేకమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికి ఒకఓటు ఉంటుందని,ప్రతి ఓటుకూ



ఒకే విలువ ఉంటుందని అంబేద్కర్ చెప్పాడు. ఆర్థిక, సామాజికంగా మనుషులందరికీ ఒకే విలువ లేకుండా అసమానతలు కొనసాగుతున్నంత కాలం పోరాటం కొనసాగుతుందని అంబేద్కర్ చెప్పిన విషయాన్ని ఏచూరి గుర్తు చేశారు. సమాజంలో చారిత్రకంగా అణచబడ్డ తరగతులు గొంతెత్తినపుడు వారిని నిందించటం అణచివేతతో కూడిన పాత సామాజిక వ్యవస్థపై ఆర్‌యస్‌యస్, బిజెపిల మౌలిక విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నదని ఏచూరి చెప్పారు. భీమా కొరేగావ్ యుద్ధం ద్విశత వార్షికోత్సవాల సందర్భంగా మహారాష్ట్రలో జరుగుతున్న ఘర్షణలపై స్పందిస్తూ ఏచూరి ఈ విషయాలను ట్వీట్ చేశారు.

ఏడుగురు యువతులను విముక్తి

విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్



న్యూఢిల్లీ : కెన్యాలో నేరస్తుల చెరలో ఉన్న ఏడుగురు యువతులను భారత అధికారులు విడిపించారని వీరిలో ముగ్గురు భారతీయులు, నలుగురు నేపాలీయులని విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి సుష్మాస్వరాజ్ తెలిపారు. ముగ్గురిని భారత్‌కు తీసుకొచ్చామని, నలుగురిని నేపాల్‌కు పంపించామని మంత్రి అన్నారు. దీనిపై మంత్రి ట్వీట్ చేశారు. యువతులను అక్రమంగా తరలించే ముఠా కెన్యాలోని మొంబసాలో ఏడుగురిని బందీలుగా తీసుకుందని తెలిపారు. దుండగులు వారి పాస్‌పోస్టులు, ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారని వివరించారు. ఈ విషయంపై పంజాబ్ ప్రభుత్వంతో సంప్రదించామని, ఆ యువతులను కెన్యాకు పంపిన ఏజెన్సీలపైనా కేసులు నమోదు చేయాలని ఆదేశించామన్నారు. బందీలను విడిపించడంలో కెన్యాలోని భారత హై కమిషనర్ సుచిత్రా దురై, కార్యదర్శి కరణయాదవ్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. అందుకు సహకరించిన కెన్యా పోలీసులకు మంత్రి అభినందనలు తెలిపారు .

దళితుడితో బూట్లు నాకించారు


గుజరాత్‌లో ఖాకీల దుర్మార్గం

అహ్మదాబాద్ :బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై జరుగుతున్న ఘోరాలు అన్నీ ఇన్నీకావు. బీహార్‌లో సర్పంచ్ ఇంటికి తలుపుతట్టకుండా లోనికి వెళ్లాడనే కోపంతో ఓ వృద్ధుడికి శిక్షగా చెప్పులు నాకించారు. గుజరాత్‌లోని ఉనాలో దళితుల ఘటన మరవకముందే.. తాజాగా ప్రధాని మోడీ సొంత రాష్ట్రంలో మరో దళితుడికి ఘోర అవమానం జరిగింది. ఇద్దరి మధ్య గొడవ జరుగుతుంటే.. మధ్యలో ఆపటానికి వెళ్లాడు. అతను దళితుడని తెలియగానే ఖాకీల కోపం నషాళానికెక్కింది. అంతే ఇదే అవకాశంగా తీసుకుని ఆ దళితుడికి శిక్షగా ఏకంగా 15 మంది పోలీసుల కాళ్లు మొక్కించుకోవటమే కాదు. వారి బూట్లు నాకించారు. ఈ దారుణంతో వెలుగులోకి రాగానే ప్రజాసంఘాలు, దళితసంఘాల్లో ఆగ్రహం పెల్లుబుకుతోంది.

గుజరాత్‌లో ఓ దళితుడిపై ఖాకీల అమానవీయ చర్య వెలుగులోకి వచ్చింది. పోలీస్ స్టేషన్‌లో దాదాపు 15 మంది పోలీసులు తనతో కాళ్లు మొక్కించి, వారి బూట్లు నాకించినట్లు హర్షద్ యాదవ్ (38) ఆరోపించారు. తన నివాస ప్రాంతంలో పోలీసు కానిస్టేబుల్ వినోద్‌భాయ్‌కు ఓ వ్యక్తికి మధ్య గొడవ జరుగుతుండగా హర్షద్ యాదవ్ కల్పించుకున్నాడు. వివాదం తగదని కానిస్టేబుల్‌ను ప్రశ్నించాడు. ఆగ్రహానికి గురైన కానిస్టేబుల్ లాఠీతో హర్షద్‌ను కొట్టాడు. ఈ దాడిలో ఓ వేలుకూడా విరిగింది. కానిస్టేబుల్ కొట్టడమే కాకుండా.. హర్షద్ బంధువులనూ తిట్టాడు. ఉన్నతాధికారులకు విషయం చెప్పాడు. హర్షద్ జాదవ్‌పై ఎఫ్ఐఆర్ నమోదుచేసి డిసెంబరు 28న అమ్రయివాడి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్ళారు. స్టేషన్‌కు తీసుకెళ్లిన తర్వాత పోలీసులు తన కులం గురించి ప్రశ్నించారు. తాను దళితుడినని చెప్పడంతో వినోద్‌భాయ్‌కు క్షమాపణ చెప్పాల్సిందిగా ఒత్తిడి చేశారు. వారు చెప్పినట్టు చేసిన తర్వాత కూడా వారి ఆగ్రహం చల్లారలేదు. అక్కడున్న దాదాపు 15 మంది పోలీసుల బూట్లను నాకించారు. డిసెంబరు 29న హర్షద్‌కు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో బెయిల్‌పై విడుదలయ్యాడు. అనంతరం ఈ నెల 1న స్థానికులతో కలిసి పోలీస్ స్టేషన్‌ను ఘెరావ్ చేయడంతో ఉన్నతాధికారులు కల్పించుకొని అమానవీయంగా ప్రవర్తించిన పోలీసులపై కేసు నమోదుచేశారు. మరోవైపు జాదవ్ ఫిర్యాదుతో కానిస్టేబుల్ వినోద్‌పై ఎస్సీ,ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద కేసు నమోదుచేసినట్టు అమ్రయివాడి పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ ఓఎం దేశాయ్ చెప్పారు.కానీ ఇంతవరకు హర్షద్‌పై అక్రమంగా కేసులో ఇరికించిన పోలీసుపై ఇంతవరకూ ఎలాంటి చర్యా తీసుకోలేదని దళితసంఘాలు ఆరోపిస్తున్నాయి.

వారు నాకేమీ హాని చేయలేదు

పాక్ వీడియోలో కులభూషణ్ జాదవ్



న్యూఢిల్లీ: తనను నిర్బంధించిన జైలులో పాకిస్తాన్ అధికారులు తనకు ఎటువంటి హానీ చేయలేదని ప్రస్తుతం అక్కడ జైలులో వున్న భారత మాజీ నౌకాదళాధికారి కులభూషణ్‌జాదవ్ చెప్పారు. గత నెల 25న తనను కలిసిన తల్లి, భార్యను పాకిస్తాన్ అవమానించిందంటూ భారత్ ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో పాక్ విదేశాంగశాఖ విడుదల చేసిన వీడియో ప్రకటనలో కులభూషణ్ ఈ వ్యాఖ్యలు చేశారు. వారు తనను జాగ్రత్తగానే చూసుకుంటున్నారని, తనకు ఎటువంటి హానీ చేయలేదని, కనీసం తాకను కూడా తాకలేదని ఆయన స్కైప్ ద్వారా ప్రసారమైన ఈ వీడియో ప్రకటనలో వివరించారు. జైలులో వున్న జాదవ్‌ను పాక్ సైన్యం చిత్రహింసలకు గురి చేసిందని, ఆయన శరీరంపై చిత్రహింసలకు సంబంధించిన గుర్తులను తాము ఫొటోలలో చూశామని భారత్ ఆరోపించిన విషయం తెలిసిందే. కాగా ఈ ఆరోపణలను కొట్టిపారేసిన పాక్ సైన్యం, విదేశాంగశాఖ సహాయంతో తమ వాదనకు మద్దతుగా ఈ వీడియోను విడుదల చేసింది. తనను చూసిన తన తల్లి సంతృప్తి వ్యక్తం చేసిందని, సంతోషించిందని జాదవ్ ఈ వీడియో ప్రకటనలో వివరించాడు. తన తల్లి కళ్లలో భయాన్ని తాను గమనించానని, భారత దౌత్యాధికారి ఆమెను కేకలేస్తూ తీసుకెళ్లాడని జాదవ్ ఈ వీడియోలో చెప్పాడు. అయితే పాకిస్థాన్ విడుదల చేసిన ఈ వీడియో వాస్తవికతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

దాణా కుంభకోణంలో శిక్ష ఖరారు మళ్లీ వాయిదా

రాంచి: దాణా కుంభకోణం కేసులో బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్ సహ దోషులకు శిక్ష ఖరారును సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం మళ్లీ రేపటికి వాయిదా వేసింది. ఈ కేసులో లాలూప్రసాద్ యాదవ్‌తో పాటు మరో 15 మందిని దోషులుగా తేలుస్తూ గత నెల 23న రాంచీలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి జనవరి 3న శిక్ష ఖరారు చేస్తామని చెప్పింది. అయితే నిన్న న్యాయవాది విందేశ్వర ప్రసాద్ మృతితో తీర్పు ఈ రోజుకు వాయిదా వేశారు. నేడు మళ్లీ రేపటికి వాయిదా వేశారు. బిహార్‌లో 21ఏళ్ల క్రితం పశు దాణా కుంభకోణం వెలుగులోకి వచ్చింది. 1991-94 మధ్య దేవ్‌గఢ్ ఖజానా నుంచి రూ.89.27లక్షల మొత్తాన్ని తప్పుడు వివరాలతో కాజేయడానికి సంబంధించిన కేసులో సీబీఐ విచారణ జరిపి 38 మందిపై అభియోగపత్రాలు నమోదు చేసింది. వీరిలో 11 మంది ఇప్పటికే చనిపోయారు. ఇద్దరు తమ నేరాన్ని అంగీకరించడంతో శిక్షలు పడ్డాయి. ముగ్గురు నిందితులు సాక్షులుగా మారారు. మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రాతో పాటు ఆరుగురిని



న్యాయస్థానం నిర్దోషులుగా తేల్చింది. శిక్షపడిన వారిలో ఐఎఎస్ అధికారులు బెక్ జూలియస్, ఫూల్‌చంద్ సింగ్, మహేశ్ ప్రసాద్, ప్రభుత్వాధికారులు కృష్ణకుమార్, సుబీర్ భట్టాచార్య తదితరులు ఉన్నారు.చాయిబాసా ఖజానా నుంచి అక్రమంగా రూ.37.7కోట్ల నగదు స్వాహా చేసిన కేసులో 2013 సెప్టెంబరు 30న లాలూ, మిశ్రా, మరికొందరికి శిక్షలు పడ్డాయి. ఆ ఏడాది డిసెంబరులో సుప్రీంకోర్టు లాలూకు బెయిల్ మంజూరు చేసింది. ప్రస్తుతానిది రెండో కుంభకోణానికి సంబంధించిన శిక్ష. లాలూపై ఇలాంటివి మరో మూడు కేసులున్నాయి.

ప్రత్యేకం

బడా తిమింగళాల గుప్పిట్లో బిట్ కాయిన్ భవిత్యం

- వెయ్యి మంది చేతిలోనే 40 శాతం బిట్‌కాయిన్లు
- క్రిప్టోకరెన్సీ మార్కెట్ నిర్దేశించేది వీరే



న్యూయార్క్ : ప్రపంచవ్యాప్తంగా దాదాపు 40 శాతం బిట్‌కాయిన్‌లు కేవలం వెయ్యి మంది బడా పెట్టుబడిదారుల చేతుల్లోనే వున్నాయి. దీంతో, వారు ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు క్రిప్టోకరెన్సీ మార్కెట్‌ను తమ అనుకూలంగా మలుచుకునే ప్రమాదముంది. పెద్ద మొత్తంలో బిట్‌కాయిన్‌లను కలిగివున్న వీరు తమ డిజిటల్ నిధుల్లో దాదాపు సగాన్ని ఏ క్షణంలోనైనా విక్రయంచుకోవచ్చునని ఎక్యుఆర్ కేపిటల్ మేనేజ్‌మెంట్‌కి చెందిన మాజీ ఎండి, ఫైనాన్షియల్ మార్కెట్స్ రీసెర్చ్ అధినేత అయిన అరాన్ బ్రౌన్ తెలిపారు. బిట్‌కాయిన్‌కు భద్రతాపరమైన హోదా లభించేవరకు దీనితో జరిపే వాణిజ్యంపై ఎలాంటి నిషేధం వుండదని సెక్యూరిటీస్ లాయర్ గారీ రాస్ తెలిపారు. డిజిటల్ ఆస్తులపై ఎవరికీ నియంత్రణ లేనందున ఈ బిడ్డింగ్ రిగ్గింగ్ జరుగుతోంది. ఎవరిపైనా ఆరోపణలు చేయడానికి ఆస్కారం లేకుండా పోతోంది. బిట్‌కాయిన్ ట్రేడింగ్‌లో పాల్గొనే గ్రూపులు వీటి ధరలను బాగా పెంచేందుకు పెద్ద మొత్తాల్లో కొనుగోలు చేస్తారు. తర్వాత వాటిని నిముషాల్లో విక్రయించేస్తారు. ఈ లావాదేవీలు నిర్వహించేందుకు ఆ గ్రూపులు సంసిద్ధత వ్యక్తం చేశాయి. కాగా, క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్‌ను ఇలాగే కొనసాగించే విషయంలో ప్రపంచవ్యాప్తంగా రెగ్యులేటర్లు చాలా వెనుకబడి వున్నారు. బిట్‌కాయిన్‌ను సరిగ్గా నియంత్రించగలిగితే అటువంటి చర్యలు ధరలను కృత్రిమంగా పెంచడానికి ఉపయోగపడతాయి. అయితే ఇందుకు సంబంధించి పుకార్లను వ్యాప్తి చేసేందుకు ఆన్‌లైన్‌లోకి వెళితే దాన్ని అవినీతిగా పరిగణించవచ్చు. అయితే పంప్ గ్రూపులుగా పిలిచే వీటిని రూపొందించడం ద్వారా బిట్ కాయిన్ ధరలను పెంచేందుకు ప్రయత్నించడం పట్ల అప్రమత్తంగా ఉండాలని లాస్‌వెగాస్ బిట్‌కాయిన్ ఎక్స్ఛేంజ్ బిట్రెక్స్ హెచ్చరించింది. ధరలు పెరిగేలా చూసేందుకు ప్రయత్నించే వారి ఖాతాలను నిషేధిస్తామని ఎక్స్ఛేంజ్ పేర్కొంది. పెద్ద పెద్ద సంస్థలు బహిరంగ మార్కెట్‌లోకి వెళ్లడానికి బదులుగా పరస్పరం కొనుగోళ్ళ జరుపుతాయి. అంటే ధరలపై ఈ లావాదేవీల వల్ల ఎలాంటి ప్రభావం వుండదు. సాధారణ పెట్టుబడిదారులకు ఈ తరహా సమాచారం అందడానికి ఎలాంటి అవకాశం వుండదు. దాంతో వారికి ఈ వేల్స్ (పెద్ద మొత్తంలో బిట్‌కాయిన్లు కలిగివుండే పెట్టుబడిదారులను వేల్స్-తిమింగలాలు గా పిలుస్తున్నారు.) ఆలోచనలు, పథకాలు, ప్రణాళికలు ఏమీ తెలియకుండా పోతాయి. ఈ క్రిప్టో కరెన్సీ లేదా డిజిటల్ కరెన్సీ మార్కెట్‌లో ఎలాంటి పారదర్శకత వుండదు. ఏం జరుగుతోందో తెలుసుకోవడం కూడా కష్టసాధ్యమవుతుందని ఈ విషయాలపై ప్రత్యేకంగా దృష్టి సారించిన లాయర్ మార్టిన్ ముష్కిన్ వ్యాఖ్యానించారు. చిన్న మొత్తంలో బిట్‌కాయిన్లు కొనుగోలు చేసిన సాధారణ పెట్టుబడిదారులు ప్రస్తుతం అధ్వాన్న స్థితిలో వున్నారని బ్లాక్‌చెయిన్ కేపిటల్‌లో రీసెర్చ్ హెడ్ స్పెన్సర్ బొగర్ట్ పేర్కొన్నారు. వేల్స్ ఒక్కసారిగా తమ వద్ద వున్న బిట్‌కాయిన్లు విక్రయించి మార్కెట్ కుప్పకూలుస్తారా లేక వాటిని తమ వద్దే వుంచుకుని మరింత ఆదాయం సంపాదిస్తారా అనే అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సాంప్రదాయ మార్కెట్లలో పరిస్థితి ఎలా వుంటుందో అలాగే వుంటుందని కొంతమంది విశ్లేషకులు పేర్కొంటున్నారు.

సంక్షిప్తం

జిగ్నేష్ మేవాని, ఉమర్ ఖలిద్‌పై కేసు నమోదు

పుణె : కొత్తగా ఎన్నికైన గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్ మేవాని, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ(జెఎన్‌యు) విద్యార్థి నేత ఉమర్ కలీద్‌పై పుణె పోలీసులు కేసు నమోదు చేశారు. డిసెంబర్ 31న శనివార్వాడా పోర్టు వద్ద 'ఎల్గార్ పరిషద్' సమావేశంలో రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తూ, రెండు వర్గాల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారన్న ఆరోపణలపై ఐపిసి సెక్షన్ 153, 505, 117 క్రింద విషమ్‌భాగ్ వాడ పోలీస్ స్టేషన్‌లో వారిపై కేసు నమోదు చేశారు. జనవరి 2 వ తేదీన డెక్కన్ జింఖానా పోలీస్ స్టేషన్లో నమోదైన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసును దాఖలు చేశారు.

బాలికలు మధ్యలోనే చదువు ఆపేస్తున్నారు: ఛాయావర్మ

న్యూఢిల్లీ : బాలికలు సెకండరీ విద్యతోనే చదువులు ఆపేస్తున్నారని కాంగ్రెస్ సభ్యురాలు ఛాయావర్మ రాజ్యసభలో ప్రశ్నించారు. దీనిపై హెచ్‌ఆర్‌డి మంత్రి ప్రకాష్ జవదేకర్ మాట్లాడుతూ బాలికలు చదువు ఆపేయడానికి ప్రధాన కారణం టాయిలెట్లు లేకపోవడమేనని, వాటిని నిర్మిస్తున్నామని తెలిపారు.

ఆఫ్ఘనిస్తాన్ స్థావరాలపై 57,800 దాడులు చేసారన్న పాక్

ఇస్లామాబాద్ : తమ దేశ స్థావరాల నుండి ఆఫ్ఘనిస్తాన్‌పై సుమారు 57, 800 దాడులను నిర్వహించారని పాకిస్తాన్ విదేశాంగ మంత్రి కవాజా మెహమ్మద్ ఆసిఫ్ ట్విటర్ ద్వారా పేర్కొన్నారు. ఉగ్రవాదంపై అమెరికా యుద్ధంలో ఇస్లామాబాద్ చేసిన సేవలను బుధవారం గుర్తు చేసుకున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాకిస్తాన్‌ను ఉద్దేశించి ఉగ్రవాదాన్ని అణచివేయకపోతే మీకు అనవసరంగా పంపిస్తున్న 2.19 లక్షల కోట్ల నిధులను ఆపివేస్తానని ప్రకటించిన తర్వాత కవాజ్ అమెరికాపై విరుచుకుపడ్డారు. అమెరికాను గుడ్డిగా నమ్మకూడదని చరిత్ర తమకు పాఠం నేర్పిందని పేర్కొన్నారు. తమ దేశం నుండే ఆయుధాలను, పేలుడు పదార్థాలను సరఫరా చేశారని, వాషింగ్టన్ తమ సొంత ఆర్థిక వ్యవస్థతో ఆఫ్ఘనిస్తాన్ పతనానికి దోహదపడిందని పేర్కొన్నారు.

అమెరికాలో 'బాంబ్' తుపానుకు 11 మంది మృతి

వాషింగ్టన్ : అమెరికాలో బాంబు తుపానుకు 11 మంది బలయ్యారు. ఎముకలు కొరికే చలితో అమెరికా తూర్పు ప్రాంతం వణికిపోతోంది. అమెరికాలోని 24 తీర ప్రాంతాల్లో తుఫాను బీభత్సం సృష్టించే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. పలు ప్రాంతాల్లో నీరు గడ్డకట్టిపోతోంది. నయాగరా జలపాతం కూడా గడ్డకట్టుకుపోయింది. బాంబ్ తుపాను గురువారం మరింత విరుచుకుపడనుందని వెల్లడించారు. అమెరికా ఈశాన్య ప్రాంతంలో 6 నుంచి 12 అంగుళాల మేర మంచుపడుతోందని, గంటకు 64 నుంచి 96 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని జాతీయ వాతావరణ కేంద్రం పేర్కొంది.



విద్యాబోధన

అశక్తులు, పాఠశాలలకు వెళ్ళలేని బాలల కోసం క్యూబా ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేక విద్యా పథకం పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న బాలలు

ఇల్లే పాఠశాల

క్యూబాలో కొత్తపుంతలు తొక్కుతున్న ప్రత్యేక విద్యాబోధన

హవానా : దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న ఏంజెలికాకు ఇప్పుడు ఇల్లే క్లాస్‌రూమ్‌గా మారిపోయింది. విద్యార్జనపై అమిత మక్కువ చూపే ఏంజెలికా స్కూల్‌కు వెళ్లే పరిస్థితి లేకపోవటంతో ఆమె టీచర్, కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి ఆమెకు ఇంటిలోనే క్లాస్‌రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఇది కేవలం ఒక ఏంజెలికా ఉదంతం మాత్రమే కాదు. క్యూబాలో స్కూళ్లకు వెళ్లలేని వారి కోసం అక్కడి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేక విద్యాబోధన కొత్త పుంతలు తొక్కుతోంది. ఈ విధానంతో అనేక మంది విద్యార్థులకు ఇళ్లే పాఠశాలగా మారుతోంది. దీర్ఘకాలిక వ్యాధి పీడితులు, వికలాంగులు, స్కూళ్లకు వెళ్లలేని వారి కోసం క్యూబా ప్రత్యేక విద్యాబోధన కొనసాగిస్తోంది. అందరికీ విద్యను అందుబాటులోకి తెచ్చి మానవతా సూత్రాలను బోధించాలన్న ఆశయానికి అనుగుణంగా క్యూబా ప్రభుత్వం 1962లో ఈ ప్రత్యేక విద్యా విభాగాన్ని ఏర్పాటు చేసింది. విద్యారంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేసే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ విభాగం కాలానుగుణంగా తన పద్ధతులను మార్చుకుంటూ లక్ష్యసాధన దిశగా అడుగులు వేస్తోంది.



యెమెన్ మాజీ అధ్యక్షుడి మేనల్లుడు బతికేవున్నారు !

మారిబ్ గిరిజనుల వెల్లడి

సానా : మరణించిన యెమెన్ మాజీ అధ్యక్షుడు అలీ అబ్దుల్లా సలేహ్ మేనల్లుడు, ప్రెసిడెన్షియల్ గార్డ్ కమాండర్ తారిక్ అబ్దుల్లా సలేహ్ జీవించే వున్నారని మారిబ్ ప్రావిన్స్‌లోని గిరిజన వర్గాలు తెలిపాయి. ఆయన గతంలో మరణించినట్లు వార్తలు వచ్చాయి. డిసెంబరు 4వ తేదీన మాజీ అధ్యక్షుడు హత్య చేయబడిన దాడిలోనే తారిక్ కూడా గాయపడ్డారని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫోటో పాతదని సంబంధిత వర్గాలు చెప్పాయి. డిసెంబరు 7వ తేదీన తారిక్ తన అనుచరులతో కలిసి సానా నుండి మారిబ్‌కు వచ్చారని ఆ వర్గాలు ధృవీకరించాయి. మారిబ్‌లోని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)కి విశ్వసనీయమైన వర్గాలు తారిక్‌కు ప్రత్యేక విమానం ఏర్పాటు చేసి అక్కడ నుండి యుఎఇకి వచ్చేలా సహకరించాయని ఆ వర్గాలు తెలిపాయి. అయితే తారిక్ ఇంకా ఇప్పటికీ యుఎఇలోనే వున్నారా లేదా అనేది వెల్లడించలేదు. యెమెన్ మాజీ అధ్యక్షుడి కుమారుడు అహ్మద్‌కు రాజకీయ అవకాశం కల్పించేందుకు యుఎఇ, సౌదీ అరేబియాలు ప్రయత్నించాయి కానీ అహ్మద్ అందుకు సిద్ధంగా లేకపోవడంతో ఆ రెండు దేశాల చూపు తారిక్ వైపునకు మళ్ళింది.

క్రమశిక్షణ తప్పినందునే తొలగింపు



ట్రంప్-బేనన్ వివాదంలో వైట్‌హౌస్ న్యాయవాదులు

వాషింగ్టన్ : క్రమశిక్షణ తప్పి గోప్యంగా వుండే విషయాలను బయటపెట్టటం వల్లే మాజీ వ్యూహకర్త స్టీవ్ బేనన్‌ను అధ్యక్షుడు ట్రంప్ దూరంగా పెట్టినట్లు ట్రంప్ తరపు న్యాయవాదులు బేనన్‌కు రాసిన లేఖలో వెల్లడించారు. ఒక పుస్తక రచయితకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బేనన్ మాట్లాడుతూ అధ్యక్షుడు ట్రంప్ అసలు ఈ పదవికి పోటీ చేయాలనుకోలేదని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. గోప్యంగా వుంచాల్సిన విషయాలను బహిర్గతం చేసి అధ్యక్షుడి ప్రతిష్టను దెబ్బతీసే విధంగా వ్యవహరించినందు వల్లే బేనన్‌ను దూరంగా పెట్టినట్లు ఈ లేఖలో పేర్కొన్నారు. ట్రంప్ అధ్యక్ష పదవికి పోటీ చేయాలనుకోలేదంటూ బేనన్ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ట్రంప్ బేనన్ తన పదవి కోల్పోయిన తరువాత మతిని కూడా కోల్పోయాడని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ట్రంప్, ఆయన కుటుంబ సభ్యుల వ్యక్తిగత అంశాలపై బహిరంగ వ్యాఖ్యలు చేయటం ద్వారా ఆయన తన నియామక ఒప్పంద షరతులను ఉల్లంఘించి క్రమశిక్షణ తప్పారని, అందువల్లే ట్రంప్ ఆయన్ను పదవి నుండి తొలగించారని ట్రంప్ తరపు న్యాయవాదులు తమ లేఖలో పేర్కొన్నారు.

ఇరువురు డెమోక్రటిక్ సెనెటర్లు ప్రమాణం




డౌగ్ జోన్స్

వాషింగ్టన్ : డెమోక్రటిక్ సెనెటర్లు ఇరువురు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో ఇప్పటికే ఎగువ సభలో తక్కువగా వున్న రిపబ్లికన్ల మెజారిటీ ఇంకా తగ్గిపోయింది. అలబామాకి చెందిన డౌగ్ జోన్స్, మిన్నెసోటాకి చెందిన టినా స్మిత్‌లచే అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ ప్రమాణం చేయించారు. కొత్త సంవత్సరంలో అమెరికా సెనెట్ సమావేశం కాగానే ఈ ప్రమాణ స్వీకారం జరిగింది. దీర్ఘకాలంగా రిపబ్లికన్లకు గట్టి పట్టు వున్న అలబామాలో ఈసారి డెమోక్రాట్లు విజయం సాధించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. సెనెట్‌లో రిపబ్లికన్ల సంఖ్య 51 నుండి 49కి పడిపోయింది. ఇటీవల వెల్లువెత్తిన లైంగిక వేధింపుల ఆరోపణలు కారణంగా అమెరికాలో రాజకీయ నేతలతో సహా పలువురు ప్రముఖులు తమ పదవులను కోల్పోయారు. ఆ నేపథ్యంలోనే అలబామాలో రాయ్‌మూర్‌పై జోన్స్ గెలుపొందారు. గత 25ఏళ్ళలో మొదటిసారిగా అలబామా, డెమోక్రాట్ అభ్యర్థిని గెలిపించింది. మిన్నెసోటాలో మాజీ డెమోక్రటిక్ సెనెటర్ అల్ ఫ్రాంకెన్ స్థానంలో టిన్ స్మిత్ గెలుపొందారు. ఫ్రాంకెన్‌పై కూడా లైంగిక వేధింపులు ఆరోపణలు వచ్చాయి.

ఈక్వెటోరియల్ గినియా ప్రభుత్వ కూల్చివేతకు కుట్ర

భగ్నం చేశామన్న ప్రభుత్వం



మలబో : ఆఫ్రికాలోనే సుదీర్ఘకాలం పదవిలో వున్న టెడెరో ఒబియాంగ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా డిసెంబరు చివరిలో కుట్ర ప్రయత్నాన్ని భగ్నం చేసినట్లు ఈక్వెటోరియల్ గినియా ప్రకటించింది. క్రిస్మస్ పండుగకు ముందుగా చాద్, సూడాన్, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ దేశాలకు చెందిన 30మంది సాయుధ కార్యకర్తలు ప్రతిపక్ష బలగాల మద్దతుతో ప్రభుత్వానికి వ్యతిరకంగా కుట్ర పన్నేందుకు ప్రయత్నించారని ప్రభుత్వం ఆరోపించింది. ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొంతమంది తీవ్రవాద శక్తులు ఈ కిరాయి సైనికులను నియమించారని ప్రభుత్వ భద్రతా వ్యవహారాల మంత్రి ఒబామా ఎన్‌చామా తెలిపారు. అయితే ఈ కుట్రలో పాల్గొన్నారని భావిస్తున్న ప్రతిపక్ష గ్రూపులు లేదా విదేశీ శక్తులేవి అన్న వివరాలు మంత్రి వివరించలేదు. సరిహద్దు సమీపంలో కిరాయి మూకలతో ప్రభుత్వ బలగాలు పోరు సల్పాయని, ఈ పోరులో ఒక వ్యక్తి మరణించినట్లు తెలుస్తోంది. డిసెంబరు 27-28 మధ్య రాత్రిలో పోరు చోటు చేసుకుందని చెప్పారు. చాద్‌కి చెందిన సైనిక జనరల్‌ను కామెరూన్, గినియాల మధ్య కామెరూన్ పోలీసులు అరెస్టు చేశారు. వెంటనే సరిహద్దులను మూసివేయాల్సిందిగా అధ్యక్షుడు ఒబియాంగ్ ఆదేశాలు జారీ చేశారు.

ఇరాన్ ప్రభుత్వానికి మద్దతుగా ప్రదర్శనలు

టెహ్రాన్ సహా పది నగరాల్లో భారీ ప్రదర్శనలు



అశాంతి, అటెహరాన్ : ఇరాన్ ప్రభుత్వానికి మద్దతుగా బుధవారం భారీ ప్రదర్శనలు నిర్వహించారు. టెహ్రాన్ సహా పది ప్రధాన నగరాల్లో జరిగిన ఈ భారీ ప్రదర్శనల్లో లక్షలాది మంది ప్రజలు పాల్గొన్నారు. గత వారం రోజులుగా ఇరాన్‌లో జరిగిన ప్రభుత్వ వ్యతిరేక ర్యాలీలను ఖండిస్తూ ఈ ప్రదర్శనలు చోటు చేసుకున్నాయని ప్రభుత్వ మీడియా పేర్కొంది. ప్రభుత్వ అనుకూల బ్యానర్లు చేబూని, అమెరికా, ఇజ్రాయిల్, సౌదీ అరేబియాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వేలాదిమంది ప్రజలు ప్రదర్శనలు నిర్వహించారు. ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలను ఒక్కసారి కూడా ప్రసారం చేయని ప్రభుత్వ మీడియా ఈ ర్యాలీలకు విస్తృత ప్రచారమిచ్చింది. కాగా గత వారం రోజుల్లో ర్యాలీల సందర్భంగా చెలరేగిన ఆందోళనల్లో 22మంది మరణించారు. బుధవారం ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) అధిపతి జనరల్ మహ్మద్ అలీ జఫారీ మాట్లాడుతూ దేశంలో అశాంతి, ఆందోళనలు ముగిశాయని ప్రకటించారు. దేశంలో అరాచకం సృష్టించాలని భావించే ఆందోళనకారులను పెద్ద సంఖ్యలో అరెస్టు చేశామని, వారిపై కఠిన చర్యలు వుంటాయని పేర్కొన్నారు. మొత్తంగా 530 మందిని అరెస్టు చేశామని అంతకుముందు ప్రభుత్వ మీడియా తెలిపింది. ఒక్క రాజధానిలోనే 450మందిని అరెస్టు చేయగా మరో 80మందిని అరక్ నగరంలో అరెస్టు చేశామని తెలిపింది.

నైజీరియాలో మసీదుపై ఆత్మాహుతి దాడి

12 మంది మృతి



గాంబొరు : ఈశాన్య నైజీరియాలో మసీదుపై గురువారం జరిగిన ఆత్మాహుతి దాడిలో 11మంది మరణించారు. ఉదయం ప్రార్థనలకు భక్తులు హాజరైనపుడు ఈ దాడి జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దాడిలో మసీదు ధ్వంసమైందని, దగ్ధమైందని సహాయ కార్యకర్త తెలిపారు. ప్రార్థనలకు వెళతుండగా మసీదు లోపల నుండి పెద్ద శబ్దంతో పేలుడు వినిపించిందని చెప్పారు. ఈ ఘటనలో దాడికి పాల్పడిన వ్యక్తితో సహ 12మంది మరణించారు. కాగా, ఈ దాడికి తమదే బాధ్యత అని ఇంతవరకు ఏ సంస్థ ప్రకటించలేదు. అయితే, దాడి జరిగిన పద్ధతి చూస్తుంటే బొకో హారం పనే అని అనిపిస్తోంది. 2009 నుండి ఈశాన్య నైజీరియాలో బొకో హారం గ్రూపు సాయుధ పోరాటం చేస్తోంది. ఈ పోరులో ఇప్పటివరకు 20వేల మంది మరణించారు. 26లక్షల మంది నిర్వాసితులయ్యారు. కామెరూన్‌తో గల సరిహద్దు సమీపంలో బొర్నో రాష్ట్రంలోని గాంబొరు పట్టణంలో ఈ దాడి జరిగింది. ఈ ప్రాంతంలో గతంలో బొకో హారం అనేక దాడులకు పాల్పడింది.

మొదటి పేజీ తరువాయి

రాజధానికి మరో రూ.1484 కోట్ల రుణం

సూచించింది. దీనిపై మరోసారి భేటీ అయిన నీతీ అయోగ్ గ్రీన్‌సిటీపై చర్చించింది. ఈసారి కూడా లిఖితపూర్వక ప్రతిపాదనలు సకాలంలో సమర్పించడంలో అధికారులు విఫలమయ్యారు. కేవలం ప్రతిపాదనల్లోని అంశాలను మౌఖికంగా వివరించి చెప్పారు. దీంతో కొంతవరకు సానుకూలంగా స్పందించిన నీతీ అయోగ్ రుణం ఇచ్చేందుకు నిర్ణయించింది. అయితే అవసరమైన పత్రాలను వెంటనే సమర్పించాలని, వాటిని కేంద్రంలోని సంబంధిత శాఖలకు కూడా పంపించి, ఆ తరువాత ప్రపంచ బ్యాంకుకు పంపిస్తామని పేర్కొంది.

గతంలో చేసిన ప్రతిపాదనల్లో పచ్చనగరానికి కృష్ణా నీటిని వాడుకునేందుకు రాష్ట్రం నిర్ణయించగా, దానిని కేంద్రం విభేదించింది. దీనివల్ల ఇతర అవసరాలకు ఇబ్బందులు తలెత్తుతాయని వ్యాఖ్యానించింది. అంతే కాకుండా కృష్ణా జలాల విషయంలో తెలంగాణ, ఆంధ్రా మధ్య విభేదాలు తలెత్తే ప్రమాదం కూడా ఉందని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. అందుకే భూగర్భ జలాలను వినియోగించుకోవాలని సూచించింది. రాజధాని నగరంలో గ్రీన్, బ్లూ మాస్టర్ ప్లాన్లు ఒకదానికొకటి అనుసంధానం కలిగి ఉండాలని, ఆ విధంగా ప్రతిపాదనలు సమర్పించాలని కూడా సూచించింది. ఈ సూచనలను పాటించి, సవరణ ప్రతిపాదనలను తయారు చేస్తామని అప్పట్లోనే కేంద్రానికి రాష్ట్ర అధికారులు హామీనిచ్చారు.

త్వరలో 2.50 లక్షల గృహ ప్రవేశాలు

లబ్ధిదారులకు రూ.342.72 కోట్ల ఆస్తులు, ఇళ్లు, కొండపోడు పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పితాని సత్యనారాయణ, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి కిమిడి కళా వెంకటరావు, జెడ్‌పి చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు, కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, జాయింట్ కలెక్టర్ కె.వి.ఎన్ చక్రధరబాబు పాల్గొన్నారు.

ముందస్తు అక్రమ అరెస్టులు

సిఎం పర్యటన నేపథ్యంలో సమస్యపై నిలదీస్తారనే భయంతో పోలీసులు ముందస్తు అక్రమ అరెస్టులకు పాల్పడ్డారు. బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చొద్దని గిరిజనులు దీక్షలు చేస్తుండటంతో ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పత్తిక కుమార్‌ను సీతంపేట మండలం పూతికవలసలో ఆయన ఇంటి వద్ద ముందస్తు అరెస్టు చేశారు. కొత్తూరు మండలం ఇరపాడు వంశధార నిర్వాసితులు, వైసిపి కార్యకర్తలు ఇద్దరిని అరెస్టు చేసి కొత్తూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇచ్ఛాపురంలో సిఎం సభకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న బెంతు ఒరియా నాయకులు నలుగురిని కంచిలి, కవిటి మండలాల్లో అరెస్టు చేశారు.

ఆధార్ భద్రత డొల్ల

చెల్లించగానే ఒక ఐడి, పాస్‌వర్డ్‌ను ఆ ఏజెంట్ అందచేశారు. ఈ ఐడి, పాస్‌వర్డ్‌తో లాగిన్ అయి 12 అంకెల ఆధార్ సంఖ్యను నమోదు చేస్తే, యుఐడిఎఐకి అందచేసిన వివరాలన్నీ వెల్లడవుతున్నాయి. ఒకసారి ఐడి, పాస్‌వర్డ్ అందుబాటులోకి వస్తే ఎవరి వివరాలైనా, ఎంతమంది వివరాలైనా ఈ పద్ధతిలో తెలుసుకోవచ్చు. మరో 300 రూపాయలు చెల్లిస్తే అదనంగా ఇంకో సాఫ్ట్‌వేర్‌ను ఆ ముఠా అందచేస్తోందని, దీని సహాయంతో ఆధార్‌కార్డ్ ప్రింట్‌కూడా వస్తోందని తెలిపింది. ఆధారాలతో సహా ట్రిబ్యునల్ వెల్లడించిన ఈ వివరాలు కలకలం రేపాయి.

ఆరు నెలల నుండి...

గోప్యంగా ఉంచాల్సిన ఆధార్ వివరాలను అంగట్లోకి చేర్చిన ఈ వ్యవహారం గుట్టుచప్పుడు కాకుండా ఆరునెలల నుండి సాగుతోందని ట్రిబ్యూన్ పేర్కొంది. ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక పరిజ్ఞానం మంత్రిత్వ శాఖ గ్రామస్థాయిలో కిరాయికి తీసుకున్న ఆపరేటర్ల పాత్ర కూడా ఇందులో వుందని తెలిపింది. ట్రిబ్యూన్ కథనం వెలువడిన వెంటనే చండీఘర్‌లోని ఆధార్ అథారిటీ అధికారులు బెంగళూరులోని యుఐడిఎఐ సాంకేతిక నిపుణులతో సంప్రదించారు.

యుఐడిఎఐ చండీఘర్ సెంటర్ అదనపు డైరెక్టర్ జనరల్ సంజయ్ జిందాల్ ట్రిబ్యూనతో మాట్లాడుతూ, "ఎవరైనా ఆధార్ సమాచారాన్ని ఇలా పొందితే అది చట్టవిరుద్ధమని అన్నారు. జాతీయ భద్రతా నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించడమే కాగలదని పేర్కొన్నారు.

సెర్చ్ టూల్‌ను దుర్వినియోగపరిచారు : యుఐడిఎఐ

ఆధార్ ఇబ్బందులను పరిష్కరించడం కోసం సంబంధిత అధికారులకు 'సెర్చ్ టూల్' నొకదాన్ని అందచేశామని యుఐడిఎఐ తెలిపింది. ఈ టూల్‌ను ఉపయోగించిన ప్రతీసారీ ఆ వివరాలు నమోదు చేస్తుంటామని చెప్పింది. ఇప్పుడు ట్రిబ్యూన్ వెల్లడిచేసిన వివరాల ప్రకారం ఆ సౌకర్యాన్ని దుర్వినియోగం చేసి వున్నట్లు కనిపిస్తోందని పేర్కొంది. ఇందులో ప్రమేయమున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఎఫ్ఐఆర్ దాఖలు చేస్తామని తెలిపింది.

తెల్లకార్డుల రద్దుకు యత్నం..!

- రేషన్ తీసుకోని వారి లెక్క తేల్చాలని ఆదేశాలు
- క్షేత్ర స్థాయి విచారణతో నివేదికలివ్వాలని సూచన



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతి నెలా క్రమం తప్పకుండా చౌక ధరల దుకాణంలో రేషన్ తీసుకోని వారి జాబితాను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. వారి గురించి క్షేత్ర స్థాయిలో విచారణ చేసి నివేదికను ఇవ్వాలని కోరింది. దీంతో పౌర సరఫరాల అధికారుల ఇప్పుడీ పనిలో నిమగ్నమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.40 కోట్ల కుటుంబాలకు రేషన్ కార్డులున్నాయి. వాటిలో ప్రతి నెలా దాదాపు 20 లక్షల కార్డుదారులు రాయితీ బియ్యం తీసుకోవడం లేదని అంచనా. గతేడాది నిర్వహించిన పల్స్ సర్వే ఆధారంగా ఆ కార్డుదారులంతా ఆదాయం ఎక్కువగల వారిగా లెక్క తేల్చారు. కానీ వారిలో పలువురు ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారున్నారు.

రేషన్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోని వారూ ఉన్నారు. ఇ-పోస్ పరికరాల్లో వేలిముద్రలు సరిగ్గా పడని వారు, వయసు మీరిన, ఒంటరిగా ఉన్న వారు.. ఇలా ఆ 20 లక్షల్లో పలువురు అల్పాదాయాల వారూ ఉన్నారు. ప్రతినెలా రేషన్ షాపు వరకు నడవడానికి వీల్లేకుండా ఉన్న వారు ఉంటారు. విశాఖ, తూర్పుగోదావరి, గుంటూరు జిల్లాల్లో ప్రతి నెలా 2 లక్షల నుంచి 3 లక్షల కుటుంబాల వారు రేషన్ సరుకులు తీసుకోవడం లేదు. ఇబ్బందుల్ని సరిచేసి రేషన్ కార్డున్న ప్రతి పేద కుటుంబానికీ సరుకులు పింపిణీ అయ్యేలా చూడాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. రేషన్ తీసుకోనివారంతా సంపన్నులేనని ఏకపక్షంగా నిర్ధారించేసి వారే రేషన్ తీసుకోవడం లేదని తేల్చేశారు. ఈ విధానంపై విమర్శలు వచ్చిన నేపథ్యంలో క్షేత్రస్థాయి విచారణ కూడా చేయాలనే ఆదేశాలు జారీ అయ్యాయి. వరుసగా మూడు నెలలపాటు రేషన్ తీసుకోనివారి వివరాల్ని తాజాగా సేకరిస్తున్నారు. నివేదిక అందిన తర్వాత ఆ రేషన్ కార్డులను రద్దు చేయాలా, కొనసాగించాలా? అనేది నిర్ణయిస్తామని ఒక ఉన్నతాధికారి వెల్లడించారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15 తేదీ వరకే రేషన్ షాపులు పనిచేస్తాయి. ఆలోగా సబ్సిడీ బియ్యం తీసుకుంటే సరి. లేదంటే ఆ నెలలో ఇక బియ్యం తీసుకునే పరిస్థితి లేకుండా పోతోంది. దీనికితోడు ప్రతినెలా మొదటివారంలో సర్వర్‌లో ఏర్పడుతున్న సాంకేతిక కారణాలవల్ల ఇ-పోస్ పరికరాలు పని చేయడంలేదు. దీంతో బియ్యం కోసం లబ్ధిదారులు రేషన్ షాపునకు వెళ్లినా ఫలితం దక్కటం లేదు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకోవాలని వివిధ కుటుంబాల వారు, ముఖ్యంగా తాత్కాలికంగా పనుల కోసం ఊరొదిలి వెళ్లిన వారు కోరుతున్నారు.

నరసరావుపేట కేంద్రంగా కిడ్నీ రాకెట్ ?

(మొదటి పేజీ తరువాయి)

దుర్గి మండలం ముటుకూరు తండాకు చెందిన మూడావత్ వెంకటేశ్వరనాయక్‌కు సంబంధించిన కిడ్నీలు తొలగించి గుంటూరుకు చెందిన శివనాగేశ్వరరావుకు అమర్చేంచేందుకు పట్టణానికి చెందిన దళారి రావూరి రవి చౌదరి ఆసుపత్రి వైద్యులతో రూ.లక్షల్లో బేరం కుదుర్చు కున్నట్లు తెలిసింది. అయితే నిబంధనల ప్రకారం కిడ్నీలు దానంగా ఇచ్చే వ్యక్తి సంబంధిత రోగికి బంధువై ఉండాలి. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులు ధ్రువీకరించాలి. లేదా ఇతరులెవరైనా దానం చేయాల్సి వస్తే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఆమోదం పొందాలి. గుంటూరులోని వేదాంత ఆసుపత్రిలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న శివనాగేశ్వరరావుకు తాను బంధువునంటూ, తన కిడ్నీని ఆయనకు దానం ఇచ్చేందుకు ఫ్యామిలీ మెంబర్, రెసిడెన్సీ సర్టిఫికెట్ కోసం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అర్జీ అందజేశారు. అయితే ఈ అర్జీని స్థానిక బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపిలవాయి విజయ్‌కుమార్ స్వయంగా తహశీల్దార్‌తో ఫోనులో సంప్రదించి డ్రైవర్ ద్వారా అందజేసినట్లు తహశీల్దార్ విజయజ్యోతికుమారి మీడియాకు తెలిపారు. గుంటూరులోని వేదాంత ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ చింతా రామకృష్ణ కపిలవాయి విజయ్‌కుమార్‌కు స్వయాన అల్లుడు. ఇదిలా ఉండగా తహశీల్దార్ కార్యాల యంలో ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్ కోసం అందజేసిన అర్జీలోని ఆధార్ కార్డులో రావూరి రవిచౌదరి ఫొటోకు బదులు వెంకటేశ్వర్ల నాయక్ ఫొటోను మార్పింగ్ చేసి అందజేశారు. యథాతథంగా తహశీల్దార్ కార్యాలయం వారు ఆ సర్టిఫికెట్‌ను పరిశీలించినట్లు రికార్డుల్లో నమోదు చేసుకొని జారీ చేశారు. కిడ్నీ మార్పిడికి సంబంధించిన ఈ సర్టిఫికెట్లను పోలీసులూ ధ్రువీకరించాల్సి ఉంది. రెవెన్యూ కార్యాలయంలో గుట్టుచప్పుడు కాకుండా పనిచేయించుకున్న దళారులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ధ్రువీకరణకు వెళ్లారు. పోలీసులు తమ వద్ద ఉన్న ఆధార్ బార్ కోడింగ్ యాప్‌లో దరఖాస్తు దారుని పేరు, చిరునామాలను పరిశీలించగా అది తప్పుడు ధ్రువీకరణని తేలింది. ఈ విషయాన్ని పోలీసులు తిరిగి తహశీల్దార్ కార్యాలయానికి సమాచారం అందించగా ఆత్మరక్షణలో పడ్డ తహశీల్దార్ విజయ జ్యోతికుమారి సదరు అర్జీదారులపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఇప్పటికే నరసరావుపేట తహశీల్దార్ కార్యాలయం నుండి జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లతో గుంటూరులోని వేదాంత ఆసుపత్రిలో ముగ్గురికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. నరసరావుపేట తహశీల్దార్ కార్యాలయం నుండి వరుసగా సర్టిఫికెట్లు జారీ కావడం, వేదాంత ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జరగడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కిడ్నీ రాకెట్‌తో మాకు సంబంధం లేదు

- వేదాంత హాస్పటల్ ఎండి చింతా రామకృష్ణ

కిడ్నీ రాకెట్‌తో వేదాంత హాస్పటల్‌కు సంబంధం లేదని ఎమ్‌డి డాక్టరు చింతా రామకృష్ణ తెలిపారు. గురువారం చింతా రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ.. గుంటూరు నగరానికి చెందిన చిగురుపాటి శివనాగేశ్వరరావు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ చికిత్స కోసం రెండేళ్ల కిందట వేదాంత హాస్పటల్‌కు వచ్చాడని, గతనెల 22న కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం తమ హాస్పటల్‌కు వచ్చాడని చెప్పారు. అతని ఆరోగ్య పరిస్థితి సరిగా లేనందున హాస్పటల్‌లో అతనికి చికిత్స చేసి పంపించామని, రక్తసంబంధీకులయితేనే కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటే షన్ చేస్తామని చెప్పగా, రక్తసంబంధికులు ఎవరూ లేరని శివనాగేశ్వరరావు సమాధానమిచ్చారని పేర్కొన్నారు. దీంతో రెవెన్యూ, పోలీస్ డిపార్టుమెంట్ల నుంచి అనుమతి పత్రం తెచ్చుకుంటేనా ట్రాన్స్‌ప్లాంటేషన్ చేస్తామని చెప్పి పంపించామన్నారు. అతనికి దీనికి సంబంధించిన ఒక లేఖ ఇచ్చాం. ఇదంతా పది రోజుల కిందటజరిగిందని, అతను విజయవాడలోని ఆయుష్ హాస్పటల్‌లో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను కొద్ది రోజుల కిందట చేయించుకున్నట్లు తెలిసిందని చెప్పారు. శివనాగేశ్వరరావుకు తమకు డాక్టరుకు, పేషంట్‌కు ఉన్న సంబంధమేనని, ఆపద సమయంలో చికిత్స చేశామే గాని శివనాగేశ్వరరావు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయలేదని చెప్పారు. నరసరావుపేటకు చెందిన తమ మామ కపిలవాయి పేరును పోలీసులు ఎఫ్ఐఆర్‌లో ఎందుకు చేర్చారో తనకు తెలియదన్నారు.

తలాక్‌పై తేల్చని రాజ్యసభ

(మొదటి పేజీ తరువాయి)

బిల్లు ముందుకు తీసుకొచ్చి అడ్డుకోవడం విశేషం. సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో ట్రిపుల్ తలాక్ బిల్లుపై సభలో చర్చకు పెట్టారు. కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ ప్రారంభిస్తూ కాంగ్రెస్ సభ్యులు ఆనంద్ శర్మ, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు సుఖేందు శేఖర్ రాయ్ బుధవారం ప్రతిపాదించిన సవరణ తీర్మానాలు నిబంధనలకు అనుగుణంగా లేవని, వాటిని తిరస్కరించాలని ఛైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. జైట్లీ ప్రకటనపై ప్రతిపక్ష సభ్యులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సెలెక్ట్ కమిటీ పరిశీలనకు బిల్లును పంపాల్సిందేనని డిమాండ్ చేశారు. సభలో ఏకాభిప్రాయం లేనందున ట్రిపుల్ తలాక్ బిల్లుపై చర్చను కొనసాగించలేమని, షెడ్యూలు ప్రకారం జాబితాలోని తదుపరి అంశమైన జిఎస్‌టి సవరణ బిల్లుపై చర్చ చేపట్టాలని రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ ప్రకటించారు. అయితే బుధవారం ప్రారంభమైన చర్చ పూర్తవ్వాల్సిందేనని ఆనంద్ శర్మ డిమాండ్ చేశారు. ట్రిపుల్ తలాక్ బిల్లుపై కాకుండా మరో బిల్లును చేపట్టడంపై ఆయన అభ్యంతరం తెలిపారు. ప్రభుత్వం అందుకు నిరాకరించడంతో ప్రతిపక్ష సభ్యుల నిరసనల మధ్య సభ శుక్రవారం ఉదయం 11 గంటలకు వాయిదా పడింది. రాజ్యసభ వాయిదా అనంతరం కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్ష సభ్యులంతా ఏకతాటిపై నిలవడంతో ప్రభుత్వమే ఏకాకిగా మిగిలిపోయిందన్నారు. ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీ పరిశీలినకు పంపాల్సిందేన డిమాండ్ చేశారు.

'పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు' పై సుప్రీం నోటీసులు

విచారించేందుకు అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలి. 10 కంటే తక్కువ మంది ఉద్యోగులతో పనిచేసే సంస్థలు లేదా యజమానే నిందితుడైతే, జిల్లా అధికారులు చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం ఫిర్యాదులను స్వీకరించడానికి 'స్థానిక కమిటీ'లను ఏర్పాటు చేయాలి.

జిగిషా హత్య కేసులో ఇద్దరికి శిక్ష కుదింపు

న్యూఢిల్లీ : ఐటి వృత్తినిపుణురాలు జిగిషా ఘోష్ (28) హత్య కేసులో దోషులైన రవి కపూర్, అమిత్ శుక్లాకు గతంలో కింది కోర్టు ప్రకటించిన మరణశిక్షను యావజ్జీవ శిక్షగా కుదిస్తూ ఢిల్లీ హైకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. ఇదే కేసులో మరొక దోషి అయిన బల్జీత్ మాలిక్‌కు విధించిన యావజ్జీవ శిక్షను ధర్మాసనం సమర్థించింది. 2009 మార్చి 18న ఢిల్లీలోని వసంత్ విహార్‌లో జిగిషా అపహరణకు గురైంది. కొన్నాళ్ల తర్వాత హర్యానాలోని సూరజ్‌కుంద్‌లో ఆమె మృత దేహాన్ని గుర్తించారు. వారంలోనే నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ట్రయల్ కోర్టు రవికుమార్‌కు, అమిత్ శుక్లాకు మరణదండన, బల్జీత్ మాలిక్‌కు యావజ్జీవ కారాగారశిక్ష ప్రకటిస్తూ తీర్పునిచ్చింది.

నయనతార, ప్రకాష్‌రాజ్ చేయకపోతే సినిమా తీసేవాడ్ని కాదు



సి. కళ్యాణ్

"సంక్రాంతికి సింహం రాబోతుంది. ఈరోజు సెన్సార్ కాబోతుంది. సరైన సమయంలో బాలకృష్ణ సినిమా చేయమనడం, రత్నంగారి కథ ఇది. అయితే ముందుగా ఓ కథను అనుకున్నాం. కానీ అది చేయడం ఇష్టంలేక.. తర్వాత విన్న కథ ఇది. కథ ప్రకారం నయనతార, ప్రకాష్‌రాజ్ చేయకపోతే సినిమా మానేద్దాం అని టీమంతా అనుకున్నాం. చిత్రం చూశాక.. అందరూ అదే భావిస్తారు. పతాక సన్నివేశంలో ప్రతి ఒక్కరూ నిలబడి క్లాప్స్ కొడతారు. అంతలా అందర్నీ ఇన్‌వాల్వ్ చేసే సినిమా అని" నిర్మాత సి. కళ్యాణ్ అన్నారు. బాలకృష్ణతో నిర్మించిన చిత్రం 'జై సింహ'. ఈ నెల 12న విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా గురువారంనాడు ఆయన మాట్లాడారు.

- ఇందులో మరో నాయిక 'పిల్ల జమిందార్' ఫేమ్ హరిప్రియ పాత్ర కీలకం. పాత్ర పరంగా ఆమెను ఎంపిక చేశాం. కానీ తను బొద్దుగా వుండడంతో ఆలోచించాం. విషయం తెలిసి తనే 20 రోజుల్లో నాజూగ్గా తయారైంది. కానీ మారిన పరిస్థితులవల్ల ఆమెతో చేయడం కుదరలేదు. అయినా తను కన్నడలో బిజీ నటిగా వుంది.
- దర్శకుడు కె.ఎస్. రవికుమార్ 'నరసింహ'తో నిరూపించుకున్నాడు. తను 'జై సింహ' చేయడం ఆనందంగా వుంది. పాటలు కూడా బాగా వచ్చాయి. 'అమ్మకుట్టీ..' సాంగ్‌లో బాలయ్య వేసిన స్టెప్‌లు ప్రత్యేకంగా వుంటాయి. యూత్ హీరోలస్థాయిలో ఎనర్జీగా చేశాడు. 'డిస్కోకింగ్'లో బాలయ్య ఎంత ఎనర్జీగా చేశాడో అంతలా ఇందులో చేశాడనిపిస్తుంది. చిరంజీవి, బన్నీ తరహాలో స్టెప్‌లు వేశాడు. నటాషా అనే మలయాళ తార 'అమ్మకుట్టీ' సాంగ్‌కు బాగా స్టెప్‌లేసింది. ఇందులో మరో కీలక పాత్ర పోలీసు ఆఫీసర్‌ది. దాన్ని పంజాబీకి చెందిన చీమ చేశాడు.
- ఇక బాలయ్య, నయనతార సక్సెస్ ఫుల్ కాంబినేషన్. ఈసారి కూడా సక్సెస్ అవుతుంది. నయనతారకు అసలు డేట్స్ లేవు. ముందు కుదరదు అన్నారు. కానీ కథ వినగానే ఓకే చెప్పి డేట్స్ సరి చేశారు. వారిద్దరి ట్రాక్ ఆడవాళ్లకే కాకుండా మగవాళ్లకు కూడా ఎంతగానో నచ్చుతుంది.
- బడ్జెట్ పరంగా ముందే ఎక్కువ ఖర్చు పెడదాం అనుకున్నాం. కానీ అనుకున్నదానికంటే ఎక్కువే పెట్టాల్సి వచ్చింది. ఔట్ పుట్ కూడా అంతే బాగా వచ్చింది.
- కథాపరంగా కుంభకోణం ఎపిసోడ్ కీలకం. 2వేల మంది పురోహితులతో ధర్నా వుంటుంది. పురోహితుడికి అవమానం జరిగితే వచ్చే రియాక్షన్ దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించారు. ఆలయ గర్భగుడికీ, తల్లి గర్భానికి సంబంధించిన డైలాగ్ బాలకృష్ణ చెప్పడం హైలైట్. ఈ చిత్రం చూశాక ప్రతీ బ్రాహ్మణుడు బాలయ్య అభిమాని అవుతారు. అలాగే వైజాగ్లో జరిగే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ ఇంకా మేజర్ హైలెట్. ఇక క్లైమాక్స్ ఎపిసోడ్ అయితే అందరూ లేచి చప్పట్లు కొట్టేలా ఉంటుంది.
- సంక్రాంతికి పోటీ ఉంది. కానీ ఈ సినిమాకు ఆ పోటీలో నిలబడే సత్తా ఉంది. చిత్రం ఫుల్ లెంగ్త్ మాస్ అండ్ కమర్షియల్ ఎంటర్‌టైనర్. తప్పక అందరికీ నచ్చుతుంది.
- ఈ చిత్రం తర్వాత సాయిధరమ్ తేజతో 'ఇంటెలిజెంట్' చిత్రం షూట్ జరుగుతోంది. ఫిబ్రవరి 9న రిలీజవుతుంది. అలాగే రానాతో కలిసి '1945' అనే సినిమా చేస్తున్నాను. రానా, రెజీనా, సప్తగిరి, సత్యరాజ్ కాంబినేషన్. హిందీ, తెలుగు, తమిళంలో చేస్తున్నాం.

మార్చి నుంచి సినిమాలు బంద్

- క్యూబ్, యుఎఫ్‌క్స్ పేరుతో నిర్మాతను ఇబ్బంది కల్గిస్తున్న తీరుపై చిత్రనిర్మాణాలు మార్చి 1 నుంచి బంద్ చేస్తున్నట్లు సి.కళ్యాణ్ స్పష్టం చేశారు. ఇది గట్టి నిర్ణయం. నిర్మాతలంతా కలిసి తీసుకున్న నిర్ణయమిదని పేర్కొన్నారు.
- ఒకప్పుడు సినిమా రీలు రూపంలో వుండేది. దాన్ని ఏ థియేటర్‌లోనైనా ప్రొజెక్టర్‌లో ప్రదర్శించే వీలుండేది. కానీ సాంకేతికంగా డిజిటల్ విధానం వచ్చాక క్యూబ్, యుఎఫ్.ఎక్స్ అనే విధానం రావడంతో వాటిని నడిపే వారు నిర్మాతను దోచేస్తున్నారు. ఆ సినిమా థియేటర్‌లో ప్రదర్శించాలంటే ప్రొజెక్టర్‌ను సాంకేతికతకు అనుగుణంగా ఓనర్ మార్చుకోవాలి. అలా కాకుండా ఆ భారమంతా నిర్మాతే భరించాలనేది సరైన పద్ధతికాదు. ఈ విషయంలోనే నిర్మాతలంతా ఏకధాటిపై నిలబడి మార్చి 1నుంచి నిర్మాణాలు బంద్ చేయాలని నిర్ణయించారు. ఇప్పుడు రన్నింగ్‌లో వున్న సినిమాలు మార్చి నాటికి పూర్తవుతాయి. అందుకనే ఆ గ్యాప్ తీసుకున్నాం. ఈ నిర్ణయానికి కట్టుబడి ఇప్పటికే కేరళ, కర్నాటక పరిశ్రమ సిద్ధమయింది. ఇటీవలే ఉత్తరాదిలో జరిగిన ఫిలింఫెడరేషన్ ఆఫ్ ఇండియా మీటింగ్‌లోనూ ఈ నిర్ణయంపై వారి సపోర్ట్ కూడా తీసుకున్నాం.
- జిఎస్‌టి. అనేది తెలుగు పరిశ్రమకు సరైందికాదు. సినిమా వ్యక్తిగత వ్యాపారం. నిర్మాత మరో వ్యాపారం చేసుకోలేడు. అందుకే జిఎస్‌టి అనేది కార్పొరేట్ వ్యాపారాలు చేసేవారికి సూటవుతుంది. ఉత్తరాదిలో సినిమా నిర్మాణం కార్పొరేట్ చేతుల్లో వుంటుంది. కనుక అది వారికి సరిపోతుంది.
- సినిమా వ్యాపారం వ్యక్తిగతం. ప్రభుత్వం నుంచి ఎటు వంటి సాయం వస్తుందనేది నేను అనుకోవడంలేదు. ఆన్‌లైన్ టిక్కెట్ విషయంలో ప్రభుత్వం తగినంతగా సహకరిస్తుంది.



"దేశభక్తి మాత్రమే కాక ప్రేమ, ఫ్యామిలీ అంశాలు, సమాజ కోణం అన్నీ సినిమాలో ఉంటాయి. సినిమా తప్పకుండా ప్రేక్షకుల్ని అలరిస్తుంది. 'బాహుబలి' తెలుగు సినిమా కీర్తిని ఎంతవరకు తీసుకెళ్ళిందో ఇది కూడా అలానే తీసుకెలుతుంది. ఈ సంవత్సరం పెద్ద విజయంగా నిలబడుతుందని" నిర్మాత లగడపాటి శ్రీధర్ తెలియజేశారు. అల్లు అర్జున్ హీరోగా వక్కంతం వంశీ దర్శకత్వంలో 'నా పేరు సూర్య' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్ర ఫస్ట్‌ఇంపాక్ట్ ఇటీవలే విడుదలై మంచి స్పందన తెచ్చుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

'బాహుబలి'లా పేరు తెస్తుంది



లగడపాటి శ్రీధర్

- ఇప్పటి వరకు బన్నీ అంటే ప్రేక్షకులకి ఎంత ప్రేమో విన్నాను. కానీ మా ఫస్ట్‌ఇంపాక్ట్‌కు వచ్చిన స్పందనతో అది ఎలా ఉంటుందో చూశాను. 29 గంటల్లో కోటి మందికి పైగా వీక్షించారు.
- అల్లు అర్జున్ ఒక పాన్ ఇండియా స్టార్. ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డారాయన. మేకోవర్, లుక్స్, టెక్నీషియన్స్ అన్ని విషయాల్ని వ్యక్తిగతంగా దగ్గరుండి చూసుకుంటారు. తెలుగు సినిమా ఖ్యాతిని పెంచడానికి బన్నీ చాలా ప్రయత్నం చేస్తుంటాడు. సినిమా సినిమాకి తన హార్డ్‌వర్క్ పెంచుతూ పైకెదిగే హీరో అమీర్ ఖాన్. ఆయన తర్వాత అలా చేసేది బన్నీయే అనేది నా నమ్మకం.
- మూడు బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్లు 'రేసు గుర్రం, టెంపర్, కిక్' వంటి చిత్రాల్లోని పవర్ మొత్తం ఈ ఒక్క సినిమాలో ఉంటుంది. వక్కంతం వంశీ తన టీమ్‌తో సినిమాను బాగా లీడ్ చేస్తున్నారు.
- ఇదొక యూనివర్సల్ సబ్జెక్ట్. ముందుగా మిగతా భాషల్లో కూడా డబ్ చేసి రిలీజ్ చేద్దామనే ఆలోచన ఉంది. కానీ బన్నీ త్వరలో తమిళంలో పరిచయంకానున్నారు. ఆ ఎంట్రీ డైరెక్ట్ తమిల్ సినిమాతోనే ఉంటే బాగుంటుందని చేయలేదు.
- చిత్రీకరణ 70 శాతం పూర్తైంది. ఇంకో 40 రోజుల్లో మొత్తం పూర్తవవుతుంది. మార్చి కల్లా సినిమా ఫస్ట్ కాపీ చేతికొస్తుంది. సమ్మర్‌కి ఖచ్చితంగా వస్తున్నాం. ఏప్రిల్ 27న తప్పకుండా రిలీజవుతుంది.
- యాక్షన్ చిత్రానికి ప్రధాన ఆకర్షణ. యాక్షన్‌లో కూడా ఎమోషన్ ఉంటుంది. కిచ్చ మాస్టర్, పీటర్ హెయిన్స్, రామ్ లక్ష్మణ్, రవివర్మ వంటి పెద్ద పెద్ద వాళ్ళు ఫైట్స్ కంపోజ్ చేశారు. ఫైట్స్ అన్నీ గొప్ప స్థాయిలో ఉంటాయి. ప్రతిదీ బెంచ్ మార్క్ ఫైట్‌లా ఉంటుంది.

సంక్రాంతికి వస్తున్నాం

రాజ్ తరుణ్



కుటుంబమంటే బాధ్యతలేని కుర్రాడు, కుటుంబమే బాధ్యతగా భావించే యువతి మధ్య జరిగే ప్రేమకథతో 'రంగుల రాట్నం' చిత్రం రూపొందింది. రాజ్‌తరుణ్, చిత్రాశుక్లా హీరోహీరోయిన్లుగా నటించారు. అన్నపూర్ణ స్టూడియోస్ బేనర్‌పై రూపొందింది. శ్రీరంజని దర్శకత్వం వహించారు. సంక్రాంతికి విడుదలకానున్న ఈ చిత్రం గురించి కథానాయకుడు రాజ్ తరుణ్ గురువారంనాడు అన్నపూర్ణ స్టూడియోలో మాట్లాడారు. మిడిల్ క్లాస్ అబ్బాయిగా నటించాను. ఇంతకుముందు చేసిన పాత్రలకంటే భిన్నంగా వుంటుంది. 'ఉయ్యాల జంపాలా' తర్వాత అన్నపూర్ణలాంటి సంస్థలో చేసిన రెండో సినిమా ఇది. అందమైన ప్రేమకథతోపాటు మదర్ ఎమోషన్స్ వుంటాయి. సంక్రాంతికి ఫ్యామిలీతో హాయిగా వచ్చి చూడొచ్చు. ఎంటర్‌టైన్‌మెంట్‌కూడా వుంటుంది. సంక్రాంతికి పెద్ద చిత్రాలు పోటీ వున్నా... మూడు, నాలుగు సినిమాలను ప్రేక్షకులు చూసే అవకాశముంది. గతంలో నిరూపితమయ్యాయి కూడా. అందుకే ఆ సమయంలోనే రావాలనుకున్నాం. సినిమా మొత్తం పూర్తయ్యాక సర్‌ప్రైజ్ చేయాలని చివరి నిముషంలో చిత్ర వివరాలు బయటపెట్టాం. ఇక కథప్రకారం జీవితాన్ని ఆవిష్కరించినట్లుండే కాన్సెప్ట్. అందుకే రంగుల రాట్నం పేరు పెట్టాం. ఈ కథ ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది. జీవితం తిరిగే రంగులరాట్నం. ఎక్కడ మొదలయిందో అక్కడికే తిరిగి రావాల్సివుంటుంది. ఆ కోణంలో టైటిల్ పెట్టాం. దర్శకురాలు శ్రీరంజని స్పురద్రూపి. బాగా డీల్ చేసింది. కథ కూడా చాలా అందంగా రాసుకుంది. సెల్వరాఘవన్ దగ్గర ఆమె పనిచేసింది. శ్రీచరణ్ సంగీతం అందించారు. ఆరు పాటలున్నాయి. మొదటిసారిగా పూర్తి సినిమాకు పనిచేసిన అవకాశం ఆయనకు వచ్చింది. రాక్‌మ్యూజిక్ మెలీడి బాగా చేశాడు. రీరికార్డింగ్ చిత్రానికి హైలైట్‌గా నిలుస్తుంది. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది. ఇందులో విలన్లు వుండరు. సన్నివేశాలే విలన్లు. 'కిట్టుగాడు'లో ఓ పాట రాశాను. అలాగే ఇందులో కూడా రాసే అవకాశం వచ్చింది. ప్రియదర్శి స్నేహితుడిగా నటించాడు. సితార తల్లిగా నటించింది' అని చెప్పారు. కొత్త చిత్రాలు చెబుతూ...ఈ ఏడాది ఖచ్చితంగా మూడు సినిమాలు విడుదలకు సిద్ధమయ్యాయి. 'రాజుగాడు' ఫిబ్రవరిలో విడుదలవుతుందని తెలిపారు.



అనుదీప్, ఆర్పి పట్నాయక్, సత్య యామిని, కోటి

సంగీతానికి సిద్ధం

ఆర్‌పి పట్నాయక్

గత కొంతకాలంగా సినిమా సంగీతానికి దూరంగా వున్న ఆర్.పి.పట్నాయక్ ఇకపై సినిమాలు చేయడానికి సిద్ధంగా వున్నానని ప్రకటించారు. 'నీతో ఏదో చెప్పాలని ఉంది' అంటూ ప్రైవేట్ ఆల్బమ్‌ను చేసిన ఆయన ఆ వివరాలను తెలియజేస్తూ... ఆ చెప్పేది ఇదేనంటూ చలోక్తి విసిరారు. హైదరాబాద్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. 2004లో జరిగిన ఓ సంఘటనతో సంగీతం చేయనని ప్రకటించా. ఆ తర్వాత కోటిగారు వచ్చి అభిమానంతో మందలించారు. పలువురు ప్రముఖులుకూడా సంగీతానికి దూరంగా వుండవద్దని సూచించారు.

అందుకే బాగా ఆలోచించి ఇప్పుడు ఈ నిర్ణయం తీసుకున్నానని వెల్లడించారు.ఇదిలా వుండగా, ఈ ప్రైవేట్ ఆల్బమ్ ఆదిత్య మ్యూజిక్ ద్వారా మార్కెట్లోకి విడుదలయింది. ప్రముఖ సంగీత దర్శకుడు కోటి పాటను విడుదల చేశారు. ఈ పాటకు సంగీతం అందించడమే కాకుండా ట్యూన్‌కు తగ్గ సాహిత్యం కూడా ఆర్.పి.పట్నాయక్ అందించడం విశేషం. ఈ సాంగ్‌ను ఆస్ట్రేలియాలో చిత్రీకరించారు. 'బాహుబలి'లో 'మమతల తల్లి..' పాటను పాడిన సత్య యామిని పాడగా, సత్య యామిని, అనుదీప్ కలిసి నటించారు. జనవరి 5న ఈ పాటను ఆన్‌లైన్‌లో అందరికీ అందుబాటులో ఉంటుంది.


అనంతరం సంగీత దర్శకుడు కోటి మాట్లాడుతూ... కొత్త ఏడాదిలో ఆర్.పి.పట్నాయక్ కొత్త కాన్సెప్ట్‌తో ముందుకు రావడం ఎంతో ఆనందంగా ఉంది. అంతే కాకుండా తను ఇక సినిమాలకు మ్యూజిక్ చేస్తాననడం..ఓ మ్యూజిక్ కంపోజర్‌గా ఆనందాన్నిచ్చింది. నేను తన సంగీతానికి పెద్ద అభిమానిని. ప్రస్తుతం ఉన్న గాయకులు ఎవరో మ్యూజిక్ కంపోజ్ చేసిన పాటలను ఆలపిస్తున్నారు. కానీ ఇండిపెండెంట్ మ్యూజిక్ అంటే..స్వంతంగా ట్యూన్‌ను కంపోజ్ చేసుకుని పాడటమే కదా..కానీ చాలా మంది అలా చేయడం లేదు. ఇకపై అలా చేస్తే బావుంటుందని నా అభిప్రాయమని అన్నారు. ఆర్.పి పట్నాయక్ మాట్లాడుతూ.. దర్శకుడిగా పలు చిత్రాలు చేశాను. కాబట్టి వేరే దర్శకుడి పనిలో వేలు పెడతాననే కొందరి భావన. ఓ మ్యూజిక్ డైరెక్టర్‌గా నా పనిని మాత్రమే చేయడానికి ప్రాధాన్యతనిస్తాను. ఒకప్పుడు సాంగ్స్ రికార్డింగ్ కోసం చెన్నై, ముంబైకి వెళ్లాలనేవారు. కానీ నేడు పరిస్థితి అలా లేదు. ఇక్కడే ఎంతో క్వాలిఫైడ్ సింగర్స్ ఉన్నారు. కాకుంటే వీరందరూ స్వంతంగా ట్యూన్స్ కంపోజ్ చేసి పాడాలని నేను కోరుతున్నాను. అలాంటి ఇండిపెండెంట్ మ్యూజిక్‌ను ముందుకు తీసుకెళ్లడానికి ఆదిత్య మ్యూజిక్ సిద్ధంగా ఉంటుంది. ఎవరైనా సింగర్స్‌కి కాన్సెప్ట్ ఐడియా కూడా నేనే డిజైన్ చేసి ఇవ్వడానికి కూడా సిద్ధమేనని.. అన్నారు. ఈ కార్యక్రమంలో రఘు కుంచె, విజయలక్ష్మి, వేణు, రవివర్మ, జెమిని సురేష్, యామినీ, అనుదీప్, మనీషా, ఆదిత్య మ్యూజిక్ మాధవ్, సత్యదేవ్ తదితరులు పాల్గొన్నారు.



యువత ప్రవర్తనకు అద్దం పట్టే 'తారామణి'

డి.వి సినీ క్రియేషన్స్ బ్యానర్ పై యస్వంత్ మూవీస్ సగర్వంగా సమర్పిస్తున్న చిత్రం 'తారామణి'. ఈ చిత్రం తమిళంలో చిన్న సినిమాగా విడుదలయి పెద్ద విజయాన్ని సాధించింది. ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల కోసం నిర్మాత డి. వెంకటేష్ అందించనున్నారు. హీరోయిన్స్ ఆండ్రియా, అంజలి ప్రధాన పాత్రధారులుగా వసంత్ కుమార్ హీరోగా నటించిన ఈ చిత్రం ప్రస్తుతం సెన్సార్ పూర్తి చేసుకొని 'ఎ' సర్టిఫికెట్ పొంది ఫిబ్రవరి నెలాఖరున ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్మాత డి వెంకటేష్ మాట్లాడుతూ... యువత ప్రవర్తనకు అద్దం పట్టేలా ఈ చిత్ర కథాంశం ఉండడంతో ప్రేక్షకులు బాగా ఆదరించారు. అందుకే ఇంతమంచి మెసేజ్ ఉన్న చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందించాలనే ప్రయత్నం చేస్తున్నాం. ఈ చిత్రాన్ని అందిస్తున్నందుకు గర్వాంగాను సంతోషంగానూ ఫీల్ అవుతున్నా. తమిళంలో కంటే తెలుగులో ఇంకా పెద్ద విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను. ఈ చిత్రం పేరుకే డబ్బింగ్ అయినా తెలుగు యువతను ఆకట్టుకునేలా ఉంటుంది. ప్రస్తుతం ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకొని 'ఎ' సర్టిఫికెట్ పొందింది.. ఫిబ్రవరి నెలాఖరులో విడుదల చేయనున్నాం. మిగతా వివరాలు అతి త్వరలో తెలియపరుస్తామని చెప్పారు. ఈ చిత్రానికి మ్యూజిక్: యువన్ శంకర్ రాజా, కెమెరా: తేని ఈశ్వర్, కథ- దర్శకత్వం: రామ్.

నయనతార 'కర్తవ్యం'



నయనతార

విజయశాంతి నటించిన 'కర్తవ్యం' తరహాలోనే నయనతార తమిళంలో ప్రధాన పాత్ర పోషించిన 'ఆరమ్' చిత్రాన్ని తెలుగులో 'కర్తవ్యం' పేరుతో విడుదల చేస్తున్నారు. గోపి నైనర్ దర్శకత్వంలో ఆర్ రవీంద్రన్ తెలుగులో అందిస్తున్నారు. నార్త్ స్టార్ ఎంటర్టైన్మెంట్స్ అధినేత శరత్ మరార్‌తో కలిసి విడుదల చేస్తున్నారు. ట్రైడెంట్ ఆర్ట్స్ పతాకం పై తమిళంలో రూపొందిన పొలిటికల్ కథాంశమిది. నయనతార జిల్లా కలెక్టర్‌గా కన్పించనున్నారు. తెలుగులో సెన్సార్ కార్యక్రమాలు పూర్తిచేసుకుని క్లీన్ యూ సర్టిఫికెట్‌తో త్వరలో విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సందర్భంగా ఆర్ రవీంద్రన్ మాట్లాడుతూ "తమిళంలో సూపర్ హిట్‌గా నిలిచింది. నయనతార కెరీర్‌లోనే పెద్ద విజయం సాధించిన ఈ సినిమా తెలుగులో కూడా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం మాకు ఉంది. 'సర్దార్ గబ్బర్ సింగ్' చిత్రాన్ని అందించిన నిర్మాత శరత్ మరార్‌తో కలిసి ఈ చిత్రాన్ని విడుదల చేయటం చాల సంతోషంగా ఉంది. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకుని త్వరలో విడుదల చేస్తామని తెలిపారు. ఈ చిత్రానికి జీబ్రాన్ సంగీతం అందిస్తున్నారు.



ఈ ఎరువులతో దిగుబడి మెరుగు

నేలల్లో ఉత్పాదక శక్తి క్షీణించటానికి కారణాలు అనేకం ఉన్నప్పటికీ, విరామం లేకుండా పంటలు వేయటం, విచ్చలవిడిగా రసాయన ఎరువుల వాడకం వల్ల నేలలో సేంద్రియ కర్బన శాతం తగ్గిపోయింది. భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. ముఖ్యంగా మనం తీసుకునే ఆహార పదార్థాలలో ఈ రసాయన ఎరువులు, మందుల అవశేషాలు ఎక్కువగా ఉండి, ఆరోగ్యపరంగా ఎన్నో సమస్యలు మానవాళి ఎదుర్కొంటుంది. హరిత విప్లవం తర్వాత దిగుబడి గణనీయంగా పెరిగినప్పటికి రసాయన ఎరువుల వాడకం విపరీతంగా పెరిగి, సమస్యలు మొదలైనాయి. ఈ పరిస్థితులను అధిగమించాలంటే ప్రత్యామ్నాయ పద్ధతులను రూపొందించాల్సిన బాధ్యత వ్యవసాయ శాస్త్రజ్ఞులపై ఉంది. ఇప్పటికే 40 సంవత్సరాలుగా ఈ జీవన ఎరువులు, జీవ నియంత్రణ పద్ధతులు, సేంద్రియ వ్యవసాయంపై దృష్టిసారించటం జరిగింది. అయితే వీటి వాడకం విషయంలో పాటించవలసిన మెలుకువల గురించి తెగుళ్ల విభాగంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.కృష్ణమ్మ ఇస్తున్న వివరాలు తెలుసుకుందాం.

ప్రకృతిలో సహజంగా ప్రతి జీవిపై దానిని నియంత్రించే పరాన్నజీవులు ఉన్నాయి. అదే విధంగా భూమి అడుగుపొరల్లోనూ కోటానుకోట్ల జీవరాశులు ఉన్నాయి. ఈ సూక్ష్మ జీవులను మేలు చేసేవి, హాని చేసేవిగా విభజించవచ్చు. మేలు చేసే సూక్ష్మజీవులను ప్రయోగశాలలో గుర్తించి, వాటిపై కొన్ని ప్రయోగాలు చేసిన తర్వాత వాటిని మందులుగా రూపొందించి, పంటలకు వాడుతున్నారు. అయితే జీవన ఎరువులు, జీవ నియంత్రణ నాశనుల వాడకంలో కొన్ని మెలకువలు పాటించాల్సి ఉంది. మార్కెట్లో జీవన ఎరువులు ఎన్నో పేర్లతో దొరుకుతున్నాయి. కానీ నాణ్యత విషయానికొస్తే చాలావరకూ ప్రమాణాలు పాటించడంలేదు.

పాటించవల్సినవి

జీవన ఎరువులు, జీవ శిలీంధ్ర నాశనులు వాడే ముందుగా సంబంధిత సూక్ష్మజీవుల సాంద్రత ఒక గ్రాము మందుకి రెండు కోట్ల కణాలు పైన ఉండాలి. వీటిని నాలుగునెలల లోపుగా వాడుకొన్నట్లయితే సూక్ష్మజీవుల కణాల సంఖ్య తగ్గకుండా ఉంటుంది. తద్వార తెగుళ్లను తగ్గించే సమర్థత పెరుగుతుంది. ముఖ్యంగా గమనించాల్సింది ఏమంటే ఈ ఎరువులను రసాయనాలు, మందులతో వాడరాదు. జీవన ఎరువులను ఏ పంటలోనైనా నాటే ముందుగా భూమిలో వేసుకోవాలి. నాటే సమయంలో వీలు కానప్పుడు మొక్కకు దగ్గరగా గుంతలు చేసి, వేరు వ్యవస్థకు దగ్గరగా వేయాలి. ఎందుకంటే సూక్ష్మ జీవులు ఎక్కువగా మొక్కల వేరు వ్యవస్థను ఆశ్రయించి, వేర్ల ద్వారా స్రవించే పదార్థాలను ఉపయోగించుకొని, మొక్కకు గాలిలో ఉన్న నత్రజనిని అందిస్తాయి. కాబట్టి వీటిని వేరు వ్యవస్థకు దగ్గరగా వేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



ఉపయోగాలు

1. జీవనఎరువులను భూమిలో కలగలిపినపుడు, వాటిలో ఉన్న సూక్ష్మ జీవులు నేలలో గాలిలోఉన్న నత్రజనిని స్థిరీకరించి మొక్కకు అందజేస్తాయి. భాస్వరాన్ని భూమిలో సంక్లిష్ట పరిస్థితిలో ఉన్న దాన్ని కరిగించి, మొక్కకు అందజేస్తాయి. అంతే కాకుండా ఎన్నో వ్యర్థ పదార్థాలను కుళ్లబెట్టి, తద్వార భూమికి బలాన్ని చేకూర్చుతాయి.



2. నేల ద్వారా సంక్రమించే తెగుళ్లను కలుగజేసే శిలీంధ్రాలను వృద్ధి చెందకుండా నియంత్రించి, మొక్కలను కాపాడతాయి.
3. ఈ సూక్ష్మజీవుల జీవరసాయన ప్రక్రియల కారణంగా స్రవించబడే కొన్ని పదార్థాల వల్ల మొక్కల ఎదుగుదల కూడా బాగుంటుంది.
4. భూమి గుల్లబారి నీటిని నిలుపుకునే శక్తిని కలి గి ఉంటుంది. తద్వారా వేరు వ్యవస్థ బాగా అభి వృద్ధిచెంది, మొక్క ఎదుగుదల బాగుంటుంది. చీడపీడలు ఉండవు.
5. పంట దిగుబడులతో పాటు నాణ్యత కూడా పెరుగుతుంది.
6. ముఖ్యంగా బ.ాి ని సారవంతం చేయటమే కాకుండా రసాయనాల వాడకంవల్ల వచ్చే కాలుష్యాన్ని తగ్గించవచ్చు.

ఈ జీవన ఎరువులను, జీవశిలీంధ్ర నాశనులను వరి, చెరకు, పసుపు, కంద, కూరగాయల పంటలతో పాటు ఉద్యానవన పంటలైన వరావిండి, జామ, కొబ్బరి తోటలకూ వాడవచ్చు. భూమిని సారవంతంగా ఉంచటమే కాకుండా భూమి, నేల, నీటి కాలుష్యాన్ని తగ్గిస్తూ, తక్కువ పెట్టుబడితో అధిక దిగు బడులు పొందవచ్చు. ఈ జీవన ఎరువులను, జీవశిలీంధ్ర నాశనులను తగు మోతాదు లో వాడినప్పుడు అధిక దిగుబడులను పొందటానికి ఆస్కారం ఉంటుంది.

వివిధ పంటల్లో

వరి: రెండు కిలోల చొప్పున ఎకరాకు నత్రజని సంబంధిత జీవన ఎరువు, భాస్వరం అందించు జీవన ఎరువు (ఫాస్ఫో బ్యాక్టరు బ్యాక్టీరియా)ను 10–20 కిలోల చివికిన పశువుల ఎరువుతో కలిపి నారు నాటే ముందుగా వెదజల్లాలి.

పసుపు, కంద: ఎకరాకు ఐదు కిలోల చొప్పున జీవన ఎరువు (నత్రజని, భాస్వర సంబంధిత)ను 200 కిలోలు బాగా చివికిన పశువుల ఎరువుతో కలిసి పసుపు లేదా కంద నాటే ముందుగా చాళ్లల్లో వేయాలి. వీటితో పాటు దుంపకుళ్లు రాకుండా ట్రైకో డెర్మా విరిడి (జీవశిలీంధ్ర నాశని)ని ఐదు కిలోల చొప్పున ఎకారాకు నాటే ముందుగా చాళ్లల్లో వేయాలి.

కూరగాయలు: ఎకరాకు నత్రజనినిచ్చు జీవన ఎరువు, భాస్వరం అందించు జీవన ఎరువు నాలుగు కిలోల చొప్పున ఏదేని 200 కిలోల సేంద్రియ ఎరువుతో కలపాలి దీన్ని పాదుల్లో వేసి, మొక్కను నాటాలి. లేదా నాటిన తర్వాత గుంత చేసి, మొక్కకు దగ్గరగా వేసుకోవాలి. జీవన ఎరువులతో పాటు ట్రైకో డెర్మా విరిడిని నాలుగు కిలోలు/ఎకరాకు చొప్పున వేసుకున్నట్లయితే వేరుకుళ్ల తెగుళ్లు ఆశించవు.

పండ్ల తోటలు: ప్రతి మొక్కకు 50 గ్రా చొప్పున నత్రజని, భాస్వరపు సంబంధిత జీవన ఎరువులతో పాటు ట్రైకో డెర్మా విరిడిని కూడా 50 గ్రా/మొక్కకు చొప్పున ఏదేనీ సేంద్రియ ఎరువుతో కలిపి మొక్కకు పాదు చేసి వేసి, మట్టి కప్పి, నీరు పెట్టాలి.

చెరకు, గడ్డిజాతి పంటలు: వీటికి అజోస్పైరిల్లమ్ వాడతారు. అజటో బ్యాక్టరూ బాగా పనిచేస్తుంది. ఫాస్ఫో బ్యాక్టీరియా, మైకో రైజా కూడా చెరకు పంటకు బాగా పనిచేస్తుంది. ఎకరాకు ఐదు కిలోల నత్రజనినిచ్చే జీవన ఎరువును, ఐదు కిలోల భాస్వరాన్నందించే జీవన ఎరువు, మైకోరైజా ఐదు కిలోలు చెరకు పంటకు సిఫార్సు చేయటం జరిగింది. అదేవిధంగా జీవశిలీంధ్ర నియంత్రణ నాశనులైన ట్రైకో డెర్మా విరిడి, సూడోమోనాస్ మందులు మార్కెట్లో దొకుతాయి. వీటిలోనూ ఏదో ఒక దానిని ఐదు కిలోలు/ ఎకరాకు వేయాలి.

ఇలా వాడాలి

జీవన ఎరువులు జీవ శిలీంధ్ర నాశనులను రసాయన ఎరువులో కలిపి వాడరాదు. రసాయన ఎరువులు పది రోజులు ముందుగానీ, తర్వాతగానీ వాడాలి. జీవన ఎరువులు, జీవ శిలీంధ్ర నాశనులును వాడే ముందుగా ఏదేనీ సేంద్రియ ఎరువుతో కలిపి సాళ్లల్లో వేసి, నాటుకున్నట్లయితే బాగా పనిచేస్తుంది. రైతువారిగా చెరకు పంట, ఇతర పంటల్లో నీరు పెట్టి పైన వేదజల్లే అలవాటు ఉంది. దాని వల్ల ప్రయోజనం లేదు. పైన వివరించిన విధంగా భూమిలో వేసి/సాళ్లలో వేసి నాటుకున్నట్లయితే సమర్థవంతంగా పనిచేస్తుంది. జీవన ఎరువులను/ నాశనులను ఎండలో ఉంచరాదు. సూర్యరశ్మి పడకుండా చూసుకోవాలి. దానిలో ఉన్న కణాలు ఎండవేడిమికి నశించిపోతాయి. పొలంలో వేసిన తర్వాత మట్టికప్పి నీరు పెట్టాలి. అప్పుడే ఫలితం బాగుంటుంది.



డాక్టర్ కె. కృష్ణమ్మ
ప్రధాన శాస్త్రవేత్త (తెగుళ్ల విభాగం)
చెరకు పరిశోధన స్థానం,
ఉయ్యూరు.

వైరస్ తెగుళ్ల నివారణ

ఈ వారం
విజ్ఞాన వాణి

రాష్ట్రవ్యాప్తంగా వివిధ పంటల్లో ఆశించే పురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ వర్సిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ కె.రాజారెడ్డి వివిధ సూచనలు ఇచ్చారు. పంటల వారీగా ఈ వివరాలు..

పెసర, మినుము:

అక్టోబరులో మెట్ట భూముల్లో వేసిన పెసర, మినుము పంటలలో తామరపురుగు, తెల్లదోమ ఆశించి నష్టం కలుగచేయడమే కాకుండా వైరస్ తెగుళ్ళను వ్యాప్తి చేయవచ్చు. కనుక తామర పురుగు నివారణకు ఎసిఫేట్ 1 గ్రా. లేదా ఫిప్రోనిల్ 1.5 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. ఏదో మందును ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తెల్లదోమ నివారణకు ట్రైజోఫాస్ 1.5 మి.లీ లేక ఎసిఫేట్ 1.0 గ్రా. లేక ప్రొఫెనోఫాస్ 1.5 మి.లీ. లేక ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేక థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేక మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా మీథైల్ ఓ డెమటాన్ 2.0 మి.లీ. ఏదైనా ఒక మందును లీటరు నీటిలో కలుపుకొని పిచికారీ చేయాలి. పల్లాకు తెగులు, ఆకుముడత తెగుళ్ళు ఆశించిన మొక్కలను తొలిదశలోనే గమనించాలి. ఈ మొక్కలను పీకివేసి, తెగులు వ్యాప్తి కారకాలైన రసం పీల్చు పురుగులను నివారించాలి.



పత్తి:

పత్తిలో మజ్జిగ తెగులు ఆశిస్తుంది. మజ్జిగ తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకము లీటరుకు 3గ్రా. చొప్పున లేదా కార్బన్‌డిజమ్ లీటరుకు 1గ్రా. కలిపి పిచికారీ చేసుకోవాలి. పత్తి పంట తీత దశలో ఉండి ఆకులు వాడినట్లుగా కనిపిస్తుంది. కావున, తెగులు మందు లేదా పురుగుమందు పిచికారీ చేసేటప్పుడు, పొటాషియం నైట్రేట్ (13:0:45) కలిపి పిచికారీ చేసుకోవడం ద్వారా పంటకు నత్రజని పొటాష్ అంది పంట బావుండటమే కాకుండా, వేసిన పురుగు, తెగులు మందు సమర్థవంతంగా పనిచేస్తుంది.



వేరుశనగ:

వేరుశనగ 25–30 రోజుల దశలో ఉన్నపుడు పచ్చదోమ, ఆకు తినే పురుగులైన ఆకుముడుత, పొగాకు లద్దె పురుగు, శనగపచ్చ పురుగు ఆశించే అవకాశం ఉంటుంది. పచ్చదోమ నివారణకు డైమిథోయేట్ 400 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 60 మి.లీ. అసిటామిప్రైడ్ 60 గ్రా.ను 200 లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆకు ముడుత, లద్దె పురుగు నివారణకి క్వినాల్ఫాస్ 400 మి.లీ. ఎదిగిన పురుగుల నివారణకి థయోడికార్బ్ 200.0 గ్రా. లేదా న్యూవల్యూరాన్ 200.0 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి ఎకరానికి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో 10 రోజుల తర్వాత పై మందును మరోసారి పిచికారి చేసినట్లైతే పురుగులను పూర్తిగా నివారణ చేయవచ్చు.

మరిన్ని వివరాలకు మీ జిల్లాలోని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌ను సంప్రదించగలరు. రైతులు మరిన్ని సలహాల కోసం ఈ ఉచిత ఫోన్ కాల్‌కూ కాల్ చేయండి-1800 425 0430

మనవి

ఆంధ్రప్రదేశ్ ప్రధానంగా వ్యవసాయక రాష్ట్రం. దక్షిణాది ధాన్యాగారంగానూ ప్రసిద్ధి. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమే జీవగర్ర, అటువంటి కీలకమైన ఈ రంగానికి సంబంధించిన సమాచారం, శాస్త్రవేత్తల, నిపుణుల విశ్లేషణలు, ఇంటర్వ్యూలు, గణాంకాలతో 'అగ్రిప్లస్' ప్రతి శుక్రవారం మీ ముందుకొస్తోంది. దీనిపై మీ అభిప్రాయాలు, సూచనలు, సలహాలు తెలియజేయగలరు. దీనిని మరింతగా పరిపుష్టం గావించేందుకు శాస్త్రవేత్తలు, నిపుణులు, అనుభవజ్ఞులు తమ వంతు తోడ్పాటును అందించాలని మనవి.

మా చిరునామా :

'అగ్రిప్లస్', ప్రజాశక్తి దినపత్రిక, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ-2
ఇ-మెయిల్ : editorprajasakthi@gmail.com

చిన్నారి



జత చేయండి



పిల్లలూ..! పక్కనున్న బొమ్మలో కొన్ని బూట్లు వాటి నీడలు ఉన్నాయి. ఏ నీడ దేనిదో జత చేయండి!

పొడుపు కథ

ఆ ఇద్దరు అన్నదమ్ములు పక్షిలా ఎగరాలను కున్నారు వైఫల్యాల అనంతరం విమానం కనిపెట్టారు ..ఎవరు వారు?

జోక్ :

టీచర్ : నిన్న చెప్పిన లెక్కలు ఇంకా బోర్డుమీద అలాగే ఉన్నాయి. చెరపలేదేం?
చంటి : 'చెరపకురా చెడేవు' అన్న సామెత గుర్తొచ్చింది టీచర్...

ఉప్పుమళ్లు అంటే?



పిల్లలూ..! మనం ఉప్పు లేకుండా ఏదీ తినలేం కదూ. చివరికి పెరుగు అన్నంలోనూ ఉప్పు వేసుకుంటాం. అటువంటి ఉప్పు ఎలా తయారవుతుందో తెలుసుకుందామా?!

సముద్రపు నీటిలో ఉప్పు పుష్కలంగా ఉంటుంది. అందుకే ప్రపంచమంతటా దీని నుంచే ఉప్పును పండిస్తున్నారు. ఉప్పును తయారు చేయటానికి సముద్రపు నీటిని బాగా పొడవు వెడల్పు ఉన్న పొలంలోకి పంపుతారు. ఈ పొలం లోతు సుమారు మూడు అడుగులు ఉంటుంది. మొదట పొలంలోకి నీరు చేరగానే ఇసుక, మట్టి, చిన్న చిన్న ప్రాణులు అడుగుకు చేరతాయి. తర్వాత నీటిని మరో పొలంలోకి మళ్ళిస్తారు. అక్కడ ఈ నీరు బాష్పీకరణం చెందుతుంది అంటే ఆవిరవుతుందన్న మాట! నీరు ఆవిరైపోయి, ఉప్పు మిగిలిపోతుంది. ఈ ఉప్పును ఒక చోటికి చేర్చి ఎండబెడతారు. ఇట్లా ఎండబెట్టే



మడులను ఉప్పు మళ్ళు అంటారు. తర్వాత ఉప్పును శుభ్రం చేసి, అమ్మకానికి సిద్ధం చేస్తారు.

చలి ప్రాంతాలలో ఉప్పు తీయటానికి మరో పద్ధతి ఉంది. సముద్రపు నీటిని గడ్డ కట్టేవరకు వదిలేస్తారు. మంచుగడ్డలలో ఉప్పు ఉండదు. కాబట్టి ఉప్పు మంచుగడ్డకు అడుగున ఉన్న నీటిలో చేరుతుంది. మంచును తొలగించి నీరు గడ్డ కట్టుకొనేలా చేస్తారు. అప్పుడు మళ్లీ ఉప్పు కిందకు చేరుతుంది. ఆ నీటిలో ఉప్పుశాతం ఎక్కువ ఉంటుంది. తర్వాత ఈ నీటిని తీసి కృత్రిమ పద్ధతిలో వేడిచేసి బాష్పీకరణం చేస్తారు. అప్పుడు ఉప్పు తయారవుతుంది. నిజానికి భూమి మీద నుంచే ఈ ఉప్పు సముద్రంలోకి చేరుతుంది. ఎలాగంటే భూమిపై ప్రవహించే నదులు, సెలయేర్లలో నేలలో ఉండే వివిధ లవణాలు కరిగి, కలుస్తాయి. ప్రపంచవ్యాప్తంగా నదుల ద్వారా వచ్చే ఈ లవణాల వల్లే సముద్రం నీరు ఉప్పుగా ఉంటుంది. ★

పిల్లల్లారా.. రారండి!!



హాయ్ పిల్లలూ! మీలో చాలా టాలెంట్ ఉంది కదూ! మీకు పాటలొచ్చు. బొమ్మలొచ్చు, బోల్డన్ని ఆటలొచ్చు. మేజిక్కులొచ్చు. అలాగే కథలూ రాస్తారు కదూ?!. మాకెలా తెలుసంటారా? అసలు పిల్లలంటేనే.. క్రియేటివ్ కిడ్స్‌కదా?! చక్కగా చదువుకుంటూనే ఆటలు, పాటలతో మీరంతా అదరగొట్టేస్తారని మాకు తెలుసు. అందుకే మీరు వేసిన బొమ్మలు, కార్టూన్లు, రాసిన బుల్లిబుల్లి కథలు.. వేసిన నాటకాలు.. ఇంకా మీరు కనిపెట్టిన సైన్స్ సంగతులు.. మీరు చూసొచ్చిన కొత్త ప్రదేశాల విశేషాలూ ... 'చిన్నారి' పేజీలో పంచుకోండి. వాటిని మీ పేరుతో, మీ ఫొటోతో ప్రచురిస్తాం. నిజమా?! అని ఆశ్చర్యపోకండి. నిజమే. అందుకే మీలో దాగి ఉన్న ఏ టాలెంట్ గురించి అయినా మాకు రాసి పంపండి. ఇంకెందుకు ఆలస్యం... పెన్ను, పెన్సిల్, బ్రష్‌తో రెడీ అయిపోండి.!

చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

నేను గీసిన బొమ్మ





పి. అష్రఫ్ ఖాన్
6వ తరగతి,
గౌతమ్ పబ్లిక్ స్కూల్,
విజయవాడ.

కొనసాగే క్రీడాకారులు వీరే!

ముంబయి : అత్యంత ప్రజాదరణ పొందిన క్రీడల్లో ఇండియన్ ప్రీమియల్ లీగ్ (ఐపిఎల్) ఒకటి. 2018 ఆరంభానికి ముందు ఏ జట్టులో ఎవరెవరు క్రీడాకారులు కొనసాగనున్నారో ఆ జాబితాను గురువారం విడుదల చేశారు. ప్రస్తుతం ఫ్రాంచేజీల్లో ఉంచుకున్న వారు మినహా మిగతా వారందరూ జనవరి 27, 28 తేదీలలో వేలానికి వెళ్ళనున్నారు. ఈ రిటెన్షన్ ప్రకియకు సంబంధించిన వివరాలను ప్రసార మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేశారు. సన్‌రైజర్స్ ఫ్రాంచేజీ శిఖర్ ధావన్, యువరాజ్ సింగ్‌లను, కోల్‌కతా గంభీర్‌ను వదిలేయడం గమనార్హం. జట్లు విడుదల చేసిన ఆయా ఆటగాళ్ల నుంచి వేలం సమయంలో రైటు టు మ్యాచ్ ద్వారా అందులో నుంచి కొంతమంది ఆటగాళ్లను తిరిగి కొనుగోలు చేసుకునే వెసులుబాటు కూడా

ఐపిఎల్-2018 రిటెయిన్ జాబితా విడుదల

ఉంది. రిటెన్షన్ పద్ధతి ప్రకారం వేలంలో వివిధ ఫ్రాంచేజీలకు వెళ్ళే క్రీడాకారులు 2018 నుంచి 2020 వరకూ మూడేళ్ల పాటు ఆయా ఫ్రాంచేజీల్లో ఆడనున్నారు. రెండేళ్ల నిషేధానికి గురైన చెన్నై, రాజస్థాన్ జట్లు 2015లో ఆడిన ఆటగాళ్ల నుంచి అట్టి పెట్టుకునే క్రికెటర్లను ఎంపిక చేసుకోవాల్సి ఉంది. 2016 సీజన్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్‌కు తొలిసారి టైటిల్ అందించిన ఆస్ట్రేలియా ఓపెనర్ డేవిడ్ వార్నర్ హైదరాబాద్ తరపున సారథిగా ప్రాతినిధ్యం వహించ నున్నాడు. ఆస్ట్రేలియా మాజీ సారథి రికీ పాంటింగ్ ఢిల్లీ డేర్ డెవిల్స్ జట్టుకు కోచ్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారని ఆ ఫ్రాంచేజీ సిఇఓ హేమంత్‌ద్వే తెలిపారు.


రూ.80 కోట్లకు మించరాదు

రిటెన్షన్ పద్ధతిలో తమ ఫ్రాంచేజీలో నిలుపుకున్న స్వదేశీ క్రీడాకారులలో తొలి క్రీడాకారుడికి రూ.15 కోట్లు, మిగతా ఇద్దరు క్రీడాకారులకు రూ.11, 7 కోట్లు చొప్పున ఒక ఏడాదికి చెల్లించాల్సి ఉంది. అదేవిధంగా విదేశీ క్రీడాకారులిద్దరికి రూ.12.5, 8.5 కోట్లు చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో ఫ్రాంచేజీ రూ.80 కోట్ల లోపు జట్టు క్రీడాకారులందరినీ కొనుగోలు చేసుకోవాల్సి ఉంది. పై పద్ధతిలో తమ ఫ్రాంచేజీలో నిలుపుకున్న క్రీడాకారులకు చెల్లించిన మొత్తం మినహాయించి మిగతా పైకానికి ఇతర క్రీడాకారులను కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుంది.

వివిధ ఫ్రాంచేజీల్లో కొనసాగే క్రీడాకారులు...

1) **సన్‌రైజర్స్ హైదరాబాద్ :** డేవిడ్ వార్నర్(ఆస్ట్రేలియా), భువనేశ్వర్ కుమార్
2) **రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు:** కోహ్లీ, డివిలియర్స్(దక్షిణాఫ్రికా), సర్ఫరాజ్‌ఖాన్
3) **చెన్నై సూపర్ కింగ్స్:** మహేంద్రసింగ్ ధోని, సురేశ్ రైనా, రవీంద్ర జడేజా
4) **ముంబయి ఇండియన్స్:** రోహిత్ శర్మ, హార్ధిక్ పాండ్య, బుమ్రా
5) **ఢిల్లీ డేర్‌డెవిల్స్:** రిషబ్ పంత్, శ్రేయస్ అయ్యర్, క్రిస్ మోరిస్ (దక్షిణాఫ్రికా)
6) **కోల్‌కతా నైట్ రైడర్స్ :** సునీల్ నరైన్, ఆండ్రీ రస్సెల్ (ఇద్దరూ విండీస్ ఆటగాళ్లే)
7) **కింగ్స్ ఎలెవన్ పంజాబ్ :** అక్షర్‌పటేల్
8) **రాజస్థాన్ రాయల్స్ :** స్టీవ్ స్మిత్ (ఆస్ట్రేలియా)

గౌతం గంభీర్



రెండుసార్లు ఐపిఎల్ టైటిల్స్‌ను కలకత్తా నైట్ రైడర్స్ ఫ్రాంచేజీకి అందించిన గౌతం గంభీర్‌ను ఆ జట్టు యాజమాన్యం వదిలేసింది. 2012, 2014 సీజన్‌లలో ఆ జట్టు ఐపిఎల్ టైటిల్స్ అతని సారథ్యంలోనే లభించాయి. ఆ జట్టు యాజమాన్యం విండీస్ ఆటగాళ్లైన నరైన్, రస్సెల్‌లను మాత్రమే తమవద్ద ఉంచుకుంది.

క్రిస్ గేల్



ఒంటిచేత్తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చివేసే క్రిస్ గేల్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జారవిడుచుకుంది. ఇటీవల టి20ల్లో తక్కువ బంతుల్లో సెంచరీ చేసి రికార్డ్ సృష్టించిన విధ్వంస బ్యాట్స్‌మన్‌ను బెంగళూరు వదిలేయడం పెద్ద లోటే అని చెప్పక తప్పదు.

ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్
ముంబయి రాకెట్స్ సంచలనం



లక్నో : ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పిబిఎల్)లో గురువారం ముంబాయి రాకెట్స్ జట్టు సంచలనం సృష్టించింది. అప్రతిహత విజయాలతో దూసుకెళ్తున్న అవధే వారియర్స్‌ను 4-1 పాయింట్ల తేడాతో ఓడించింది. అవధే వారియర్స్ ట్రంప్ మ్యాచ్‌గా తీసుకున్న మిక్సిడ్ డబుల్స్‌ను 10-15, 15-14, 7-15 ముంబాయిపై ఓడింది. దీంతో ముంబయి జట్టు 1-(-1) ఆధిక్యత సంపాదించింది. తర్వాత జరిగిన పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో సమీర్ వర్మ (ముంబాయి) 15-6, 15-14 గేమ్‌ల తేడాతో హెచ్. అగర్వాల్ (అవధే)పై గెలిచి ముంబయికి 2-(-1) ఆధిక్యత చేకూర్చాడు. సైనా నెహ్వాల్ (అవధే) 8-15, 15-10, 15-13తో జంగ్(ముంబాయి)పై గెలిచి 2-0కు ముంబాయి ఆధిక్యాన్ని తగ్గించింది. మరో పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో కిదాంబి శ్రీకాంత్ (అవధే) 15-13, 13-15, 15-4తో ఎస్.డబ్ల్యూ. హో(ముంబాయి)పై గెలిచి మరో పాయింట్ 2-1కు జట్టు స్కోర్‌ను చేర్చాడు. నిర్ణయాత్మకమైన చివరి పురుషుల డబుల్స్ మ్యాచ్‌ను (ముంబాయి) ట్రంప్ మ్యాచ్‌గా తీసుకొని 15-13, 15-12తో గెలిచింది.

ఇంగ్లండ్ 233/5
యాషెస్ సిరిస్ ఐదో టెస్ట్

సిడ్నీ : ఆస్ట్రేలియా-ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న ఐదో టెస్ట్ తొలిరోజు ఇంగ్లండ్ జట్టు 5 వికెట్లు కోల్పోయి 233 పరుగులు చేసింది. గురువారం తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ జట్టుకు కుక్-స్టోన్‌మన్‌ల ఓపెనింగ్ జోడీ భారీ స్కోర్ సాధించలేకపోయింది. జట్టు స్కోర్ 28 పరుగుల వద్ద స్టోన్‌మన్ (24) కమ్మిన్స్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ పెయిన్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. నాల్గో టెస్ట్‌లో డబుల్ సెంచరీతో రాణించిన కుక్ (39), విన్స్ (25) పరుగులు మాత్రమే చేశారు. ఇంగ్లండ్ కెప్టెన్ రూట్ 83 పరుగులతో రాణించాడు. తొలిరోజు ఆట ముగిసే సమయానికి మలాన్ 55, బారిస్ట్రో 5 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. ఆస్ట్రేలియా బౌలర్లు హోజల్‌వుడ్, కమ్మిన్స్‌లకు రెండేసి వికెట్లు లభించాయి.



25 ఏళ్ల నిరీక్షణ ఫలించేనా?

నేటి నుండి భారత్-దక్షిణాఫ్రికా తొలి టెస్ట్
మధ్యాహ్నం 2.00 గం॥ల నుండి ప్రారంభం

కేప్‌టౌన్ : భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య శుక్రవారంనుండి తొలిటెస్ట్ ప్రారంభం కానుంది. మూడు టెస్టల సిరీస్‌లో భాగంగా ఇరుజట్లు తొలిటెస్ట్‌లో ఇక్కడ తలపడనున్నాయి. టీమిండియా ఆల్‌రౌండర్ రవీంద్రు జడేజా జ్వరం కారణంగా తొలి టెస్ట్‌కు దాదాపు దూరమైనట్లే... అతడు ఫిట్‌నెస్ సాధిస్తే మైదానంలోకి దిగే అవకాశముంది. చీలమండ గాయంతోనే దక్షిణాఫ్రికాకు బయలుదేరిన ఓపెనర్ ధావన్‌లు ఫిట్‌నెస్ సాధించాడు. అదేవిధంగా దక్షిణాఫ్రికా సారథి డుప్లెసిస్, కీపర్ డి కాక్‌లు మైదానంలో దిగే విషయం ఇప్పటికి ఏ సమాచారం తెలియదు. 2015 జనవరిలో ధోనీ టెస్ట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించిన అనంతరం కోహ్లీ టెస్ట్ జట్టుకు పూర్తిస్థాయి సారథిగా బాధ్యతలు స్వీకరించాడు. కోహ్లీ సారథ్యంలో భారతజట్టు ఇప్పటివరకు ఒక్క సిరీస్ కూడా ఓడిపోలేదు. అజేయంగా కొనసాగడమే కాకుండా ఇంటా, బయటా వరుసగా తొమ్మిది టెస్ట్ సిరీస్ విజయాలు సాధించి రికార్డు తిరగరాశాడు. అంతేగాక భారత జట్టును టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేర్చాడు. ఇప్పటివరకు 32 టెస్ట్‌లకు సారథ్యం వహించిన కోహ్లీ కేవలం మూడు టెస్టుల్లో ఓటమి చవిచూశాడు. తొమ్మిది వరుస సిరీస్ విజయాల్లో మూడు మాత్రమే విదేశీ సిరీస్ విజయాలు. స్వదేశంలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌లాంటి హేమాహేమీ జట్లను ఓడించడమేగాక ఇటీవ శ్రీలంకతో టెస్ట్ సిరిస్‌ను సైతం 1-0తో గెలిచి మంచి ఊపుమీదుంది.

1992లో దక్షిణాఫ్రికా జట్టు క్రికెట్‌లోకి పునరాగమనం చేసినప్పటినుంచి ఆ గడ్డపై భారత్ 17 టెస్ట్ మ్యాచ్‌లు ఆడింది. కానీ అందులో గెలిచింది రెండే రెండు. ఎనిమిది మ్యాచ్‌లలో పరాజయం పాలై ఏడింటిని మాత్రం డ్రాగా ముగిచింది. ప్రపంచ మేటి జట్లను సైతం వణికించే భారత జట్టు విదేశీ గడ్డపై కొంత తడబడుతోంది. సఫారీ గడ్డపై టీమిండియానే కాకుండా ఇతర ఏ అగ్రదేశాలైనా ఆధిపత్యం చెలాయించిన సందర్భాలు చాలా అరుదని చెప్పక తప్పదు. ఆ జట్టుకు నాణ్యమైన పేసర్లతో పాటు, స్పిన్ బౌలింగ్‌లోనూ ఇమ్రాన్ తాహిర్ అత్యద్భుతంగా రాణిస్తున్నాడు. ఆ జట్టుకు ఫీల్డింగ్ దుర్భేద్యంగా ఉంది. టెస్ట్ మ్యాచ్ తొలిరోజునుండే ఇరుజట్లు ఆధిపత్యంకోసం పోటీపడక తప్పదు.

బలా బలాలు సమానం..

భారత్-దక్షిణాఫ్రికా ఇరు జట్లు అగ్రస్థానంలో ఉన్న కారణంగా శుక్రవారం నుండి ప్రారంభమయ్యే టెస్ట్ కోసం యావత్ ప్రపంచం ఉత్కంఠగా ఎదురు చూస్తోంది. ఐసిసి ర్యాంకింగ్స్‌లో ఇరుజట్లు అగ్రస్థానంలో ఉన్న జట్లే కావడంతోపాటు ఐసిసి బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్-20లో భారత్ నుంచి నలుగురు బ్యాట్స్‌మన్లు ఉంటే... సఫారీ జట్టు నుండి ఐదుగురు ఉండడేమే ఇందుకు నిదర్శనం. ఇక బౌలింగ్ విభాగంలో చూస్తే... భారత్ తరపున ముగ్గురు, సఫారీ జట్టు తరపున ఐదుగురు టాప్ 20లో ఉన్నారు. కాబట్టి హోరా హోరీ పోరు తప్పదు.

భారత జట్టు : విరాట్ కోహ్లీ (కెప్టెన్), వృద్ధిమాన్ సాహా (వికెట్ కీపర్), మురళి విజయ్, శిఖర్ ధావన్, ఛతేశ్వర పుజారా, అజింకా రహానే, రోహిత్ శర్మ, అశ్విన్, జడేజా, షమి, ఇషాంత్ శర్మ, బుమ్రా, పార్థివ్ పటేల్, ఉమేష్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, హార్ధిక్ పాండ్యా, లోకేష్ రాహుల్.

దక్షిణాఫ్రికా జట్టు : డుప్లెసిస్ (కెప్టెన్), డి కాక్ (వికెట్ కీపర్), ఎల్గర్, మక్రామ్, హషీమ్ ఆమ్లా, డివిలియర్స్, బవుమా, ఫెల్యూవాయో, మహరాజ్, రబాడా, మోర్కెల్, స్టెయిన్, మోరిస్, ఫిలాండర్, టి.బ్రుయాన్.

ఇప్పటివరకు దక్షిణాఫ్రికా పర్యటనలో భారత్ రికార్డ్...

1992-93లో దక్షిణాఫ్రికా 1-0తో విజయం
1996-97లో దక్షిణాఫ్రికా 2-0తో విజయం
2001 దక్షిణాఫ్రికా 1-0తో విజయం
2006-07 దక్షిణాఫ్రికా 2-1తో విజయం
2010-11 సిరిస్ 1-1తో డ్రా
2013 దక్షిణాఫ్రికా 1-0తో విజయం
(విజయం : 2 ; పరాజయం : 8 ; డ్రా : 7)

ధోనీకి చేజారనున్న టాప్‌గ్రేడ్ కాంట్రాక్ట్?



బీసీసీఐ టాప్ సెంట్రల్ కాంట్రాక్ట్‌ను మహేంద్ర సింగ్ ధోనీని మిస్సయ్యే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. భారత క్రికెటర్ల వేతనాలను పెంచేందుకు కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ ఆమోదం తెలిపింది. ఈ విషయమై గతంలో విరాట్ కోహ్లీ, ధోనీ, రవిశాస్త్రి కూడా కమిటీ సభ్యులతో భేటీ అయ్యారు. ఆటగాళ్ల కాంట్రాక్టులను ఏ+, ఏ, బి, సిగా విభజించాలని కమిటీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. కమిటీ మార్గదర్శకాల ప్రకారం ఏ+ కేటగిరీలోకి అన్ని ఫార్మాట్లు ఆడే ఆటగాళు మాత్రమే వస్తారని తెలిసింది. దీంతో ఇప్పటికే టెస్టులకు గుడ్ బై చెప్పిన మహేంద్ర సింగ్ ధోనీ టాప్ కేటగిరీలో చోటు కోల్పోయే ఉంది. త్వరలో కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ బీసీసీఐ ఆర్థిక సంఘానికి ఆటగాళ్ల గ్రేడింగ్‌కు సంబంధించిన మార్గదర్శకాలను అందజేయనుంది.

ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు ముర్రే దూరం

మెల్‌బోర్న్ : ప్రపంచ మాజీ నెంబర్ వన్ ఆటగాడు, మూడు గ్రాండ్‌శ్లామ్‌ల విజేత, ఇంగ్లండ్‌కు చెందిన ఆండీ ముర్రే ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు దూరమయ్యాడు. గాయాల కారణంగా పూర్తిగా కోలుకోని కారణంగానే తాను ఈ టోర్నీలో పాల్గొనడం లేదని గురువారం విలేకరుల సమావేశంలో తెలిపాడు. గత ఏడాది వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్లో జపాన్‌కు చెందిన నిషికోరితో తలపడి ఓటమి అనంతరం టెన్నిస్‌కు దూరంగా ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం సీజన్ తొలి టోర్నీ బ్రిస్బేన్ ఓపెన్ నుంచి తప్పుకున్న ముర్రే తాజాగా ప్రతిష్టాత్మకమైన గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియా ఓపెన్ నుంచి తప్పుకుంటున్నట్లు భావోద్వేగంగా ఒక ప్రకటనలో తెలిపాడు.

స్కీమ్స్ బలవంతంగా రుద్దొద్దు
బ్యాంకులకు ఎస్‌ఎల్‌బిసి ఆదేశం
క్షేత్ర స్థాయి ఫిర్యాదులపై కదలిక

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

స్వయం సహాయ సంఘాల సభ్యులపై తమ తమ స్కీమ్స్‌ను బలవంతంగా రుద్ద వద్దని అన్ని బ్యాంకులకు రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి ఆదేశించింది. రుణాల కోసం వచ్చే వారు తప్పనిసరిగా తాము అమలు చేస్తున్న బీమా, ఇతర పథకాలను తీసుకోవాలంటూ అనేక బ్యాం కులు బలవంతం చేస్తున్నట్లు విమర్శలు వస్తు న్నాయి. దీనిపై గతంలో జరిగిన బ్యాంకర్ల సమా వేశంలో కూడా అధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత నెలలో జరిగిన ఎస్‌ఎల్‌బిసి భేటీలో కూడా దీనిపైనే ప్రధానంగా చర్చ సాగింది. ఆ నేపథ్యంలో అన్ని బ్యాంకులకు ఎస్‌ఎల్‌బిసి స్పష్టమైన ఆదేశాల జారీ చేసింది. రుణానికి బదులుగా తమ స్కీమ్స్ తీసుకోవాలన్న విధానం సరికాదని అభిప్రాయపడింది. ఇకపై ఆ విధానాన్ని మానుకోవాలని సూచించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రాయోజిత పథ కాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంకు ఇచ్చిన మార్గదర్శ కాలను పాటించాలని స్పష్టం చేసింది. వీటి అమలులో ఎటువంటి పక్కదారి విధానాలూ వద్దని తేల్చి చెప్పింది. లబ్ధిదారులకు ఇవ్వాల్సిన రుణాన్ని పూర్తి స్థాయిలో విడుదల చేయాలని, ఎంతో కొంత నగదు డిపాజిట్టు చేయాలని వారిపై ఒత్తిడి తేవద్దని సూచించింది. సంక్షేమ పథకాల అమలులో సానుకూల ధోరణితో వ్యవహరించాలని, బ్యాంకులకు ఇచ్చిన లక్ష్యా లను పూర్తిగా సాధించేందుకు కృషి చేయాలంది. పథకాల అమలు, రుణాల జారీతోపాటు రికవరీలపైనా దృష్టి సారించాలని స్పష్టం చేసింది.

ఆశ నిరాశల్లో రబీ

ఈశాన్యంలో 40 శాతం వర్షపు లోటు
ఎండుతున్న పంటలు
డెల్టాలకూ నీటి కొరత
తగ్గనున్న వరి సాగు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రబీ సాగు ఆశా నిరాశల్లో కొట్టుమిట్టాడుతోంది. ఈశాన్య రుతుపవనాలు విఫలం కావడంతో అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య రాష్ట్రంలో 40 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. దీంతో రబీలో ముందస్తుగా సాగు చేసిన పంటలు ఎండుతున్నాయి. ఇప్పటి వరకు సాగు ఆశాజనకంగా ఉన్నప్పటికీ వేసిన పంటలు ఎండుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జనవరి 3వ తేదీ నాటికి రబీ సాధారణ సాగులో 77 శాతం సాగైందని వ్యవసాయశాఖ బుధవారం వారాంతపు నివేదికలో వెల్లడించింది. వాస్తవంగా సాగైన దాని కంటే పది శాతం ఎక్కువేసి చూపుతున్నారన్న ఆరోపణ అలా ఉంచితే ప్రభుత్వ లెక్కల ప్రకారం చూసినా ఇంకా 33 శాతం విస్తీర్ణంలో పంటలు సాగు కావాలి. మామూలుగా ఫిబ్రవరి రెండోవారానికి రబీ సేద్యం పూర్తవుతుంది. అనంతరం ఎక్కడోకాని వేయరు. దీన్నిబట్టి రబీ సాగుకు ఇంకా నెలా పదిహేను రోజులే గడువుంది. అప్పటికెల్లా మిగిలిన 33 శాతం విస్తీర్ణం సాగులోకి వస్తుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముతకధాన్యాలు, పప్పులు, నూనెగింజలు, వాణిజ్య పంటలు, ఇతర మెట్ట పంటల సాగుకు ఇప్పటికే సమయం ముగిసింది. ఇక మిగిలింది వరి మాత్రమే.



వరికి గండం

నవ్యాంధ్రలో తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిననాటి నుంచి రబీలో వరి సాగు అంతకంతకూ తగ్గుతోంది. 2014-15 సీజన్‌లో 7.49 లక్షల హెక్టార్లు, 2015-16లో 7.08 లక్షల హెక్టార్లలో వరి సాగుకాగా 2016-17లో 5.67 లక్షల హెక్టార్లకు పడిపోయింది. వరుసగా సేద్యం తగ్గడంతో రబీ సాధారణ విస్తీర్ణాన్ని సాగు 8 లక్షల హెక్టార్ల నుంచి 7.33 లక్షల హెక్టార్లకు సర్కారు తగ్గించింది. ఈ ఏడాది కూడా వరి సాగు ఇబ్బడిముబ్బడిగా పెరిగేందుకు పెద్దగా అవకాశాల్లేవని, నిరుటి కంటే తగ్గినా ఆశ్చర్యం లేదని వ్యవసాయశాఖ వర్గాలు అంచనా వేశాయి.

ఏతావాతా ఐదున్నర లక్షల హెక్టార్లకు మించి వరి సేద్యం అసంభవమని తేల్చారు. మహాఅయితే ఆరు లక్షల హెక్టార్లేనంటున్నారు. అందుకు బలమైన కారణాలే చెపుతున్నారు.

సాగునీటికి కటకట

రబీలో సగం వరి గోదావరి డెల్టాలోనే పండుతుంది. కాగా ఈసారి గోదావరినదిలో నీటి ప్రవాహం బాగా తగ్గింది. రానున్న రోజుల్లో ప్రవాహం మరింత తగ్గే అవకాశాలున్నాయంటున్నారు. నీటి కొరతతో గోదావరి డెల్టాలో వరి సేద్యంపై రైతులు సందిగ్ధంలో పడ్డారు. ఇప్పటికి డెల్టాలో 68 శాతం వరి నాట్లు పూర్తయ్యాయి. గోదావరిలో నీరు మొత్తానికే తగ్గితే సాగైన పంటను కాపాడటం తలకుమించిన భారమని, సీలేరు నీరే దిక్కని ఇరిగేషన్ అధికారులు చెపుతున్నారు. ఇక నాగార్జునసాగర్, శ్రీశైలంలో నిరుటి కంటే కాస్త ఎక్కువ పరిమాణంలో నీరున్నా రెండు తెలుగు రాష్ట్రాల తాగునీటి అవసరాలూ దృష్టిలో ఉంచుకొని కృష్ణా డెల్టాలో వరి రెండో పంటకు నీరివ్వలేమని సర్కారు చేతులెత్తేసింది. నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాల్వల కింద కూడా అంతే. సోమశిలలో నీటి నిల్వలు పెన్నా డెల్టాలో వరి సాగుకు బొటాబొటిన సరిపోతాయని అంచనా వేశారు. ఏపీలో మిగిలిన ప్రాంతాల్లో భూగర్భ జలాలు అందుబాటులో ఉన్న దగ్గర బోరుబావుల కిందనే వరి సాగవుతుందంటున్నారు.

జనవరి 3 నాటికి రబీ సాగు (లక్షల హెక్టార్లలో)

పంట	సాధారణ విస్తీర్ణం	సాగైన విస్తీర్ణం	శాతం
వరి	7.33	4.90	67
చిరుధాన్యాలు	3.17	2.47	78
పప్పుధాన్యాలు	9.77	9.13	94
ఆహారధాన్యాలు	20.27	16.50	81
నూనెగింజలు	1.85	0.86	46
అన్ని పంటలు	23.81	18.25	77

విశాఖ స్టీల్ ప్లాంట్ వాటాలు అమ్మొద్దు : సిఐటియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


విశాఖ స్టీల్ ప్లాంట్ వాటాలు 10 శాతం అమ్మాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు రాజ్యసభలో ఉక్కు శాఖ మంత్రి ప్రకటించడాన్ని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్ ఖండించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన విశాఖ స్టీల్‌ను చౌకగా ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వాలు చేసిన ప్రయత్నాలను ప్రజలు ఐక్యంగా పోరాడి తిప్పికొట్టారని పేర్కొన్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలన్నీ ఐక్యంగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

ఎంవి చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించండి

మోటార్ వాహన చట్ట సవరణ బిల్లును రాజ్యసభలో ప్రవేశ పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ లారీ, టాక్సీ, ఆటో కార్మికులు నేడు, రేపు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపునిస్తున్నట్లు తెలిపారు. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, టోల్‌గేట్, వాహనాల రిజిస్ట్రేషన్ల ఫీజులు 100 నుంచి 200 శాతం పెంచడమే కాకుండా ఆలస్య ఫీజు పేరుతో వేల రూపాయల జరిమానా విధించడాన్ని కార్మిక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని పేర్కొన్నారు. రవాణా రంగాన్ని నాశనం చేసే ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమించాలని కోరారు.

ఐఇఎ తదుపరి కాన్ఫరెన్సు అధ్యక్షులుగా విట్ వ్యవస్థపక విసి విశ్వనాథన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ప్రతిష్టాత్మక ఇండియన్ ఎకనామిక్స్ అసోషియేషన్ కాన్ఫరెన్స్ అధ్యక్షులుగా విట్ యూనివర్సిటీ వ్యవస్థాపక వైస్‌ఛాన్సలర్ డాక్టర్ జి. విశ్వనాథన్ ఎంపికయ్యారు. చెన్నైలో గురువారం జరిగిన ఐఇఎ జనరల్ బాడీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇటీవల నిర్వహిస్తుంది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యా లయంలో ఐఇఎ తొలి సదస్సు జరిగింది. తాజాగా రెండో సదస్సు నిర్వహణకు సంబంధించి ఏర్పాటైన కమిటీకి అధ్యక్షులుగా డాక్టర్ విశ్వనాథన్‌ను ఎంపిక చేశారు. మద్రాస్ ఎకనామిక్ అసోషియేషన్‌తో కలిసి ప్రొఫెసర్ డాక్టర్ గిల్బర్ట్ స్లేటర్ ఐఇఎను 1917లో స్థాపించారు. ముంబయి. కోల్‌కతా ప్రెసిడెన్సీ విశ్వ విద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్ పెర్సీ ఆనెస్టీ, సీజె హామిల్టన్ అందుకు పూర్తి సహాయ సహకారాలు అందజేశారు.

ఆయూబ్ ఖాన్‌పై పిడి యాక్టు రద్దు

ప్రజాశక్తి - హైదరాబాద్

పలు కేసుల్లో నిందితుడైన అయూబ్ ఖాన్‌పై హైదరాబాద్ నగర పోలీసులు నమోదు చేసిన పిడి యాక్ట్‌ను హైకోర్టు కొట్టివేసింది. న్యాయమూర్తులు సురేశ్ కెయిత్, దుర్గాప్రసాద్‌రావులతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఈ తీర్పు చెప్పింది. అయూబ్ ఖాన్‌పై పిడి యాక్ట్ కింద పెట్టిన కేసు కొట్టేయాలని కోరుతూ ఆయన కుమారుడు షాబాజ్ హైకోర్టును ఆశ్రయించారు. పిడి యాక్ట్ ఉత్తర్వులు, వాటిని సమర్థిస్తూ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జారీ అయిన ఉత్తర్వులు రెండూ కూడా ఇంగ్లిష్‌లోనే ఉన్నా యని, అయితే అయుబ్‌ఖాన్ మాతబాష ఉర్దూ అని ఆయన లాయర్ వాదనలతో బెంచ్ ఏకీభవిస్తూ తీర్పు వెలువరించింది.

కుప్పం నుంచే వైసిపి విజయయాత్ర

ప్రజాశక్తి - చిత్తూరు ప్రతినిధి

వైసిపి విజయయాత్ర చంద్రబాబు నియోజకవర్గమైన కుప్పం నుంచే ప్రారంభం కావాలని వైసిపి అధినేత వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఆయన చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర చిత్తూరు జిల్లా పెద్దూరులో గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక రిటైర్డ్ ఐఎఎస్ ఆఫీసర్ కుప్పంలో మీకు తోడుగా వచ్చేందుకు, నిలబడేందుకు చంద్రమౌళి అన్న వచ్చారని అన్నారు. కుప్పం నియోజకవర్గాన్ని ఏ రోజూ చంద్రమౌళి వదిలిపెట్టలేదని, ఇప్పటికీ కుప్పం ప్రజలకు ఎల్లవేళలా వైసిపి తోడుగా ఉందని అన్నారు. ఇవాళ రాష్ట్రంలో అన్యాయమైన చంద్రబాబు పాలన మీరు చూశారని ప్రతి కార్యకర్త ఓ అర్జునుడులా సవ్యసాచి కావాలని జగన్ పిలుపునిచ్చారు. చిత్తూరు జిల్లాలో అత్యధికమైన బీసీలు ఎక్కడ ఉన్నారంటే అది కుప్పంలోనే ఉన్నారన్నారు. అత్యధిక బీసీలు ఉన్న కుప్పంలో చంద్రబాబు బీసీల్ని మోసం చేస్తున్నారని తెలిపారు. చంద్రగిరిలో బీసీలు తక్కువ ఉన్నారని బీసీలు అమయాకులు అని, మోసం చేయటం సులభమనే కుప్పాన్ని ఎంచుకున్నారని వివరించారు. బీసీ కులానికి ప్రాతినిధ్యం వహిస్తున్న చంద్రమౌళిని వైసిపి మీ ముందుకు తెచ్చిందని చెప్పారు. బీసీల మీద ప్రేమ ఉందంటూ చంద్రబాబు వస్తే బీసీలకు ఏం చేశారని గట్టిగా అడగండని తెలిపారు. బీసీలకు నాలుగు ఇస్త్రీ పెట్టెలు, నాలుగు కత్తెరలు ఇస్తే సరిపోతుందా అని నిలదీయమని సూచించారు. దేవుడి దయవల్ల, మీ అందరి ఆశీర్వాదం వల్ల మన ప్రభుత్వం వస్తే నవరత్నాల ద్వారా పేదవాడు, బీసీలు గొప్పగా లాభపడతారన్నారు. నవరత్నాల వల్ల ప్రతి రైతన్న ముఖంలో నవ్వు కనిపిస్తుందన్నారు.

వైయస్ఆర్ కలలు కన్న సువర్ణయుగం వస్తుందన్నారు. దీనికోసం ప్రతి కార్యకర్త సవ్యసాచి కావాలన్నారు. మన గెలుపు కుప్పం నుంచే ప్రారంభం కావాలన్నారు. ఇక్కడ చాలా మంది వచ్చారు. ప్రతి ఒక్కరినీ పేరుపేరునా కలుసుకునే అవకాశం లేదు. ఎవ్వరూ మరోలా భావించవద్దని కోరారు. ప్రతి ఒక్కరూ నా గుండెల్లో ఉన్నారన్నారు. మీ అందరూ చంద్రమౌళిని గెలిపిస్తే చంద్రబాబు చేసినదాని కంటే ఎక్కువ చేస్తానని తెలిపారు. చంద్రమౌళిని కేబినెట్ లోకి తీసుకొని అంతకంటే ఎక్కువ చేస్తానని స్పష్టం చేశారు. తన పాదయాత్ర కుప్పం వరకు రాకపోవచ్చుని, బస్సు యాత్ర ప్రారంభం అవుతుందని, అందులో ఏయే నియోజకవర్గాలు కవర్ చేయలేకపోయానో వాటిని తను సందర్శిస్తానని చెప్పారు.



పాదయాత్రలో వినతులు స్వీకరిస్తున్న జగన్మోహన్‌రెడ్డి

అక్కడ చంద్రబాబును ఓడిస్తే బీసీలకు న్యాయం
చంద్రమౌళిని గెలిపిస్తే కేబినెట్‌లోకి తీసుకుంటా
చిత్తూరు జిల్లా పెద్దూరు సంకల్పయాత్రలో వైఎస్ జగన్

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68